అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 09 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 12 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

సమ్మె షురూ..

తొలిరోజు బంద్‌లో 20కోట్ల మంది

- స్తంభించిన ఉత్పత్తి, రవాణా రంగాలు
- వేలాదిగా అరెస్టులు
- కార్మికలోకానికి సీఐటీయూ సెల్యూట్



వివరాలు 2లో

బీజేపీకి షాక్

సీబీఐ వివాదంలో కేంద్రం తీరును తప్పబట్టిన సుప్రీం

- ఆలోక్‌వర్మకు బాధ్యతలు అప్పగించాలంటూ తీర్పు
- సీబీఐ స్వయం ప్రతిపత్తి గల సంస్థ
- రాజకీయ జోక్యం తగదు : సుప్రీం



సీబీఐ వివాదంలో మోడీ సర్కార్‌కు షాక్ తగిలింది. అలోక వర్మను తాత్కాలిక సెలవుపై పంపటాన్ని తప్పబడుతూ, తిరిగి ఆయన్ని సీబీఐ చీఫ్‌గా నియమించాలని అత్యున్నత నాయస్థానం తీర్పు చెప్పింది. సీబీఐ వర్సెస్ సీబీఐ కేసులో అలోక్‌వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పుతో కేంద్ర సర్కారుకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై ప్రధాని, ప్రతిపక్షనేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత కమిటీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సుప్రీం పక్కన పెట్టింది.

వివరాలు 12లో

ప్రధానిగా మరొకరైతే రాజీనామా చేసేవారే : సీపీఐ(ఎం) 12లో

ముమ్మాటికీ ఎన్నికల స్టంటే

పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘిస్తున్న బీజేపీ



- ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలివ్వకుండా ఈ తతంగమేంటీ?
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల మాటేమిటి? : ఏచూరి

వివరాలు 9లో

మరో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసం

1000 కోట్ల వరకు టోకరా


- 58 మంది అరెస్ట్
- రూ. 2.7 కోట్లు సీజ్ : సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్

వివరాలు 9లో

అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం ఆత్మహత్య లాంటిది

భారత్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సిద్ధం : ఇమ్రాన్

వివరాలు 7లో


కోల్‌కతాలో మూతపడిన బ్యాంకు కార్యాలయం


బెంగళూరులో కార్మికుల మహా ప్రదర్శన


శ్రీనగర్‌లో




గువహతిలో నిలిచిపోయిన బస్సులు


కోజికోడ్‌లో


మాల్దాలో

సమ్మె షురూ...


పాట్నాలో...

తొలి రోజు బంద్‌లో 20 కోట్ల మంది కార్మికులు

స్తంభించిన ఉత్పత్తి, రవాణా రంగాలు

- వేలాదిగా అరెస్టులు
- కార్మికలోకానికి సీఐటీయూ సెల్యూట్

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జరిగిన సార్వత్రిక సమ్మె జయప్రదమైంది. బుధవారం కూడా ఈ సమ్మె కొనసాగనున్నది. సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన దాదాపు 20కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగ, బహుళ జాతి కంపెనీలు, క్వాసీ ప్రభుత్వ రంగాలు, పథకాల కార్మికులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. ఈ సమ్మెకు అన్నిరంగాల ప్రజల నుండి అశేషమైన మద్దతు, సంఘీభావం లభించింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు సమ్మెలో చేతులు కలిపారు.

ప్రదర్శనలు, ర్యాలీల్లో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు చోట్ల రాస్తారోకోలు, రైల్‌రోకోలు జరిగాయి. దీంతో చాలా చోట్ల రైళ్ళు నిలిచిపోయాయి. కేరళ, అసోం, ఒడిషా, కర్నాటకలోని పలు జిల్లాలు, ఈశాన్య రాష్ట్రాలతో సహా పలు రాష్ట్రాల్లో బంద్ తరహా వాతావరణం కనిపించింది. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లతో సహా పలు రాష్ట్రాల్లో రవాణా స్తంభించింది. మధ్యప్రదేశ్‌లో 22 జిల్లాల్లో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.. జమ్మూ కాశ్మీర్‌లో అంతర్రాష్ట్ర బస్సులు తిరగలేదు. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతగా భయోత్పాతాన్ని సృష్టించిన ప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో బంద్ ప్రభావం చాలా స్పష్టంగా కనిపించింది. సరుకుల రవాణా, ప్రయాణికుల రాకపోకలు స్తంభించాయి. జనపనార, ఇంజనీరింగ్ పరిశ్రమలతో సహా పలు పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి. త్రిపురలో ప్రభుత్వం, బీజేపీ ఎంతగా ఒత్తిడి తీసుకువచ్చినా 30శాతానికి మించి బస్సులు నడవలేదు. 30శాతం దుకాణాలు కూడ తెరవలేదు. ఇక గిరిజన ప్రాంతాలైతే బంద్ పూర్తిగా పాటించారు.



అమృత్‌సర్‌లో

స్తంభించిన పారిశ్రామిక వాడలు

ఎన్‌సీఆర్ ఢిల్లీ పారిశ్రామిక ప్రాంతాలు, 24 పరగణాలు, హుగ్లీ, హౌరా జిల్లాల్లో సమ్మె ప్రభావంగా పూర్తిగా కనిపించింది. అసోంలోని చమురు శుద్ధి కర్మాగారాల్లో, పూణే, నాసిక్, ఔరంగాబాద్, బెంగళూరు, మైసూరు, లూధియానా, జైపూర్‌లోని బొకారో, రాంచి, ఆదిత్యాపూర్ పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా బంద్ 100శాతం విజయవంతమైంది. బరోడాలోని ఇంజనీరింగ్ యూనిట్లలో, సూరత్, భావ్‌నగర్, రాజ్‌కోట్, జునాగఢ్, అహ్మదాబాద్‌ల్లో, హైదరా బాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లోని పారిశ్రామిక వాడల్లో బంద్ ప్రశాంతంగా, జయప్రదంగా జరిగింది. బాష్, సియట్, క్రాంప్టన్, శాంసొనైట్, వోల్వో, టయోటా అన్ని శాఖల్లోనూ బంద్ సంపూర్ణమైంది. దేశవ్యాప్తంగా కార్మికులందరూ తమ కార్యకలాపాలను బహిష్కరించారు. వేలాదిగా బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి, రవాణా

బొగ్గు పరిశ్రమలో ఉత్పత్తి, రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. వైజాగ్, సేలం ఉక్కు కర్మాగారాల్లో పూర్తిగా, రూర్కెలా, భద్రావతి కర్మాగారాల్లో దాదాపు 50శాతం పనులు నిలిచిపోయాయి. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను జయప్రదం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. రైల్వే ఉద్యోగులు సమ్మెలో పాల్గొననప్పటికీ పలు చోట్ల మద్దతు తెలిపారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులు, గూడ్స్ షెడ్ కార్మికులు, సఫారీ కర్మాచారిలు ఈ నిరసన గళంతో గొంతు కలిపారు. అసోం, పశ్చిమ బెంగాల్, కేరళల్లోని తేయాకు తోటల్లో కార్యకలాపాలు స్తంభించాయి.

సంఘటితమైన అసంఘటిత రంగం

బీడి కార్మికులు, నిర్మాణరంగం, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, దుకాణాలు, ప్రైవేటు ఆస్పత్రుల ఉద్యోగులు అందరూ సమ్మెతో చేతులు కలిపారు. రైలు రోకో, రాస్తారోకోలతో ట్రాఫిక్ స్తంభించింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సంపూర్ణం

బీమా, బీఎస్‌ఎన్‌ఎల్‌ల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. పోస్టల్, ఆదాయ పన్ను, అణు ఇంధన శాఖల ఉద్యోగులతో సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో కార్యాలయాలు వెలవెలబోతూ కనిపించాయి. త్రిపురలో టీచర్లు పాఠశాలలకు హాజరు కావాలని బలవంతం చేసినా విద్యార్థులు కనిపించలేదు.

వేలాదిమంది అరెస్టులు

పశ్చిమ బెంగాల్, అసోం, జార్ఖండ్‌లతో సహా పలు రాష్ట్రాల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను అరెస్టు చేశారు. వేలాదిమంది సీఐటీయూ, వామపక్షాల కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. సమ్మెకు వ్యతిరేకంగా బీఎంఎస్ సాగించిన ప్రచారాన్ని కార్మికలోకం యావత్తు నిర్ద్వంద్వంగా తిరస్కరించిందని బంద్ జయప్రదంతో స్పష్టమైంది. పలు రాష్ట్రాలు, రంగాల్లో బిఎంఎస్ కార్మికులు కూడా సమ్మెల్లో పాల్గొన్నారు.

అనూహ్యమైన రీతిలో సమ్మె సక్సెస్ కావడంతో కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో వున్నారో మరోసారి స్పష్టమైంది. ఒకపక్క బడా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ, మరోపక్క నయా ఉదారవాద విధానాలతో కార్మికుల జీవన భృతిపై చేస్తున్న దాడుల పట్ల తమ ఆవేశాన్ని, మోడీ ప్రభుత్వం పట్ల అసంతృప్తిని వెళ్లగక్కారు.

కార్మికుల హెచ్చరిక

తమ మౌలిక హక్కులు, జీవన పరిస్థితులపై దాడి చేస్తే సహించేది లేదని భారత ప్రభుత్వానికి కార్మిక లోకం ఇచ్చిన హెచ్చరిక ఇది. కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశాన్ని తాకట్టు పెట్టే విధానాలను సహించబోమని, రోజువారీ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతోన్మాదశక్తులు పాల్పడే కుట్రలు, కుయుక్తులను పారనివ్వబోమని కార్మికులు హెచ్చరించారు.


పాట్నాలో



లక్నోలో...



సీఐటీయూ అభినందనలు

సమ్మెను సంపూర్ణంగా జయప్రదం చేసిన కార్మిక లోకానికి సీఐటీయూ అభినందనలు తెలియచేసింది. కార్మిక చట్టానికి తీసుకురానున్న కార్మిక వ్యతిరేక సవరణలను తక్షణమే నిలుపుచేయాలని, సంయుక్త కార్మికోద్యమం లేవనెత్తిన డిమాండ్లపై వెంటనే నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కింది స్థాయి నుండి కార్మికుల ఐక్యత మరింత బలోపేతం కావడానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. నయా ఉదారవాద విధానాలను తిరస్కరించేందుకు మరింత ఉధృత పోరాటాలకు సమాయత్తం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చింది.

సీపీఐ(ఎం) నేతల ఇండ్లపై నాటుబాంబులతో దాడులు



కోజికోడ్: కేరళలో శబరిమల అంశంలో సీపీఐ(ఎం) నేతలపై కాషాయమూకల దాడులు ఆగడంలేదు. మంగళవారం కోజికోడ్‌లోని సీపీఐ(ఎం) కార్యకర్తల ఇండ్లపై కొందరు దుండగులు నాటుబాంబులు విసిరారు. సీపీఐ(ఎం) కోయిలండీ ప్రాంత కమిటీ సభ్యుడు షిజూ ఇంటిపై మొదటగా దాడి జరిగింది. అయితే ఈ దాడుల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. శబరిమలలో గత బుధవారం 50 ఏండ్లలోపు ఇద్దరు మహిళలు ప్రవేశించనప్పటి నుంచి హిందూత్వ సంస్థలు రాష్ట్రవ్యాప్త హర్తాళ్లకు పిలుపునిస్తూ తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అల్లర్లకు సంబంధించి 2,187 కేసులు నమోదు చేశామని, 6,914 మందిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

నక్కీరన్ గోపాల్ కేసులో ఎన్ రామ్‌కు మద్రాస్ హైకోర్టు క్లీన్ చిట్

చెన్నై: నక్కీరన్ పత్రిక ఎడిటర్ గోపాల్ కేసులో ది హిందూ గ్రూప్‌నకు చెందిన సీనియర్ జర్నలిస్టు ఎన్ రామ్‌కు మద్రాస్ హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. తమిళనాడు గవర్నర్ కార్యాలయంపై తన పత్రికలో ఓ కథనం రాసినందుకు గోపాల్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేయగా, ఆయన్ని విడుదల చేయాల్సిందిగా మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. ఆ కేసు విచారణ సందర్భంగా ఏదైనా కథనం రాసినందుకు ఐపీసీ 124 సెక్షన్ కింద మీడియా సంస్థపై చర్యలు తీసుకునే వీలున్నదా, గతంలో ఇలాంటివి ఏమైనా జరిగాయా అంటూ ఎన్ రామ్ అభిప్రాయాన్ని మెజిస్ట్రేట్ తీసుకున్నారు. మీడియాపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని రామ్ తెలిపారు.

'బెస్ట్' ఎంప్లాయీస్ నిరవధిక సమ్మె

- ముంబయిలోని 27 డిపోల్లో నిలిచిపోయిన 3వేల బస్సులు

ముంబయి: బృహన్‌ముంబయి ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్(బెస్ట్) సోమవారం అర్ధరాత్రి నుంచి చేపట్టిన నిరవధిక సమ్మెతో దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో దాని ప్రభావం కనిపించింది. దాదాపు మూడువేల బస్సులు రోడ్డు ఎక్కకుండా డిపోల్లోనే నిలిచిపోయాయి. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బెస్ట్ సంయుక్త కాంగర్ కృతి సమితి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కంపెనీ బడ్జెట్‌ను బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం, నియామకాల పొడగింపు, జీతాల పెంపు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం వంటివి వీరి ప్రధాన డిమాండ్లు. కాగా, సమ్మె అక్రమమని, దీనిని ఇలాగే కొనసాగిస్తే క్రమశిక్షణ చర్యలుంటాయని ఉద్యోగులను యాజమాన్యం హెచ్చరించింది. దీనిపై యాజమాన్యం న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించింది. అయినప్పటికీ నిరవధిక సమ్మెకు ఉద్యోగులు దిగారు. దీంతో నగరంలోని 27 బస్ డిపోల నుంచి బస్సులు కదలలేదు. మొత్తం 2,200 మంది డ్రైవర్లలో ఎనిమిది మంది, 2,259 మంది కండక్టర్లలో కేవలం ఒక్కరు మాత్రమే విధులకు హాజరయ్యారు. అయితే మహారాష్ట్ర ప్రభుత్వం సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగులపై ఎస్మాను ప్రయోగించడానికి సిద్ధమవుతున్నది.


సమ్మెలో 10లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు



న్యూఢిల్లీ : కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పది కేంద్ర కార్మిక సంఘాలు, విభిన్న రంగాలకు చెందిన స్వతంత్ర జాతీయ సమాఖ్యలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జరిగిన సార్వత్రిక బంద్‌లో పది లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన డిమాండ్ల సాధనకు అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ), భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్ఐ)లు సంయుక్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆర్‌ఆర్‌బీ, కేంద్ర సహకార బ్యాంకుల ఉద్యోగులు, ఆఫీసర్లు కూడా రెండు రోజుల పాటు సమ్మెలో పాల్గొంటున్నారని బీఈఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మెకు ఏఐబీఓసీ, ఏఐబీఓఏలు మద్దతు తెలిపాయి. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక ఆర్థిక విధానాలను, బ్యాంకింగ్ రంగ సంస్కరణలను వ్యతిరేకించాలని ఆయన, ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ ఈక్విటీ వాటాలను కుదించడానికి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని బ్యాంకింగ్ యూనియన్లు పిలుపిచ్చాయి. బ్యాంకులను విలీనం చేయడాన్ని, సంఘటితం చేయడాన్ని, బ్యాంకుల్లో శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టుపరం చేయడాన్ని యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వ రంగ బ్యాంకులను మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని, తగిన రీతిలో రిక్రూట్‌మెంట్‌లు చేపట్టాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి.

క్వింటాల్ ఉల్లి రూ.170..!

- మహారాష్ట్రలో దారుణంగా పడిపోయిన ధరలు



ముంబయి: మహారాష్ట్రలో ఉల్లి ధరలు దారుణంగా పడిపోతున్నాయి. అక్కడ దేశంలోనే అతిపెద్ద హోల్‌సేల్ మార్కెట్‌గా పేరు గాంచిన నాసిక్‌లోని లాసల్‌గావ్‌లో వేసవి కాలపు క్వింటాల్ ఉల్లి ధర ఇప్పుడు రూ.170గా ఉంది. మార్కె ట్ యంత్రాంగాలు అందించిన సమాచారం ప్రకారం.. సోమవారం మార్కెట్‌కు వెయ్యి క్వింటాళ్ల మేర ఉల్లి చేరింది. కనిష్ట ధర క్వింటాలుకు రూ.100 పలకగా, గరిష్టంగా 240 రూపాయలుగా నమోదవ్వడం గమనార్హం. 'ప్రస్తుతం మార్కె ట్‌కు చేరుకున్న వేసవి ఉల్లి ఆరు నెలల కిందటివి. తాజాగా ఖరీఫ్ పంట కూడా మార్కెట్‌కు చేరుకుం టున్నది. దీంతో వేసవి ఉల్లికి డిమాండ్ తగ్గి ధరలు పడిపోవ డానికి కారణమవుతున్నాయి' అని హోల్కర్ అన్నారు. కాగా, ఖరీఫ్ పంట ధర మాత్రం క్వింటాలుకు రూ.670 పలుకుతుండటం గమ నార్హం. కాగా, రాష్ట్రంలోని ఉల్లి, ఆలు పంటల కు తగిన మద్దతు ధరలు లభించకపోవడంతో కొందరు రైతులు పీఎంవోకు మనీయార్డర్ చేస్తూ నిరసన వ్యక్తం చేసిన ఘటనలు తెలిసినవే. అయితే ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అక్కడి రైతులకు తగిన భరోసాను ఇవ్వడం మాత్రం విఫలమవుతున్నది.

బీజేపీ అధికార ప్రతినిధి రాజీనామా

డిస్పూర్: లోక్‌సభలో పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందగానే అస్సాంలో బీజేపీ అధికార ప్రతినిధి మెహదీ అలంబోరా పార్టీలోని అన్ని పదవులకు రాజీనామ చేశారు. తన రాజీనామ లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రంజిత్ కుమార్‌దాస్‌కు పంపించారు. బిల్లును వ్యతిరేకిస్తూ బీజేపీకి రాజీనామ చేసిన మొదటి వ్యక్తి అలంబరానే కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పౌరసత్వ సవరణ బిల్లును తాను వ్యతిరేకిస్తున్నాని అన్నారు. ఈ బిల్లువల్ల అస్సాంకు హాని కలుగుతుందన్నారు. దీని వల్ల అస్సామీ భాష, సాంస్కృతుల్లో సంక్షోభం ఏర్పడుతుందనీ అన్నారు. ఈ బిల్లు విషయంలో బీజేపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాని తెలిపారు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో సహా అన్ని పదవులకు రాజీనామ చేసినట్టు ఆయన తెలిపారు.

ఎన్నికల కోసమే..

- అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్ బిల్లుపై మాయావతి



లక్నో : అగ్రవర్ణాల్లో పేదలకు 10శాతం రిజర్వేషన్ బిల్లును బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్‌పీ) నేత మాయావతి స్వాగతించారు. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ బిల్లును తీసుకుని రావడాన్ని ఆమె ప్రశ్నించారు. ఈ బిల్లును 'ఎన్నికల స్టంట్'గా పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని తమ పార్టీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుందని మాయావతి తెలిపారు. ఈ బిల్లు మోడీ ప్రభుత్వం అసంపూర్తిగా తీసుకుని వచ్చిందని, అయితే ప్రభుత్వ నిర్ణయానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని ఆమె తెలిపారు.

కనీస వేతనాలు ఇవ్వాల్సిందే

కార్మికుల జోలికొస్తే గద్దె దింపుతాం





చట్టాలను సవరించొద్దు

- ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో కార్మిక సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'కార్మిక చట్టాలను కుదించడాన్ని ఆపేసి కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాల్సిందే. కార్మిక వర్గంలోనూ మతతత్వాన్ని జొప్పించి కార్మిక ఉద్యమాలను బలహీనపర్చాలని చూస్తే ఊరుకోబోం. నిత్యావసర సరుకుల ధరలను అదుపులోకి తేవాలి. కార్మికుల న్యాయసమ్మతమైన 12 డిమాండ్లనూ నెరవేర్చాలి. సమస్యలు పరిష్కరించకుండా కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మికులకు అన్యాయం చేయొద్దు. కార్మికుల పొట్టగొట్టాలని చూస్తున్న మోడీ సర్కారును గద్దె దింపేందుకు ప్రతి ఒక్క కార్మికుడూ పనిచేయాలి' అని పలు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా తొలిరోజు హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎమ్ఎస్, టీఆర్ఎస్‌కేవీ, ఏఐయుటీయుసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, తదితర రంగాల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వేలాది మంది కార్మికులు ఈ ధర్నాకు తరలివచ్చారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ..ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల కోసం, దేశరక్షణ కోసం ఈ సమ్మె చేపడుతున్నట్టు చెప్పారు. మోడీ సర్కారు కార్మికుల, రైతుల, ప్రజల సంపదను నీరవ్ మోడీ, ఆదానీ, అంబానీ లాంటి దొంగలకు చేరవేస్తున్నదని విమర్శించారు. కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వడానికి పాలకులకు చేతులు రావట్లేదన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రం లక్షల రూపాయల జీతాలను పొందుతున్నారని విమర్శించారు. నరేంద్రమోడీ సర్కారు మహిళలు, దళితులు, మైనార్టీల హక్కులపైనా, రాజ్యాంగంపైనా దాడులు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని కార్మికులు సహించబోరన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ మోడీ సర్కారు చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులను కట్టుబానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అందేలా చూడాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినా మోడీ సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను అనుసరిస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలకు తొత్తుగా మారి స్తబ్ధుగా ఉంటున్నదని విమర్శించారు.

టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగడంతో నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఇవే డిమాండ్లతో గతంలో చేపట్టిన సమ్మెలో బీఎమ్ఎస్ పాల్గొన్నదని, అధికారంలో ఉన్నామని ఈసారి పాల్గొనకుండా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదని హితవు పలికారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ..కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకెళ్తున్న మోడీ సర్కారుకు పతనం తప్పదన్నారు. పబ్లిక్ సెక్టార్‌ను ప్రయివేటుపరం చేస్తుంటే కార్మికులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్‌టర్మ్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

హెచ్‌ఎమ్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. సదానందం గౌడ్ మాట్లాడుతూ పరిశ్రమలోని కార్మికులు మాత్రమే యూనియన్లకు ప్రాతినిధ్యం వహించాలని, కార్మిక సంఘాల నాయకులకు గుర్తింపు సంఘాల యూనియన్‌లో చోటు లేకుండా చేయాలని చూస్తున్న మోడీ సర్కారుకు తగిన బుద్ధి చెప్పాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. యూనియన్ రిజిస్ట్రేషన్ విషయంలో ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు.

ఏఐయుటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్ మాట్లాడుతూ జీతం 10 రూపాయలు పెరిగితే జీవన వ్యయ ఖర్చు వంద రూపాయలకు పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీమ్ వర్కర్లు వెయ్యి నుంచి 5 వేల రూపాయల గౌరవవేతనంతో బతుకులీడుస్తున్నారని గుర్తుచేశారు.

ఐఎఫ్‌ఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం మాట్లాడుతూ మందిరాలు, పటేల్, శివాజీ విగ్రహాలను తర్వాత కడుదురుగానీ...ముందు కార్మికులకు కనీస వేతనాలు దక్కేలా చూడాలని మోడీ సర్కార్‌కు సూచించారు. మనుషులను మనిషులుగా చూడటం నేర్చుకోవాలని, గోవుల పేరిట మనుషులను చంపే దుర్మార్గాన్ని విడనాడాలని హితవు పలికారు.

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.కె.బోస్ మాట్లాడుతూ బ్యాంకుల విలీనం, మూసివేతలతో వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. నోట్లరద్దు, జీఎస్టీలతో పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయి కార్మికులను తొలిగిస్తున్నాయన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యద్వి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ మతం, కులం పేరుతో కార్మికులను విడగొట్టి పబ్బం గడుపుకోవాలని మోడీ సర్కారు చూస్తోందని విమర్శించారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ మహాధర్నాకు అధ్యక్షవర్గంగా కె.ఈశ్వర్‌రావు (సీఐటీయూ), నారాయణ (టీఆర్ఎస్‌కేవీ), చంద్రశేఖర్(ఐఎన్‌టీయూసీ), ఎం.నర్సింహ(ఏఐటీయూసీ), అక్బరుద్దీన్(హెచ్‌ఎమ్ఎస్), ఎస్ఎల్ పద్మ(ఇఫ్టూ), ఎం.సత్యనారాయణ(టీఎన్‌టీయూసీ), జి.అనురాధ(ఇఫ్టూ), కె.రాజిరెడ్డి (ఆర్‌టీసీ), పి.కృష్ణమూర్తి, మోత్కూరి నరహరి(పెన్షనర్ల సంఘం), వి.నాగేశ్వర్‌రావు(సిజి కాన్ఫడరేషన్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట్రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి.వెంకట్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్, ఎమ్ఎన్.రెడ్డి, ఆటోయూనియన్ జేఏసీ చైర్మెన్ ఎస్‌కె. సల్లావుద్దీన్, బెఫి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, ఏఐబీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఏసురత్నం(మున్సిపల్ వర్కర్స్‌యూనియన్), చంద్రయ్య(డిఫెన్స్), భిక్షమయ్య(జాతీయ గ్రామీణ ప్రాంత బ్యాంకుల సంఘం), తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం మెడలు వంచుతాం...

ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికుల ఆగ్రహం

జిల్లాల్లో లక్షలాది మంది నిరసన.. మోడీ దిష్టిబొమ్మలు దహనం

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, ప్రదర్శనలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-యంత్రాంగం

కార్మిక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ రెండ్రోజుల పాటు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె జిల్లాల్లో మంగళవారం విజయవంతమైంది. పలురంగాలు, పరిశ్రమలకు చెందిన కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు రహదారులపై సమ్మెలో భాగంగా బైటాయించారు. భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించగా.. పలుచోట్ల ప్రధాని మోడీ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కలెక్టరేట్లు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు ధర్నాలతో దద్దరిల్లగా.. ఆర్టీసీ కార్మికులూ సమ్మెలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఆటో, ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్, ఆస్పత్రి ఉద్యోగులు గణనీయ సంఖ్యల్లో సమ్మె చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, తుర్కయంజాల్, చందానగర్, కూకట్‌పల్లిలో ర్యాలీలు కొనసాగాయి. సూరారంలోని షాపూర్‌నగర్ నుంచి జీడిమెట్ల డిపో సూపర్ మ్యాక్స్ కంపెనీ వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రయివేటు రంగ పారిశ్రామిక కార్మికులు సంపూర్ణంగా సమ్మె చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీడీ రంగంలోని అన్ని కేటగిరీల కార్మికులు, వరంగల్ అర్బన్ జిల్లాల్లో గ్రెయిన్ మార్కెట్ హమాలీలు సమ్మెలో చురుగ్గా పాల్గొన్నారు. ఖమ్మం, కొత్తగూడెం, కరీంనగర్, సూర్యాపేట, జనగామ, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, భవన నిర్మాణం, తోపుడు బండ్లు, రిటైల్ వ్యాపారులు, షాపు గుమస్తాలు తదితర అసంఘటిత రంగ కార్మికులు లక్షలాది సమ్మెలో ఉన్నారు. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు దురుసుగా వ్యవహరించి కార్మిక సంఘాల నేతలను అరెస్ట్ చేశారు. కొత్తపేట చౌరస్తాలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ, బహిరంగ సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం మెడలు వంచే వరకూ కార్మిక పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్మికులతో పాటు రైతులు, అసంఘటిత రంగాల కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జిల్లావ్యాప్తంగా 50 వేల మంది కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. మల్లికార్జున్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ, ఫ్యాబ్‌సిటీ, మంఖాల్ పారిశ్రామిక వాడలో చేపట్టిన ర్యాలీలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహా రావుతో పాటు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.దత్తునా యక్ పాల్గొన్నారు. తలకొండపల్లి మండలంలో వ్యకాస రాష్ట్ర నాయకులు కాన్గుల వెంకటయ్య హాజరయ్యారు. షాద్‌నగర్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మైపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లె గోపాల్ మాట్లాడారు. పాతబస్టాండులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను విస్మరించాయనీ, రాబోయే ఎన్నికల్లో ప్రధాని మోడీ ప్రభుత్వం పతనం కాక తప్పదనీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. జనగామ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్య క్షురాలు ఎస్వీ రమ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టేందుకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు.

ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు సుమారు వెయ్యి మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సమ్మెకు సంఘీభావం తెలుపుతూ నిరసన తెలిపారు. విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ కార్మిక సంఘాలు, ఇంజనీర్స్ సంఘాలు కలిసి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నల్లగొండ జిల్లాలో టౌన్‌హాల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగగా.. డీసీసీబీ, గ్రామీణ వికాస్ బ్యాంకు ఉద్యోగులు బ్యాంకుల ఎదుట బైటాయించారు. మిర్యాల గూడ పట్టణంలో బ్యాంకులు మూతబడ్డాయి, యాదాద్రి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మందికి పైగా కార్మికులు బంద్‌లో పాల్గొన్నారు.

కరీంనగర్-1, 2 డిపోల ఎదుట టీఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కాల్వ నర్సయ్య యాదవ్‌ల ఆధ్వర్యంలో పలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు, వైపని, టెక్స్‌టైల్ పార్క్, పవర్‌లూం, మున్సిపల్ కార్మికులు, గుమస్తాలు సుమారు 2 వేల మంది కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో పోస్టల్, ఇతర కార్మికులు నినాదాలు చేశారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ర్యాలీకి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి హాజరయ్యారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టగా.. ప్రాంగణంలో పోలీసులు ర్యాలీని అనుమతించకపోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల తీరుకు నిరసనగా కోర్టు చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

కార్యాలయ నిర్మాణానికి విరాళం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీలో టీఆర్ఎస్ పార్టీ ఆఫీసు నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ ఉపాధ్యక్షులు వసిలి చంద్రశేఖర ప్రసాద్ రూ.ఐదు లక్షల విరాళమిచ్చారు. మంగళవారం ఆయన కేటీఆర్‌ను కలిసి అందుకు సంబంధించిన చెక్కును అందజేశారు.

హామీలిచ్చారు...అమలు విస్మరించారు

ఇన్సూరెన్స్ ఉద్యోగుల సమ్మెలో సాయిబాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గతంలో ఏ ప్రధాని ఇవ్వనన్నీ హామీలను నరేంద్రమోడీ ఇచ్చారని, అయినా వాటిని అమలును విస్మరించారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సాయిబాబు విమర్శించారు. సార్వత్రిక సమ్మె ప్రధాని నరేంద్రమోడీకి వ్యతిరేకంగానో, లేక బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం కాదని, దేశంలోని కార్మిక, ఉద్యోగ వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయనుందకు ఈ పోరాటం జరుగుతుందన్నారు. మంగళవారం ఎల్ఐసీ భవన్ వద్ద 'ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ), ఆలిండియా ఎల్ఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎల్ఐసీఈఎఫ్) సంయుక్తంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న రెండురోజుల సార్వత్రిక సమ్మెలో భాగంగా చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా బీజేపీ కార్మిక, ఉద్యోగులకు అనేక హామీలిచ్చిందని, ఐదేండ్లు అవుతున్న వాటిని అమలు చేయడం లేదన్నారు. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, శ్రమేవ జయతే అన్న బీజేపీ, నినాదాలకే పరిమితమైందని విమర్శించారు. సరళీకరణ ఆర్థిక విధానాలపై మోడీ ఇచ్చిన వాగ్దానాలకు చాలా మంది మురిసిపోయారని చెప్పారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులు మోడీని ప్రోత్సహించారని చెప్పారు. 30 ఏండ్లలో సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని, మోడీ వాగ్దానాలను నమ్మి ప్రజలు సంపూర్ణ మెజార్టీ ఇచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. ఆ విధానాలు ఎవరినీ వదిలి పెట్టడం లేదని విమర్శించారు. దేశంలో వామపక్ష కార్మిక సంఘాలపై సీఐటీయూ, ఏఐటీయూసీ 28 ఏండ్ల మహాప్రస్థానంలో, మహాపోరాటాల్లో కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. సాధారణంగా కార్మిక సంఘాలు, ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘాలు తమ సంస్థలో వేతన సవరణ కోసమో, ఇతర డిమాండ్ల కోసమో యాజమాన్యాలతో ఘర్షణ పడుతుంటా యని, కానీ ఈ సమ్మె కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమం జరుగుతున్నదని చెప్పారు.



బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక సమ్మెలు జరిగాయని, పార్లమెంటు ముట్టడి చేపట్టామని గుర్తు చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి యన్ అదీష్‌రెడ్డి మాట్లాడుతూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సేవారంగంలో అవసరం లేకున్నా ఎందుకు ఆహ్వానిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు నష్టపూరిత నూతన పెన్షన్ విధానాన్ని ఎత్తి వేయడానికి ఉన్న ఇబ్బందులేవో వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి వి రమేష్, యూనియన్ డి నగేష్, గంగరాజు, ప్రేమన్‌దాస్, పి మహేష్, రమేష్, తిరుపతయ్య తదితరులు మాట్లాడారు.

సంపాదకీయం

మోడీకి ఎదురుదెబ్బ


సీబీఐ వివాదంలో మోడీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ డైరెక్టర్‌గా ఉన్న అలోక్‌వర్మ విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అలోక్‌వర్మను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు గతేడాది అక్టోబర్ 23న అర్ధరాత్రి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌నుకొట్టివేసింది. తనను సెలవుపై పంపుతూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ వర్మ ఇచ్చిన పిటిషన్‌పై మంగళ వారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి రంజన్ గొగొయ్ ఈ తీర్పు నిచ్చారు. రాఫెల్ కుంభకోణం ఒకవైపు దేశాన్ని కుదిపేస్తున్న తరుణంలో ఆ కేసును విచారిస్తున్న అలోక్‌వర్మకు అను కూలంగా తీర్పురావడం మోడీకి చెం పపెట్టు లాంటిదే. రాఫెల్‌పై తప్పుడు పత్రాలు చూపి న్యాయస్థానం నుండి క్లీన్‌చిట్ అందుకోవడం, పార్లమెంటులో విపక్షాలపై ఎదురుదాడి చేస్తున్న సమయంలో సుప్రీం ఈ నిర్ణయం కమలనాధులకు మింగుడుపడని అంశం. కోర్టు తాజా నిర్ణయంతో తాత్కాలికంగా తాము నియమించిన నాగేశ్వరరావు స్థానంలో అలోక్‌వర్మ తిరిగి బాధ్యతలు తీసు కోనుండడం కేంద్రం పెద్దలకు తలనొప్పే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, ప్రతిపక్షనేత ఆధ్వర్యంలో వారం రోజుల్లో ఏర్పడే ఉన్నతస్థాయి కమిటీ వర్మపై వచ్చిన ఆరోపణలను విచారించేవరకూ ఆయన ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోకూడదని ఆదేశించడం ఒక్కటే మోడీ ప్రభుత్వానికి ఊరట. ఎన్నికలకు ముందు దూరమైన ఓటర్లను ఆకర్షించేందుకు జిమ్మిక్కులు ప్లే చేస్తున్న మోడీకి వర్మ కేసు కత్తి మీద సామే!

> **ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం స్వతంత్ర సంస్థలతో పాటు రాజ్యాంగ వ్యవస్థలనూ నాశనం చేస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని రక్షించు కోవాల్సిన సమయమిది. ప్రజలు మరింత చైతన్యయుతంగా స్పందించవల్సిన సందర్భమిది.**



స్వతంత్రత, సమగ్రత ఆయువుపట్టుగా ఉండాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో గతేడాది అక్టోబర్ 23న రాత్రి చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలు యావత్ భారతావనిని దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆగమేఘాల మీద కేంద్ర విజిలెన్స్ కమిషన్ విచారణకు ఆదేశించారు. గంటల్లోనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివీసీ) నివేదిక సమర్పించింది. వెనువెంటనే సీబీఐ డైరెక్టర్‌గా ఉన్న అలోక్ వర్మను ఆ పదవి నుంచి తప్పించారు. తప్పని స్థితిలో బీజేపీ నమ్మిన బంటుగా ముద్ర పడిన జాయింట్ డైరెక్టర్ రాకేష్ అస్తానా పైనా వేటు వేసారు. ఆ తర్వాత తాత్కాలిక సీబీఐ డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమిం చారు. ఇదంతా ఓ మిస్టరీ సినిమాను తలపిం చింది. కేంద్రం సాగించిన ఈ నాటకీయ పరిణామాలను మీడియా ద్వారా దేశ మంతా వీక్షించింది. దర్యాప్తు సంస్థలోని ఇద్దరు ఉన్నత స్థాయి అధికారుల మధ్య అంతర్గత కుమ్ములాటలు కేంద్ర ప్రభుత్వానికీ, అలోక్ వర్మకూ మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారడానికి కారణం మోడీ సర్కారేనని కోడై కూసింది. బలవంతంగా తనను సెలవుపై పంపడంతో పాటు సీబీఐ అధిపతిగా తన కార్యనిర్వాహకాల్లో కేంద్రం జోక్యం చేసుకుందని గట్టి ఆధారాలతో వర్మ పిటిషన్ వేసినందునే ధర్మాసనం ఘాటుగా స్పందించాల్సి వచ్చింది. నోట్ల రద్దు అక్రమాలు, బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు ఉడాయించిన బీజేపీ బంధుమిత్రుల బాగోతాలు, స్వయానా ప్రధానమంత్రి కార్యా లయం వైపే వేలెత్తి చూపిస్తున్న రాఫెల్ కుంభకోణాల సెగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కేంద్ర ప్రభుత్వం తనకు కావాల్సిన కొందరు వ్యక్తులు కోర్టు బోను ఎక్కకుండా రక్షించుకోవడానికే సీబీఐపై మెరుపుదాడికి దిగిందన్నది సుస్పష్టం. రాజకీయంగా తనకు సాను కూలంగా లేని వర్మను ఆనాడు డైరెక్టర్ పదవి నుంచి తప్పించడానికి కేంద్రం ఆడిన నాటకం ఇది. వర్మను దొంగగా చూపేందుకు అస్తానా పేరుతో దొంగ స్టేట్‌మెంట్లు రావడానికి చేయాల్సిదంతా చేసింది. అయినా అధికారుల తొలగింపును ఎవరూ స్వాగతించే సాహసం చేయలేదు. వర్మ తొలగింపును అత్యున్నత న్యాయస్థానం కూడా సమర్థించకపోవడం కేంద్రానికి చెంపపెట్టు. వర్మను సెలవుపై పంపే విషయంలో కేంద్రం నిబంధనలను పాటించలేదని కోర్టు మొట్టికాయలు వేయడం గమనార్హం. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లోని సెక్షన్ 4బి ప్రకారం సీబీఐ డైరెక్టర్‌కు రెండేండ్ల పదవీ కాలం కచ్చితం చేయబడింది. డైరెక్టర్‌ను నియమించే అత్యున్నత స్థాయి కమిటీ (ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన హైపవర్ కమిటీ) నిర్ణయిస్తే మినహా ఆయనను రెండేండ్ల పదవీ కాలంలోగా బదిలీ చేయడానికి వీలు లేదని కూడా ఈ చట్టం ఉద్దేశం. దాని ఆధారంగానే వర్మను పంపే అధికారం సీవీసీ, ప్రధాని నేతత్వంలోని నియామకాల కమిటీకి లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఒక అత్యున్నతమైన దర్యాప్తు సంస్థగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన సంస్థగా ఉండాల్సిన సీబీఐని ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీ సీబీఐని చెప్పుచేతల్లో ఉంచుకుంది. ఆ పరిణామాలతోనే సీబీఐ 'పంజరంలో చిలుక' కాదు అని చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం స్వతంత్ర సంస్థలతో పాటు రాజ్యాంగ వ్యవస్థలనూ నాశనం చేస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన సమయమిది. ప్రజలు మరింత చైతన్యయుతంగా స్పందించవల్సిన సందర్భమిది.

ఒక ప్రవచనం విసిరిన వల!



- ప్రభాత్ పట్నాయక్

నయాఉదారవాదం తన ఆధిపత్యాన్ని నిలుపుకోవటం కోసం మేధో చర్చను ఒక ప్రత్యేకమైన ప్రవచనంలో చిక్కుకునేలా చేయటమనే సర్వసాధారణ పద్ధతిని ఉపయోగిస్తుంది. ఉదాహరణకు ఈ మధ్యకాలంలో రిజర్వ్ బ్యాంకు 'స్వయంప్రతిపత్తి'పై జరిగిన చర్చను తీసుకుందాం. ఒకవైపు ప్రభుత్వం, దాని 'ఆశ్రిత పెట్టుబడిదారుల' ముఠా రిజర్వ్ బ్యాంకుపై నియంత్రణ ఉండాలని కోరుతుంటే మరోవైపు ప్రపంచీకరింపబడిన ఫైనాన్స్ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంకు నడవాలని ఇతరులు కోరారు. రిజర్వ్ బ్యాంకుపై ప్రజా లేక పార్లమెంటరీ నియంత్రణ ఉండాలనే విషయాన్ని ఎవరూ లేవనెత్తలేదు. ప్రభుత్వ వ్యయం కోసం రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపయోగించటంపై జరిగిన చర్చలో కూడా ఒక ప్రత్యేకమైన ప్రవచనంలో మేధో చర్చను చిక్కుకునేలాచేసే తీరుని మనం చూస్తాం.

> **గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా ప్రభుత్వం నీరుగారుస్తున్న స్థితిలో మనకు లేనిది వనరులు కాదని, ద్రవ్య పెట్టుబడి ఇష్టాయిష్టాలు ప్రభుత్వ వ్యయం పెంచటానికి అడ్డంకిగా మారాయని గుర్తించటం ముఖ్యం. నయాఉదారవాదం ప్రోత్సహించే బహిరంగ ప్రవచనం ఈ విషయాన్ని మరుగుపర్చాలని చూస్తుంది. ఇలాంటి వలను విసిరే ప్రవచనం నిజ స్వభావాన్ని వామపక్షం ఎండగట్టాలి.**

పన్నులు విధించటానికి, వనరులను అప్పుగా తీసుకోవటానికి అధికారంగల ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచటం కోసం రిజర్వ్ బ్యాంకు నిధులను ఎందుకు కోరవలసి వచ్చింది? అనేది అడగవలసిన ప్రశ్న. దీనికి సమాధానం ఏమిటంటే నయాఉదారవాద పాలనావ్యవస్థలో ప్రపంచీకరింపబడిన ఫైనాన్స్‌కు ఇష్టం లేకుండా తనకు తోచినట్టు చేయగలిగే నిజమైన అధికారం ప్రభుత్వానికి లేదు. పెట్టుబడిదారులపై పన్నులు వేయటం, విత్త లోటు(పెద్దమొత్తంలోవుండే వ్యయాన్ని భరించేందుకు కార్మికులపై పన్నులు విధించటంవల్ల ఉద్యోగితగానీ, సంక్షేమంకానీ పెరగదు)కు పాల్పడటంవంటి చర్యలు ఫైనాన్స్‌కు ఇష్టం ఉండదు కాబట్టి ప్రభుత్వానికి దిక్కు తోచదు. దానితో ఎన్నికలు జరుగుతున్న సంవత్సరంలో పెరుగుతున్న వ్యయాన్ని భరించటానికి ప్రభుత్వం అనివార్యంగా రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులవైపు చూడటవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఏర్పడటానికి నయాఉదారవాద పాలనా వ్యవస్థ స్వభావం కారణం.

ఇక్కడ మరో విషయాన్ని గమనించాలి. ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రతిబింబించనప్పటికీ రిజర్వ్ బ్యాంక్ రిజర్వ్ నిధులను ఉపయోగించటమంటే వాస్తవంలో విత్త లోటును పెంచటమే అవుతుంది. ప్రభుత్వ యాజమన్యంలోని రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను వాడుకునేందుకున్న సులభమార్గం వాటిపై వచ్చే డివిడెండ్‌ను పెంచి ఉపయోగించుకోవటమే. బడ్జెట్‌లో అటువంటి డివిడెండ్ ప్రభుత్వానికి వచ్చే అదనపు ఆదాయంగా కనపడుతుంది. దానితో విత్త లోటు పరిమాణం మారదు. వేరేమాటల్లో చెప్పాలంటే ఈవిధంగా విత్త లోటును పెంచకుండా అధిక వ్యయానికి కావలసిన వనరులను సమకూర్చుకోవచ్చు.

అయితే మనం కేవలం ప్రభుత్వం మీదనే దృష్టిని కేంద్రీకరించటంవల్ల ఈ నిర్ధారణకు రావటం జరుగుతుంది. ఒకవేళ మనం ప్రభుత్వ రంగాన్ని మొత్తంగా తీసుకుంటే అంటే నికరంగా ప్రభుత్వాన్నే కాకుండా రిజర్వ్ బ్యాంకువంటి ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలను కూడా తీసుకున్నట్టయితే ఒకవైపు ప్రభుత్వచేసే ఖర్చువల్ల వ్యయం ఎక్కువగా కనపడుతుంటే మరోవైపు ఆదాయం పెరగనట్టుగా తెలిసేదే. రిజర్వ్ బ్యాంకు ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లించటమంటే ఒక ప్రభుత్వ అంగం నుంచి మరొక ప్రభుత్వ అంగానికి డబ్బు బదిలీ కావటం అని అర్థం. అంతేగానీ ఈ రంగం మొత్తం ఆదాయం పెరగటంగా ఇది ఉండదు. కాబట్టి ప్రభుత్వ బడ్జెట్‌లో విత్త లోటు పెరిగినట్టుగా కనపడకపోయినా ప్రభుత్వ రంగం చేసే మొత్తం వ్యయంలో పెరుగుదల ఎంత ఉంటుందో అంత మొత్తం ప్రభుత్వ రంగంలో లోటు పెరుగుతుంది. అయితే దీని స్థూల ఆర్థిక ప్రభావం సరిగ్గా విత్త లోటు ప్రభావాన్ని పోలిఉంటుంది. వేరేమాటల్లో చెప్పాలంటే రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపయోగించి ప్రభుత్వ వ్యయాన్ని పెంచటం నిగూఢంగా విత్తలోటును పెంచటంతో సమానం అవుతుంది.

దీనితో తక్షణమే ఒక ప్రశ్న తలెత్తుతుంది. విత్త లోటు విధానాన్ని బహిరంగంగా ఎందుకు అనుసరించకూడదు అనేదే ఆ ప్రశ్న. ఇప్పటికే చెప్పినట్టుగా విత్త లోటును ద్రవ్య పెట్టుబడి ఆమోదించదనేది ఈ ప్రశ్నకు సమాధానం అవుతుంది. ఒకవైపు ఫైనాన్స్ ప్రపంచీకరింపబడగా మరోవైపు రాజ్యం జాతి రాజ్యంగానే మిగిలిపోవటంతో ఫైనాన్స్ మాటే చెల్లుతుంది. లేకపోతే సదరు దేశం నుంచి ఫైనాన్స్ తరలిపోయి ఫైనాన్షియల్ సంక్షోభం సంభవించటానికి కారణభూతమౌతుంది. అయితే విత్త లోటు అంటే ఫైనాన్స్‌కు ఇష్టం ఉండకపోవటానికి కారణం ఏమిటి? దీనికి సమాధానంగా విత్త లోటుతో ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని చేసే సైద్ధాంతిక వాదన పరిశీలనకు నిలువదు.

విత్త లోటుతో సంబంధంలేని 'వ్యయం పెరగటం'అనే విషయాన్ని పక్కనబెడితే సమిష్టి డిమాండ్ అధికంగా ఉండటంవల్లనే ఆధార(ద్రవ్యోల్బణం ముందటి) ధరల స్థాయినుంచి ద్రవ్యోల్బణం పెరగటం జరుగుతుంది. ద్రవ్యోల్బణాన్ని సరఫరాను పెంచటం ద్వారా అరికట్టలేము. విత్త లోటుతో ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని అనటమంటే ఆర్థిక వ్యవస్థలో 'పూర్ణ ఉద్యోగిత' ఉందని ఊహించుకోవటమే. అంటే ఆర్థిక వ్యవస్థలో ఎన్నడూ సమిష్టి డిమాండ్‌కు కొరతలేదని చెప్పటమే అవుతుంది. దీని అర్థం 'సే సూత్రం' పనిచేస్తుందని చెప్పటమే. 'ప్రధాన స్రవంతి' ఆర్థిక సిద్ధాంతంలో బాగా ఉపయోగించబడినప్పటికీ ఇదొక స్పష్టమైన మూర్ఖపు ఊహనం.

నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థ డిమాండ్ కొరతవుండే వ్యవస్థ. ఈ వ్యవస్థలో 'సాధారణ కాలాల'ను అటుంచి ఆర్థిక కార్యకలాపాలు విజృంభిస్తున్న(బూమ్) కాలంలో కూడా 'పూర్ణ ఉద్యోగిత' సాధ్యంకాదు. ఇటువంటి పరిస్థితులలో విత్త లోటును విస్తృతంచేస్తే ధరలు గణనీయంగా పెరగపోగా ఉత్పత్తి, ఉద్యోగితలు పెరుగుతాయి. ముఖ్యంగా భారతదేశంలో వినియోగించబడని పారిశ్రామిక సామర్థ్యం ఉంది. అలాగే ఆర్థిక సరళీకరణ కాలమంతా ఆహార ధాన్యాల నిల్వలు 'సాధారణ' స్థాయికంటే ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి విత్త లోటును పెంచటంవల్ల సమిష్టి డిమాండ్ అమితంగా పెరిగి ద్రవ్యోల్బణం ఏర్పడదు. దానికి బదులుగా ఉత్పత్తి, ఉద్యోగితలు పెరుగుతాయి. దీనివల్ల దిగుమతులు పెరిగి విదేశీ మారకపు చెల్లింపుల శేషం మీద కరెంటు ఖాతా లోటు ఎక్కువ అయ్యే అవకాశముంటుందనేది నిజం. అయితే దానిని నియంత్రించటానికి డిమాండ్‌ను కుదించనవసరం లేదు. అందుకోసం దిగుమతులపై పరిమితులను విధించవచ్చు. అమెరికాలో ఇటువంటి విధానాన్ని డోనాల్డ్ ట్రంప్ కూడా ప్రవేశపెట్టాడు.

కాబట్టి విత్త లోటుపట్ల ఫైనాన్స్‌కున్న అయిష్టతకు కారణం విత్త లోటుతో ఏర్పడుతుందని చెప్పే దుష్పరిణామం పరిమిత డిమాండ్‌గల ఆర్థిక వ్యవస్థలో ఏర్పడజాలదు. ఒకవేళ విస్తృతమైన ప్రభుత్వ వ్యయాన్ని పన్నులతో కాకుండా ఎవరికీ



ఇబ్బందిలేని ఋణం తీసుకోవటం ద్వారా భరించటాన్ని ఆర్థిక వ్యవస్థ పనిచేయటానికి ఆవశ్యకమైన మౌలిక అంశంగా వ్యవస్థీకృతం చేసినప్పుడు సమాజంలో పెట్టుబడిదారులు పోషించటానికి ఎటువంటి పాత్ర ఉండదనే వాస్తవమే విత్త లోటును ఫైనాన్స్ ఇష్టపడకపోవటానికి అసలు కారణం. అంటే కొద్ది మంది పెట్టుబడిదారుల 'మృగోల్లాసాన్ని(యానిమల్ స్పిరిట్స్)' రాయితీలు, సబ్సిడీలతో జాగ్రత్తగా పెంచిపోషించవలసిన అవసరం ఇక ఏమాత్రం ఉండదు.

ఎటువంటి పరిస్థితులలోనైనా విత్త లోటు ద్రవ్యోల్బణానికి దారితీస్తుందనేటటువంటి పనికిమాలిన సైద్ధాంతిక వాదనలను ముందుకుతెచ్చి విత్త లోటును ద్రవ్య పెట్టుబడి వ్యతిరేకించటాన్ని సమర్థించినప్పటికీ విత్త లోటును వ్యతిరేకించటానికిగల నిజమైన మౌలిక కారణం ఇదే. అందుకే 'ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ' చట్టాల ద్వారా ఈ వ్యతిరేకతను వ్యవస్థీకృతం చేయటం జరుగుతుంది. ఇందువల్లనే విత్త లోటు విస్తృతీకరణను కప్పిపుచ్చవలసిన అవసరం ఏర్పడింది. రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ప్రభుత్వ వ్యయం కోసం వాడుకోవటమంటే విత్త లోటును పెంచినట్టే అవుతుంది. అయితే విత్త లోటులో అటువంటి పెరుగుదల ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రతిబింబించదు. కాబట్టి అది 'నిరపాయకరం'గా మారుతుంది.


విస్తృతం చేయబడిన ప్రభుత్వ వ్యయాన్ని భరించటం కోసం రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపసంహరించటం నయాఉదార ఆర్థిక వ్యవస్థను, ప్రభుత్వంపై అది విధించే ప్రతిబంధకాలను ఆమోదించటంగా ఈ మొత్తం వాదన ఉంటుంది. అయితే ఎన్నికల అనివార్యతల కారణంగా ఈ ప్రతిబంధకాలను అధిగమించే ప్రయత్నం జరుతుంది. విత్త లోటుతో ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది కాబట్టి అది మంచిదికాదనీ, రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపయోగించుకోవటమంటే విత్త లోటును విస్తృతం చేయటం కాదనే సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. ఈ వాదనను వ్యతిరేకించేవారు నయాఉదారవాద ఆర్థిక వ్యవస్థ విధిస్తున్న ప్రతిబంధకాలను ఆమోదిస్తూ ఈ సిద్ధాంతాన్ని ఆమోదిస్తున్నారు. వారి అభ్యంతరమల్లా రిజర్వ్ బ్యాంకును ప్రభుత్వం ఆదేశించకూడదనే.

నయాఉదారవాద పాలనా చట్రంలో ఈ చర్చ జరుగుతోంది. అయితే ఈ వాస్తవాన్ని ఎక్కడా గుర్తించటం లేదు. నయాఉదారవాద పాలనకు పరిమితమైన ప్రవచనాన్ని సాధారణ సైద్ధాంతిక ప్రవచనంగా చిత్రించటం జరుగుతుంది. అంటే విశ్వంలో మనగలిగేది కేవలం నయాఉదారవాద పాలనా వ్యవస్థ మాత్రమేననే భావన దీనిలో ఉంది. ఈ ప్రవచనంలో ప్రతి ఒక్కరినీ చిక్కుకునేలా చేయటంతో నయాఉదావాద ఆధిపత్యం స్థిరపడేలా చేయటం జరిగింది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ నయాఉదారవాదం పైనే దృష్టిని నిలిపి చర్చించటంవల్ల దానికి భిన్నమైన ప్రత్యామ్నాయం గురించి ఆలోచించే అవకాశం ఉండదు.

రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపయోగించటమంటే విత్త లోటును విస్తృతపరచటంతో సమానమని, అలాగే అలా విస్తృతపరచటం ఏమాత్రం హానికరం కాదని(విత్త లోటుతో ప్రభుత్వ వ్యయాన్ని భరించటం పన్నులను విధించి ప్రభుత్వ వ్యయాన్ని భరించటంకంటే చెడ్డది అనేది సుస్పష్టం) ఒక్కసారి మనం గుర్తించటం జరిగితే నయాఉదారవాద పాలనపై విమర్శ చేయటం సాధ్యపడుతుంది. సంక్షేమంపైన, సామాజిక రంగ కార్యక్రమాలమీద చేసే ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి అని వాదించటం సాధ్యపడుతుంది. ఇందుకు కావలసిన వనరులను సంపన్నులపై పన్నులను విదించి సమకూర్చుకోవాలి. ఒకవేళ అలా చేయటంలో విఫలమైతే ఇందుకోసం రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులను ఉపయోగించినా, ఉపయోగించకపోయినా విత్త లోటును పెంచటం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచటానికి కావలసిన వనరులను సమకూర్చుకోవాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా ప్రభుత్వం నీరుగారుస్తున్న స్థితిలో మనకు లేనిది వనరులు కాదని, ద్రవ్య పెట్టుబడి ఇష్టాయిష్టాలు ప్రభుత్వ వ్యయం పెంచటానికి అడ్డంకిగా మారాయని గుర్తించటం ముఖ్యం. నయాఉదారవాదం ప్రోత్సహించే బహిరంగ ప్రవచనం ఈ విషయాన్ని మరుగుపర్చాలని చూస్తుంది. ఇలాంటి వలను విసిరే ప్రవచనం నిజ స్వభావాన్ని వామపక్షం ఎండగట్టాలి.

(అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999)

చంద్రవ్యూహాలు



జి.వేణుమాధవరావు

వచ్చే ఆరునెలలు ఎన్నికల చుట్టూనే సాగనున్నాయి. ఇప్పటికే తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ నడుస్తున్నది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు రానున్నవి. వాటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలూ ఉంటాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో కేసీఆర్ ప్రశాంతంగా లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించారు. చంద్రబాబు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవల్సి ఉంది. అయితే ఈ ఇద్దరూ మన రెండు రాష్ట్రాలు అనేక సమస్యల్లో ఉండగా జాతీయ రాజకీయాలలో తమ ముద్ర చూపేందుకు పోటీలు పడుతుండడటం విశేషం.

ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో చంద్రబాబు బీజేపీకి వ్యతిరేకంగా ఎన్‌డీఏ వ్యతిరేక పార్టీలతో కలిసి ఫ్రంట్‌కు ఏర్పాట్లు చేస్తుండగా... కాంగ్రెస్ ముక్త్, బీజేపీ ముక్త్ పేరుతో పెడరల్‌ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని కేసీఆర్ చెపుతున్నారు. చంద్ర బాబు చెబుతున్నట్టుగా లోక్‌సభ ఎన్నికలకు ముందు జాతీయ స్థాయిలో ఎన్‌డీఏ వ్యతిరేక పార్టీలన్నీ జతకట్టడం సాధ్యమవుతుందా? కేసీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలతో కలిసిన బూడో ఫ్రంట్ కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయా? అంటే ఇప్పటికిప్పుడు ఆ పరిస్థితులు, వాతావరణం లేవనే చెప్పాలి.

ఏడాది క్రితం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో హడావిడి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్నాయ్నాయంగా ఫ్రంట్‌కు శ్రీకారం చుడతానని కర్నాటక, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల నేతలను కలిశారు. ఇంకేముంది జాతీయ స్థాయిలో మూడో ఫ్రంట్ ఏర్పడబోతుందన్న రీతిలో కలరింగ్ ఇచ్చారు. మోడీ కోసమే ఈ మూడో ఫ్రంట్ అంటూ ప్రచారం జరిగినా కేసీఆర్ కొట్టిపారేశారు. తర్వాత ఏమైందో తెలియదు. ఫెడరల్ ఫ్రంట్ ఊసే లేదు. ఆ తర్వాత ప్రధాని మోడీతో చర్చలు జరపడం, ముందస్తు ఎన్నికలకు వెళ్లడం చకచకా జరిగాయి. తెలంగాణ ఎన్నికల సమయంలో చంద్రబాబు జాతీయ కూటమి పేరుతో హంగామా చేయడంతో కేసీఆర్ కూడా జాతీయ పల్లవి అందుకున్నారు. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు జోష్‌తో కేసీఆర్ పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుసుకున్నా ఆయన ప్రయత్నాలు పలించలేదు. కేసీఆర్, మోడీ అనుకూలురు అని ప్రచారం జరగడంతో ఎన్నికల ముందు ఫెడరల్ ఫ్రంటతో కలవడానికి ఆ ఇద్దరు నేతలు ఇష్టపడలేదు. అఖిలేష్ యాదవ్ కేసీఆర్‌కు అనుకూల ప్రకటన చేసినా కలుసుకునేందుకు ఇష్టపడలేదు. తనపై ప్రచారం జరుగుతున్నట్టుగానే కేసీఆర్ కూడా మోడీని కలుసుకుని ఫెడరల్ ఫ్రంట్‌పై మరిన్ని అనుమానాలకు ఆస్కారం కల్పించారు. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కోసం పోరాడుతున్నానని చెప్పుకునే కేసీఆర్ మోడీని కలుసుకుని తన గెలుపునకు సహకరించిన పథకాలను వివరించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధి కోసమే అయితే బీసీలకు రిజర్వేషన్ల పెంపు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మోడీని గట్టిగా అడిగి ఉండాల్సింది.

మొదట్లో చంద్రబాబు... కేసీఆర్ పెడరల్ ఫ్రంట్ గురించి చర్చ సాగిన సమయంలో తనకు రాష్ట్రమే ముఖ్యమని, జాతీయ రాజకీయాలపై దృష్టి సారించే సమయం ఉండదని తోసిపుచ్చారు. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిని ఎదుర్కొనే క్రమంలో అన్ని పార్టీలను ఏకం చేయడం కోసం, ఎన్‌డీఏకి వ్యతిరేకంగా మరో కూటమిని ఏర్పాటు చేయడానికి తాను జాతీయ రాజకీయాలపై దృష్టి సారించానని చంద్రబాబు ఇప్పుడు చెబుతున్నా దానికి స్థానిక రాజకీయ కారణాలున్నాయన్నది వాస్తవం. ఒకవైపు హోదా విషయంలో మోడీ సర్కార్ ఏపీకి అన్యాయం చేసిందన్న పేరుతో రాష్ట్రంలో ధర్మపోరాట సభలను నిర్వహిస్తూనే, మరోవైపు బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులను, బీజేపీ వ్యతిరేక రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుసుకున్నారు. ఇటీవల వారందరూ కలిసి ఢిల్లీ వేదికగా సమావేశమయ్యారు. ఎన్నికల ముందు కూటమి నిర్మాణం కంటే బీజేపీ, మోడీ విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేయాలని తీర్మానించుకున్నారు. అంటే ఎన్నికల ముందు కూటమి ఏర్పాటు చేయడం సాధ్యం కాదని తేల్చేశారు. దానికి రాష్ట్రాల వారీగా పార్టీలకు వైరుధ్యాలు ఉండటమే కారణం. చంద్రబాబు, కేసీఆర్ ప్రయత్నాలన్నీ ఎన్నికల అనంతరమే ఓ రూపానికొచ్చే అవకాశాలున్నాయి. అయినా రాష్ట్రాల్లో అనేక ప్రజా సమస్యలు పక్కన పెట్టి ఫ్రంట్ పేరుతో కాలమెల్లతీయడం వెనుక వీరిద్దరికీ ఎవరి వ్యూహాలు వారికున్నాయి.

సెల్: 9490099023



ప్రొ॥ హెచ్. వాగీశన్

కులాంతర వివాహాలు నిలిచేది ఎలా?


కుల వివక్షను సమర్థించే మనుధర్మశాస్త్ర దహనం జరిగే డిసెంబర్‌లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో, తన కులానికి బయట మనిషిని పెండ్లి చేసుకున్నదని అనురాధను ఆమె కుటుంబసభ్యులు చంపేసిన ఘటన విషాదం. వాళ్ళు ఇద్దరూ ఒకే ఊరికి చెందిన వారు. పైచదువులు కూడా చదువుకున్నారు. వారు స్వంతంగా బతికే భరోసాతోనే పెండ్లి చేసుకున్నారు. అయినా అనురాధ తల్లిదండ్రులు ఆ పెండ్లిని ఒప్పుకోలేదు. త్వరలో ప్రభుత్వ స్కూల్ టీచర్‌గా ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్న యువతిని కులదురహంకారం కాల్చి చంపింది. సాధారణంగా దళితులు- దళితులు కాని వారికీ మధ్య జరుగుతున్న వివాహాలలో దళిత భాగస్వామి పట్ల చాలా క్రూరంగా ప్రవర్తించడం కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడ ఈ జంటలోని రెండు కులాల వారు ఉత్పత్తి కులాల వారే కావడం మరింత కలత పెట్టించే అంశం.

కులం పరిధి దాటి, చదువుకునే చోట, పనిచేసే చోట వివిధ కులాల యువతీ యువకులు కలిసే అవకాశాలు ఎంతో పెరిగిన కాలంలో, వారి మధ్య పుట్టే ప్రేమలను ఒప్పుకోని కుటుంబాలను ఒప్పించే సామాజిక నిర్మాణాలేవీ మనకు లేవు. కులంలో మాత్రమే జరిగే పెండ్లి కులాన్ని, దాని 'పవిత్రతను', పునరుత్పత్తి చేసే యంత్రాగం కావడం వలన, ఆ వ్యవస్థను మారకుండా కాపాడుతుంది కనుక దానికి చాలామంది మద్దతుంటున్నది. కులాంతర వివాహం చేసుకున్న జంటలున్న గ్రామంలో అధికార స్థానంలో ఉన్న వారికి కూడా కులాంతర వివాహాల పట్ల సాను కూల భావం లేదు. వాళ్ళు కులం దాటి పెండ్లి చేసుకోవడం అనేది శిక్షించాల్సిన నేరం అని భావిస్తూ ఉంటారు. వీళ్ళు ఆ రకంగా కులాంతరవివాహం చేసుకున్నవారి ప్రాణాలకు ముప్పు గా పరిణ మిస్తున్నారు .

పిల్లలు తమ కోరికలకు కొనసాగింపుగా చూసే భావన గ్రామీణ ప్రాంతం పట్టణ ప్రాంతం అన్న తేడా లేకుండా పెరుగుతూ ఉన్నది. తమ పిల్లల ద్వారా తమ సామాజిక హోదాను, నెట్వర్కును పెంచుకోవచ్చు అని భావించే ధోరణి కూడా బలంగానే ఉంది . తల్లిదండ్రులు పిల్లల మీద పెడుతున్న ఖర్చును పెట్టుబడిగా భావిస్తూ ఉన్నారు . సంతానం ఆ రకంగా తల్లిదండ్రులు పెంచుకున్న విలువ గల సరకుగా మారి పోతున్న స్థితి ఉన్నది . అయితే ఈ సరుకు తల్లితండ్రుల ఆలోచనా పరిధులను దాటి ప్రవర్తించడంతో వారు ఉన్మాదులుగా మారిపోతున్నారు.

నిజానికి పిల్లల మీద తల్లిదండ్రులకు ప్రధానంగా ఉండేది బాధ్యత మాత్రమే. కానీ తల్లితండ్రులు తమకు వారి మీద పూర్తి హక్కు ఉన్నట్టు ప్రవర్తిస్తూ ఉంటారు. స్వంత ఆలోచనలు ఏర్పరుచుకునే పిల్లలకు బాధ్యతగా ప్రవర్తించడం ఎట్లా? అని నేర్పడం మాత్రమే వాళ్ళ చేతిలో ఉంటుంది. సమర్థులయిన, బాధ్యత తెలిసిన, స్వంత ఆలోచనలు ఉన్న యవ్వనుల మీద పెద్దలకు నియంత్రణ హక్కు ఉంటుంది అనుకోవడం లోనే పెద్ద సమస్య ఉంది. పిల్లలు, తల్లిదండ్రుల భౌతిక వస్తు సంపద కాదు. వారు తమ తమ వ్యక్తిత్వాలు రూపొందించుకొని ఉన్న మనుషులు. కనుక వారి మీద హక్కు చలాయించాలని కోరుకోవడం తప్పు. తల్లి తండ్రుల కోరికలను వారి పిల్లలు తీర్చాలి అనేది, జరిగితీరవలిసిన శాస్త్ర నియమం ఏమీకాదు . అయితే ఎలాంటి వివాహం చేసుకున్నా తమ తల్లి దండ్రులు తమ మీద ఆధారపడే స్థితి ఉంటే వారిని కనీస మర్యాదతో చూసుకోవడం కూడా యవ్వన జంటల బాధ్యత అనేది మరిచిపోకూడదు. కేవలం హక్కుల పరిభాష మాత్రమే ఆత్మీయ సంబంధాలను నెలకొల్పదు.

ఇక కులాంతర జంటలకు రక్షణగా ప్రభుత్వం ఉండాలి అని భావించడం అసహజం ఏమీ కాదు.



కులాంతర జంటలలో ఎవరిని అయినా వివాహం కారణంగా చంపివేయడం మనవ హక్కు మీద జరిగే తీవ్రమైన దాడి. వీటిని సామాజిక వివక్షతో కూడిన హత్యలుగా పరిగణించాలి, అందులో వివాహం చేసుకున్న ఆడపిల్లను చంపితే దానిలో కుల అహంకారం మాత్రమే కాక లింగ వివక్ష కూడా ఉన్నది అని గుర్తించి కఠినం గా శిక్షించే చట్టపర ఏర్పాటు అవసరం. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు తమకు కులం లేదు అని చెప్పుకునే అవకాశం కూడా కలిపించాల్సి ఉంది. అట్లా తమ కులం చెప్పుకోలేకున్న వారి ఆర్థిక స్థాయిని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలలో కులాంతర వివాహితులకు రిజర్వేషన్ ఇవ్వడం కూడా ఆలోచించదగిన అంశం . కులాంతర వివాహాల పట్ల ప్రభుత్వం ఒక విధాన పర అవగాహనతో ఉండాలి .

వాస్తవానికి కులాంతర జంటలకు ప్రభుత్వ మద్దతుకంటే ముఖ్యంగా సామాజిక మద్దతు అవసరం. కులాంతర వివాహం చేసుకోదలుచుకున్న జంటలు ముందు తమ ఆర్థికస్వాతంత్రం మీద దృష్టి పెట్టాలి . ఆర్థికంగా నిలదొక్కుకున్న కులాంతర వివాహాలు విజయవంతంగా సాగడం గమనించవలసిన అంశం . ప్రధానంగా వాళ్ళు పిల్లలను కనడం అనే అంశం మీదకన్నా తమ సామాజిక, ఆర్థిక స్థితిని సుస్థిరం చేసుకోవడం మీద తొలి రెండు మూడు సంవత్సరాలు దృష్టి సారించాలి . పిల్లలను కని తమ తమ తల్లిదండ్రుల మనుసులు కరిగించడం అనే వ్యూహం పెద్దగా పనికి వచ్చేది కాదు. పై పెచ్చు అది సామజిక ఆర్థిక స్థిరత్వం రూపొందకముందే పిల్లల పోషణ అనే అదనపు ఒత్తిడిని తెస్తుంది . అందుకే కులాంతర వివాహాలు ఆవేశంతో కాక ఆలోచనతో సాగాల్సి ఉంటుంది. ఇరువైపులా తల్లిదండ్రుల నుండి వ్యతి రేకత ఉండే స్థితి,లేక పెద్ద మద్దతు దొరకని స్థితి ఉంటుంది కనుక జంట చాలా సమర్థ వంతంగా నిలబడవలిసి ఉంటుంది .

ప్రస్తుతం మన సమాజం బలమైన పెట్టుబడిదారీ విధానంలో ఉన్నది. ఇటివంటి సమాజంలో ఒకరికి మరొకరిని పట్టించుకోగల తీరికగానీ, ఓపికగానీ వనరులుగానీ ఉండవు. సమిష్టిభావన బలహీనంగా మారుతున్న దశలో కులాంతర జంటలకు వారి వివాహ జీవితపు తొలి ఏండ్లలో గట్టి మద్దతు దొరికే అవకాశం తక్కువ. కులాంతర వివాహాలు చేసుకోదలుచుకున్న జంటలు చాలా వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేయవల్సి ఉంటుంది .

వాళ్ళు బలమైన ఆమోదం పొందిన, అవసరం అయితే ఎంతకైనా తెగించగల వారితో యుద్ధం చేస్తున్నట్టే లెక్క. అది అసమానుల మధ్య జరిగే యుద్ధం. కులాంతర వివాహం చేసుకున్న జంటలు ఈ యుద్ధంలో బలహీన పక్షం. కనుక చాలా రకాల జాగ్రత్తలు తీసుకునే బాధ్యత జంట మీద ఉంటుంది. తమకు మద్దతుగా ఉండే వ్యక్తుల, సముదాయాలతో వీరు నిరంతరం సంబంధంలో ఉండాలి. జిల్లా నుండి గ్రామస్థాయికి కులాంతర వివాహాలకు అనుకూలంగా ఉండే వ్యక్తుల, సంస్థల నెట్వర్క్‌లు రూపొందాల్సి ఉన్నది . కులాంతర వివాహం చేసుకోవాలనుకునే వారికీ, చెసుకున్న వారికీ మానసిక, భౌతిక మద్దతులు ఇచ్చే విజయవంతమైన కులాంతర వివాహితుల అల్లిక ఒకటి ఉండాలి. ముఖ్యంగా అణిచివేతకు గురవుతున్నాం, కులం పేరిట చిన్న చూపుకు గురవుతున్నాం, మాకు అధికారంలో వాటాలేదు అని నినదించే కులసంఘాల బాధ్యులు కులాంతర వివాహాలను ఎట్లా కాపాడుకోవాలి అనే అంశం పట్ల చాలా ఎరుకతో, ముందుచూపుతో ఉండాలి. కులాంతర వివాహాలను వ్యతిరేకించడంలో కుల అహంకార భావన, పితృస్వామ్య దురహంకార భావన కలిసి ఉన్నాయి. రాజ్యాధికారం కోసం సంఘటితం అవుతున్నాం. అని చేప్పే కులసంఘాల వారికి ఈ రెండు దుర్మార్గాల మీద కూడా యుద్ధం చేసే వ్యూహాలు ఉండాలి .

కేవలం కుల దురహంకార హత్యలు జరిగినప్పుడు లొల్లి పెట్టి తరువాత నిశ్శబ్దంలోకి జారిపోవడం విషాదం. మీడియా కూడా విజయవంతం అయిన కులాంతర వివాహాలు చేసుకున్న వారి విజయగాథలను ప్రచారంలో పెట్టాలి . ఏదిఏమైనా తమ పిల్లలు కులాంతర వివాహం చేసుకునే నిర్ణయం తీసుకుంటే తాము దాన్ని ఎట్లా తీసుకోవాలి అన్న ఆలోచన తల్లితండ్రులకు ఉండితీరాలి. కన్నవారిని కడతేర్చడం వలన జరిగే నష్టం అపారం. దురహంకార పూరిత ఆవేశంలో చేసే పనులకు దీర్ఘకాల సామాజిక మద్దతు ఉండదు అన్నది గుర్తులో ఉంచుకోవాలి. ఏదేమైనా కులాంతర వివాహాలను రక్షించుకునేందుకు ఒక బహుముఖ సమగ్ర ప్రయత్నం మాత్రం అత్యవసరం.

సెల్: 9440253089



**'టపటప... టపటప చెమట బొట్టు తాళాలై పడుతుంటే..
కరిగి కండరాల నరాలే స్వరాలు కదుతుంటే...
పాటా పనితోపాటే పుట్టింది... పనిపాటతోటే జత కట్టింది'
జీవితంతో సంగీతానికున్న సంబంధం అలాంటిది.
అభిరుచికోసమైనా.. బాధ్యతగానైనా.. సంగీతం ఓ నిత్య ఉత్సవం.
ఆ ఆనందాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు సంగీత ఉపాధ్యాయిని లావణ్యలత.
ఇటీవలే బెస్ట్ టీచర్‌గా అవార్డు అందుకున్నారు.
ఆ సుస్వర లావణ్యలత పరిచయం మానవికోసం...**

సుస్వర లావణ్యం

సంగీతం పట్ల అభిరుచి ఎట్లా ఏర్పడింది?

మా స్వస్థలం జగ్‌దేవ్‌పూర్. నాన్న చదువుల కోసం నానమ్మ తాతయ్యలు హైదరాబాద్‌కొచ్చారు. అందరినీ మంచి చదువులు చదివించారు. పెదనాన్నగారు ఏజీ ఆఫీసులో పనిచేసి రిటైర్ అయ్యారు. నాన్నగారు ఎంబీబీఎస్ చదివారు. నాన్నకు సంగీతం అంటే చాలా ఇష్టం. అప్పట్లోనే మ్యూజిక్ కాలేజీలో చేరారట కూడా. కానీ టైమింగ్స్ కుదరక... మానేశారు. అమ్మకు సంగీతం అంటే ఇష్టం, పాటలు పాడుతుంది అని చెప్పగానే పెండ్లి కి ఓకే చెప్పారట. నాన్న డాక్టర్ కావడంతో అమ్మ సంతోషించింది. అలా మా ఇంట్లో సంగీత వాతావరణం వచ్చింది. అమ్మ రేడియో అండ్ టీవీ ఆర్టిస్టుగా పనిచేసింది. ఇంటి దగ్గర సంగీతం నేర్పించేది. నాలుగేండ్ల వయసులోనే ఉన్నప్పుడే నేను సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టాను. కానీ టీచర్ అమ్మ కదా... క్లాసులో సీరియస్‌గా కూర్చోకపోయేదాన్నట. తరువాత నన్ను తంపెళ్ల సూర్యనారాయణగారి దగ్గర చేర్చారు. అప్పటినుంచే ప్రొఫెషనల్‌గా నేర్చుకోవడం ప్రారంభమైంది. నాకేమో ఇంజనీరింగ్ చదవాలని ఉండేది. కానీ నాన్న 'ఇంజనీర్స్, డాక్టర్స్ చాలామంది అవుతారు. నీకు మంచి వాయిస్ ఉంది. మ్యూజిక్ పైనే దృష్టి సారించు' అని సలహా ఇచ్చారు. నాన్న సలహా మేరకు డిగ్రీ చేస్తూనే.. సంగీతంలో డిప్లొమా చేశాను. అది పూర్తవ్వగానే 1997లో త్యాగరాజ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాలేజీలో మ్యూజిక్ టీచర్‌గా చేరాను.

గాయని అనగానే... నేపథ్యం పాడాలని కోరుకుంటారు. కానీ భిన్నంగా మీరు టీచింగ్‌ను ఎంచుకున్నారు. రెండింటిలో మీకు ఇష్టమైనది ఏది?

పాడటం ఎవ్వరికైనా ఇష్టమే. మా చెల్లెలు నిత్య సంతోషిణితో కలిసి ప్రదర్శనలు కూడా ఇచ్చాను. అయితే.. ఉద్యోగంలో చేరాక డివోషనల్ రికార్డింగ్స్‌కు వెళ్లాను. కానీ సమయం కుదరకపోయేది. దాంతో మానేశాను. పాడటం, నేర్పించడంలో ఏది ఇష్టం అంటే? రెండూ ఇష్టమే! మ్యూజిక్ కాలేజీలో గురువుగా స్థానం నేను ఊహించుకోలేదు. కాకపోతే చిన్నప్పుడు అమ్మ బోధించే విధానాన్ని గమనించేదాన్ని. అంత తొందరగా నేర్చుకోలేని పిల్లలకు సైతం సులభంగా వచ్చేట్టు చెప్పేది. ఎక్కువమంది ఉన్నప్పుడు... మరీ చిన్నపిల్లలను నాకు అప్పజెప్పేది. అలా బోధించడం నేర్చుకున్నాను. కాలేజీలో టీచింగ్ అనగానే భయపడ్డాను. పది రోజుల తరువాత స్టూడెంట్స్ స్పందన చూశాక సంతోషమనిపించింది. ఈ 22 ఏండ్ల ఎక్స్‌పీరియెన్స్‌లో ఎంతోమంది పిల్లలకు నేర్పించాను. మూవీస్‌వైపు రాలేదన్న బాధ అస్సలు లేదు. ఎందుకంటే పాడటం మనకు సంతోషాన్ని ఇస్తుంది. కానీ.. మనం నేర్పించిన పిల్లలు మన ముందు అద్భుతంగా పాడుతుంటే కలిగే ఆనందం పట్టరానిది.

కాలేజీ గురించి చెప్పండి...?

త్యాగరాజ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్... ప్రభుత్వ కాలేజీ. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పరీక్షలు నిర్వహిస్తుంది. ఇందులో ఫోర్ ఇయర్స్ సర్టిఫికెట్ కోర్సు, రెండేండ్ల డిప్లొమా కోర్సు ఉంటుంది. సర్టిఫికెట్ కోర్సులో సరిగమల నుంచి కీర్తనలు పాడేదాకా నేర్పిస్తే... డిప్లొమాలో లోతైన అధ్యయనం ఉంటుంది. మంచి స్టాండెడ్స్ ఉంటాయి. సిలబస్ ప్రకారం నేర్పిస్తాం. నేర్చుకోవడానికి వయో పరిమితి ఏం లేదు. పదేండ్లు నిండినవారి నుంచి... 60 ఏండ్ల వారి వరకు నేర్చుకోవచ్చు. రెండు బ్యాచ్‌లుగా నేర్పిస్తాం. ఉద్యోగులు, విద్యార్థుల కోసం ఈవినింగ్ క్లాసెస్ ఉంటాయి. మధ్యాహ్నం పూట గృహిణిలు ఎక్కువగా వస్తారు. ఏదో టీవీ సీరియల్స్ చూసేదానికన్నా.. ఏదో ఒకటి నేర్చుకోవాలన్న తపన ఉన్నవాళ్లు వస్తున్నారు. 40 నిమిషాల క్లాసే అయినా.. ఎంతోమందిని కలుస్తారు. మొదట కాలక్షేపం కోసమే వచ్చినా.. తరువాత సీరియస్‌గా తీసుకుంటారు. 'ఇంట్లో టెన్షన్స్ ఉంటాయి. ఈ నలభై నిమిషాలు అన్నీ మరిచిపోతాం. చాలా ఉపశమనం ఉంటుంది. ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంటుంది. సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టాక కోపాలు తగ్గాయి' అని వారు చెబుతుంటే ఆశ్చర్యమేస్తుంది. కాకపోతే ఎగ్జామ్స్ సమయంలో కొంచెం టెన్షన్ పడతారు. కానీ... ఎంజాయ్ చేస్తారు. వోకల్ కాకుండా... వీణ, వాయిలెన్, ఫ్లూట్, తబలా, సితార, మృదంగం వంటి ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా నేర్పిస్తాం. ఇక్కడ కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఆంధ్రనాట్యం కూడా నేర్చుకోవచ్చు.

సంగీతం నేర్చుకోవడానికి ఎక్కువగా ఏ వర్గాల వాళ్లు ఆసక్తి చూపుతున్నారు? ఇక్కడ నేర్చుకున్నవారికి అవకాశాలు ఎలా వస్తున్నాయి?

సంగీతం, నృత్యం వంటి కళలు ఒకప్పుడు కొందరికే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు అన్ని వర్గాల వాళ్లు వస్తున్నారు. అన్ని కులాల వాళ్లు వస్తున్నారు. ఈ పది, పన్నెండేండ్లనుంచి చాలా మార్పు వచ్చింది. ప్రభుత్వ కళాశాల కాబట్టి ప్రభుత్వ కార్యక్రమాలన్నింటికి ఆహ్వానం తప్పనిసరిగా ఉంటుంది. అయితే అంతకుముందు కేవలం లెక్చరర్స్‌కు మాత్రమే అవకాశాలు వస్తుండేవి. కానీ ఈ ఐదేండ్లల్లో పరిస్థితి చాలా మారింది. స్టూడెంట్స్‌కు కూడా ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. మేం గైడెన్స్‌కోసం పక్కనుంటాం అంతే! కేవలం రాష్ట్రం, దేశంలోనే కాదు... విదేశాల్లో సైతం ప్రదర్శనలు నిర్వహిస్తున్నది భాషా సాంస్కృతిక శాఖ. వాటన్నింటికీ మాకు ఆహ్వానం ఉంటుంది. ప్రభుత్వ కార్యక్రమాల కోసం యూఎస్, యూకే, దుబాయ్, ఐసీసీఆర్ తరపున మారిషస్ ఇలా ఎన్నో దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చాం. కల్చరల్ డిపార్ట్‌మెంట్ ప్రోత్సాహం చాలా ఉంది. ఇక ఉపాధి విషయానికొస్తే... ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రత్యేకించి గురుకుల విద్యాలయాల్లో మ్యూజిక్ టీచర్స్‌ను అపాయింట్ చేసేందుకు ప్రభుత్వం సుముఖతతో ఉంది. ఇటీవలే గురుకులాల్లో మా విద్యార్థులు చాలా మంది రిక్రూట్ అయ్యారు. 20 ఏండ్ల తరువాత జరిగిన కొత్త రిక్రూట్‌మెంట్ ఇది.



దాదాపు 25 ఏండ్లు సంగీతం టీచర్‌గా మీ అనుభవం చెప్పండి?

నేను కాలేజీలో చేరేటప్పటికీ... హైదరాబాద్ సిస్టర్స్ వంటి పెద్ద పెద్ద ఆర్టిస్టులున్నారు. అలాంటిది వాళ్ల ముందు నేను క్లాస్ తీసుకోవడమేంటని... ఒక భయం. కానీ ఆవిడ ఏకంగా నాకు థర్డ్ ఇయర్ క్లాస్ వేశారు. పెద్దవాళ్ల దగ్గర నేర్చుకుని... నా దగ్గరకు వచ్చారు. ఎలా ఫీలవుతారో తెలియదు. కానీ... పది రోజులు చెప్పిన తరువాత.. పిల్లలతో అటాచ్‌మెంట్ పెరిగింది. ఓసారి నేను మధ్యలో నాలుగు నెలలు సెలవు పెట్టి, తిరిగి వెళ్లాక పిల్లలు 'మేడం మేం చాలా మిస్సయ్యాం' అంటూ బాధపడ్డారు. గురుశిష్యుల బంధం అలా ఉంటుంది. మా దగ్గర స్టూడెంట్స్ నేర్చుకోవడమే కాదు.. స్టూడెంట్స్ దగ్గరనుంచి నేను నేర్చుకున్నా. 'మీ పిల్లలు బాగా పాడారు' అని ఎవరైనా చెప్పినప్పుడు చాలా గర్వంగా ఉంటుంది.

వారసత్వంగా సంగీతం...

'సెప్టెంబర్ 5న 2018 సంవత్సరానికిగాను.. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్నాను. క్రెడిట్ అంతా మా తల్లిదండ్రులదే. మా కుటుంబ సహకారం చాలా ఉంది. నాన్నగారు డాక్టర్ అయి ఉండి కూడా మమ్మల్ని ప్రోత్సహించారు. ఇప్పటికీ ప్రతి ప్రోగ్రామ్ సమయంలో అడుగుతారు. సలహాలు ఇస్తారు. నా భర్త నాగారం సాయికుమార్, మా అత్తింటివాళ్ల సహకారం చాలా ఉంది. మా పెండ్లయినప్పుడు తను బెంగళూరులో ఉద్యోగం చేసేవారు. రెండేండ్లపాటు చాలా ఇబ్బంది పడ్డాం. నేను ఉద్యోగం మానేస్తా అంటే.. 'కావాలంటే కొద్ది రోజులు సెలవు పెట్టు. కానీ... ఉద్యోగం మానొద్ద'న్నారు. నా కోసం అక్కడ ఉద్యోగం మానేసి వచ్చి... హైదరాబాద్‌లో ఐసీఐసీఐలో చేరారు. తరువాత సత్యం... ఇప్పుడు టెక్ మహీంద్రలో పనిచేస్తున్నారు. నాకు ప్రాక్టీస్ ఉంటే పిల్లలను అత్తయ్య చూసుకునేవాళ్లు. నేను, చెల్లి సంతోషిణి ఇద్దరం చిన్నప్పుడు కూచిపూడి నేర్చుకున్నాం. కలిసి ప్రదర్శనలు కూడా ఇచ్చాం. తరువాత డ్యాన్స్ కొనసాగించలేదు. కానీ పెండ్లయిన పదేండ్ల తరువాత ఓ కాన్సర్ట్ ఉంటే... 'డ్యాన్స్ చేయొచ్చు కదా!' అత్తయ్య ప్రోత్సహించి శిల్పారామంలో ప్రోగ్రామ్ ఇప్పించారు. అంత ప్రోత్సాహం ఉంటుంది. నాకు ఇద్దరు పిల్లలు. కొడుకు గిటార్ నేర్చుకుంటున్నాడు. పాప హిందుస్తానీ నేర్చుకుంటున్నది. ఏదేమైనా సంగీతాన్ని వారసత్వంగా కొనసాగిస్తున్నాం!'



కట్ట కవిత

వెంకటేష్ పిప్పల్ల

అంతా మీ చేతుల్లోనే..!



డిప్రెషన్.. నిస్సహాయుల్ని చేసి నిరాశలో కూరుకుపోయేలా చేస్తుంది. డిప్రెషన్ కలిగించే అంశాలు మహిళల్లో ఎన్నో ఉంటాయి. పునరుత్పత్తి హార్మోన్లు మొదలుకుని, సామాజిక ఒత్తిడి, స్త్రీగా పూర్తి చేయవలసిన బాధ్యతల వరకూ మహిళలను డిప్రెషన్‌కు గురి చేసే అంశాలెన్నో ఉంటాయి. అయితే పరిస్థితులు ఎంత ప్రతికూలంగా కనిపించినా, వాటిని చూసే దృక్కోణాన్ని మార్చుకునే వీలు, వాటి గురించి ఆలోచించే తీరులను అనుకూలంగా మలచుకునే శక్తి మహిళల చేతుల్లోనే ఉంటుందని గ్రహించాలి.

తేలికగా డిప్రెషన్‌లో నుంచి బయటకొచ్చేయటం సాధ్యం కాకపోయినా, దాన్ని అదుపు చేసుకోగలిగే శక్తి మాత్రం తమలోనే ఉంటుందని ప్రతి మహిళా గ్రహించాలి. చిన్న చిన్న పనులతో మొదలుపెట్టి డిప్రెషన్‌ను పారదోలుతూ ఆత్మవిశ్వాసాన్ని నెమ్మదినెమ్మదిగా కూడదీసుకోవాలి. జీవితం మీద ఆశను పెంచుకుని, జీవితానందాన్ని ఆస్వాదించాలి. డిప్రెషన్ మహిళల శరీరం, సామాజిక జీవితం, అనుబంధాలు, వృత్తి.. ఇలా ఎన్నో అంశాల మీద ప్రభావం చూపిస్తుంది. కాబట్టి సమస్య ఉందని గ్రహించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

నోటి పొక్కులా..!



చాలామందికి నోటిపక్కనో, లోపలో, పెదవుల అంచుల్లోనో ముందు దురదలా మొదలై చిన్న పొక్కుల్లా వచ్చి, పుండుగా మారి, క్రమంగా ఎండి, చాలా రోజుల తర్వాత తగ్గుతుంటాయి. నొప్పి సంగతి అలా ఉంచితే ఇవి త్వరగా తగ్గవు. పైగా పెదవులకు పక్కగా మచ్చపడి ఇబ్బందిగా అనిపిస్తుంటాయి. కోల్డ్ సోర్స్‌గా పిలిచే ఈ పొక్కులు వైరస్‌ల కారణంగా వస్తాయి. అయితే కొన్ని చిట్కాలను పాటిస్తే వీటిని త్వరగా తగ్గించుకోవచ్చు.

- పొక్కు రావడానికి ముందు దురద మొదలవగానే కొబ్బరినూనెలో దూదిని ముంచి అక్కడ గంటకోసారి పెట్టడం వల్ల అందులోని లారిక్ ఆమ్లం, ఓలియాక్ ఆమ్లాలు వైరస్‌ను నాశనం చేస్తాయి. ఐస్‌క్యూబ్‌తో రుద్దడం వల్ల కూడా దురద తగ్గి, త్వరగా మానతాయి.
- దూదిని హైడ్రోజన్ పెరాక్సైడ్‌లో ముంచి ప్రతి రెండు మూడు గంటలకోసారి పొక్కుల మీద పెడుతుంటే త్వరగా ఎండి, రాలి పెద్దగా మచ్చపడకుండా ఉంటాయి.
- వెల్లుల్లి రెబ్బను చిదిమి ఆ రసాన్ని పొక్కుమీద రెండు మూడు రోజులకోసారి పెడితే ఫలితం ఉంటుంది. లేదంటే పొద్దున్నే రెండు రెబ్బల్ని తిన్నా అవి త్వరగా తగ్గుతాయి. లేదంటే చిటికెడు సముద్ర ఉప్పును తీసుకుని దాన్ని ఆ పొక్కులమీద నిమిషం పాటు గట్టిగా నొక్కి పెట్టాలి. ఇలా రోజుకి రెండు, మూడుసార్లు చేసినా అవి త్వరగా ఊడి వస్తుంటాయి. రోజుకు రెండుసార్లు తేనెని పొక్కుల మీద రాసి, ఏడెనిమిది నిమిషాలాగి కడిగేసినా మంచిదే.

ప్రతి అడుగులోనూ..!



ఫిట్‌నెస్‌కోసమైతేనేం, బరువు తగ్గేందుకయితేనేం... చాలామంది జిమ్‌లను ఆశ్రయిస్తుంటారు. కానీ పైసా ఖర్చు లేకుండా జిమ్‌తో వచ్చే లాభాలన్నీ పరుగెత్తడం ద్వారా పొందవచ్చు అంటున్నారు వ్యాయామ నిపుణులు. పైగా దీనికోసం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాల్సిన పని లేదు. ఉదయం, సాయంత్రం... ఎప్పుడు వీలయితే అప్పుడు కాలనీలోనో పార్కులోనో పొలంగట్టునో ఓ అరగంటో గంటో పరుగెడితే మాటిమాటికీ హాస్పటల్‌కు వెళ్లాల్సిన పని లేదు. అయితే సాయంత్రం కన్నా ఉదయం పరుగెడితే రోజంతా చురుకుగా అనిపిస్తుంది. ఆ సమయంలో సూర్యకిరణాల వల్ల విటమిన్-డి లోపమూ తలెత్తకుండా ఉంటుంది. తాజా గాలిలోని ఆక్సిజన్, శ్వాస సమస్యలు లేకుండా చేస్తుంది. దాంతో రక్తసరఫరా మెరుగుపడటంతో గుండె ఆరోగ్యం బాగుంటుంది.

పరుగు వల్ల శరీరం మొత్తానికీ వ్యాయామం అవుతుంది. దీనివల్ల జీవక్రియా వేగం పెరిగి, క్యాలరీలన్నీ కరిగిపోతాయి. బరువు తగ్గుతారు. కొలెస్ట్రాల్ ఉండదు. పొట్ట అసలే రాదు. పరుగెత్తేవారిలో మధుమేహ సమస్యలు తక్కువ. బీపీ కూడా అదుపులో ఉంటుంది. పరుగు ఎముకలకీ కండరాలకీ కూడా మంచిదే. అవి బలంగా ఉండేలా చేస్తుంది. చిన్నప్పటి నుండి పరుగెత్తే అలవాటు ఉన్నవాళ్లకి భవిష్యత్తులో కీళ్లసమస్యలూ ఆర్థ్రయిటిస్ సమస్యలూ రాకుండా ఉంటాయి. అయితే గతంలో అలవాటు లేకున్నా ఏ వయసులోనయినా పరుగును ప్రారంభించవచ్చు. ముందు బ్రిస్క్ వాక్‌తో మొదలెట్టి క్రమంగా జాగింగ్‌లోకి మారాలి. ఆ తరవాతి నుంచీ పరుగును వ్యాయామంగా అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యం ఫిట్‌నెస్‌తో పాటు పరుగు మానసిక ఆరోగ్యానికీ తోడ్పడుతుంది. పరుగెత్తేవాళ్లలో ఎండార్ఫిన్లు ఎక్కువగా విడుదలవడంతో నిత్యం సంతోషంగా ఉల్లాసంగా ఉంటారు. పరుగెత్తడంవల్ల హాయిగా నిద్ర పడుతుంది. ఆందోళన, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలు తగ్గుతాయి. పైగా పరుగెత్తే అలవాటు ఉన్నవారిలో పట్టుదల, ఏకాగ్రత.. వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. పరుగు అనేది మనిషిని శారీరకంగానే కాదు, మానసికంగానూ బలవంతుల్ని చేస్తుంది. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యనయినా సమర్థంగా ఎదుర్కొనే స్థైర్యాన్నీ, లక్ష్యాన్ని చేరుకునే ధైర్యాన్నీ అందిస్తుంది. మొత్తమ్మీద పరుగు జీవితాన్ని ఆనంద మయం చేస్తుంది.

రంగవల్లులు

21 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకు





సూర్య శైలజ,
అంబారీపేట,
కథలాపూర్

14 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు
సరిచుక్క వచ్చేవరకు



తందూరు తన్మయి
ఏ.ఎస్‌రావు నగర్
ఇసిఐఎల్

12 చుక్కలు
6 వరుసలు





బానోతు ప్రవళిక
4 వతరగతి

మా చిరునామా
మానవి, నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20.ఇ-మెయిల్: manavi@navatelangana.com

ఇట్లా చేద్దాం

ఈ చలికి తేనె కూడా గట్టిపడిపోతుంది. తిరిగి మామూలు స్థితికి రావాలంటే... ఒక గిన్నెలో నీళ్లు పోసి వేడి చేయాలి. అందులో తేనె సీసాను ఉంచితే చాలు!

ఎన్డీయేవి దివాలాకోరు విధానాలు..

- సమ్మె సందర్భంగా విద్యుత్ సంఘాల నేతలు
- నేడు విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దివాళాకోరు విధానాలను అవలంభిస్తున్నదని పలు విద్యుత్ సంఘాల నేతలు విమర్శించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రయివేటు విద్యుత్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు వీలుగా విద్యుత్ సవరణ బిల్లు-2018ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తున్నాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా చట్టం తీసుకురావటానికి యత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలను వ్యతిరేకించాలని వారు విద్యుత్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సర్కిళ్లు, కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించామని తెలిపారు. 15 సంఘాలతో ఏర్పడిన 'జాతీయ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సమన్వయ కమిటీ' ఆధ్వర్యాన వేలాది మంది కార్మికులు నిరసనల్లో పాల్గొన్నారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని వారు వివరించారు. మింట్ కాంపౌండ్ వద్ద జరిగిన ధర్నాలో నాయకులు రత్నాకరరావు, సదానందం, పద్మారెడ్డి, సాయిబాబా, శ్రీధర్, బిసి రెడ్డి, వజీర్, రాజేంద్రప్రసాద్, అనిల్, కరుణాకర్‌రెడ్డి, కిరణ్, రమేశ్, వెంకన్నగౌడ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ

- సార్వత్రిక సమ్మెకు విద్యార్థి సంఘాల మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాలు విమర్శించాయి. కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు కోట రమేష్ (ఎస్ఎఫ్ఐ), శివరామకృష్ణ (ఏఐఎస్ఎఫ్), బి రాము (పీడీఎస్‌యూ), గంగాధర్ (ఏఐడీఎస్‌వో), ఎం పరుశురామ్ (పీడీఎస్‌యూ), మద్దిలేటి (టీవీవీ) సంయుక్తంగా మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగున్నరేండ్ల కాలంలో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్త సమ్మెలు గతంలో చేసినా కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాల్లో మార్పు రాలేదని తెలిపారు. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలతో ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను విచ్ఛిన్నం చేసిందని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు చేసి ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిందని పేర్కొన్నారు. ఉపాధి కల్పన, కనీస వేతనాల అమలు, కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) రద్దు వంటి సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. విద్యారంగంలో యూజీసీ రద్దు, హెకీ ఏర్పాటు, ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు తగ్గించడం వంటి అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోటీ చేస్తానన్నందుకు దాడి

- వ్యక్తి మృతి

నవతెలంగాణ - తుర్కపల్లి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన వ్యక్తిపై సోదరుని కుటుంబీకులే కొట్టి హత్య చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తర్కపల్లి మండల ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన అజ్మీరా భిక్షుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు రవి(32), రెండో భార్య కుమారుడు లక్ష్మణ్. వారిలో తరచూ కుటుంబ కలహాలు జరుగుతూ ఉండేవి. పంచాయతీ ఎన్నికలు రావడంతో అజ్మీరా రవి వార్డు మెంబరుగా పోటీ చేస్తానని తండాలో ప్రచారం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అజ్మీరా లక్ష్మణ్ జోక్యం చేసుకుని పోటీ చేయొద్దని గొడవ పడ్డాడు.

ఇరువురి మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో లక్ష్మణ్ భార్య రాములమ్మ, వీరి కొడుకు అను, కోడలు శారద, రెండో కొడుకు నరేష్, మేనత్త పౌని కలిసి రవిపై దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు గమనించి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఘటనా స్థలానికి ఏసీపీ మనోహర్‌రెడ్డి, సీఐ ఆంజనేయులు, ఎస్ఐ వెంకటయ్య చేరుకుని పరిశీలించారు. రవి భార్య సబిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వివాహేతర సంబంధంపై నిలదీసినందుకు 'తలాక్'

- అంగీకరించని భార్య
  న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట దీక్ష

నవతెలంగాణ-సుజాత నగర్

వివాహేతర సంబంధంపై నిలదీసినందుకు త్రిపుల్ తలాక్ చెప్పాడు భర్త. దాన్ని నిరసిస్తూ న్యాయం కోసం భర్త ఇంటి ముందు భార్య దీక్ష చేపట్టింది. ఈ ఘటన భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో మంగళవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఖానాపురానికి చెందిన నబీయాతో భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా సుజాతనగర్ మండలానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు అలీమ్ కుమారుడు అలీఫ్ ఫరూక్‌కు 2012 ఫిబ్రవరి 18న వివాహం జరిపించారు. కట్నం కింద రూ.పది లక్షలు, ఫర్నీచర్ ఇచ్చారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఫరూక్ హైద రాబాదులో ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా చేస్తున్నాడు. అయితే, అదనపు కట్నం కోసం నబీయాను భర్త, అత్త, మామ వేధిస్తున్నారు. కుమార్తె కష్టాన్ని చూడలేక నబీ యా తల్లిదండ్రులు అదనపు కట్నం కూడా చెల్లించారు. ఈ క్రమంలోనే మరో మహిళ తో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఫరూక్ నబీయాను వేధించడం ఎక్కువైంది. వివాహేతర సంబంధంపై నబీయా నిలదీయగా ఇద్దరితో కలిసి ఉంటానని చెప్పాడు. అందుకు ఆమె నిరాకరించడంతో మూడు సార్లు తలాక్ చెప్పాడు. దాన్ని తాను అంగీకరించేది లేదనీ, న్యాయం చేయాలనీ భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. అత్తామామలు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని నబీయా బైటాయించింది. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టుకు అటవీశాఖ కూడా అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. సీఎం కేసీఆర్ ఇటీవల ఢిల్లీలో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరారు. వచ్చే ఏడాది జూన్ వరకు ప్రాజెక్టును పూర్తి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది. ఈ ప్రాజెక్టుతో పూర్వపు ఖమ్మం జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. జలయజ్ఞంలో భాగంగా గతంలో మంజూరు చేసిన ఇందిరాసాగర్ రుద్రమ్మకోట, రాజీవ్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకాలను కలిపి రీడిజైన్‌లో భాగంగా సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. పాత డిజైన్‌లో కాల్వలు వన్యప్రాణి అభయారణ్యంలోకి రావటంతో మార్పులు చేవారు. ఈ ప్రాజెక్టుకు రూ. 11,200 కోట్లు ఖర్చవుతుందని ఇటీవల అంచనా వేశారు.

బాబు, మోడీ ఒకే తల్లి కవలలు

సార్వత్రిక సమ్మెలో వామపక్ష నేతలు



అమరావతి: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక లోకం కదంతొక్కింది. విజయవాడ నగరంలో మంగళవారం అన్ని కార్మిక సంఘాలు కలిసి మహా ప్రదర్శన నిర్వహిం చారు. రథం సెంటర్ నుంచి బందర్‌రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకూ ప్రదర్శన సాగింది. వేలాది సంఖ్యలో కార్మికులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బందర్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, పాత ప్రభుత్వాసుపత్రి మీదుగా వెళ్లాలని పోలీసులు తుమ్మల పల్లి కళాక్షేత్రం వద్ద ర్యాలీని అడ్డుకోవడంతో కార్మిక సంఘాల నాయకులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. బందర్ రోడ్డు మీదుగానే ప్రదర్శన కొనసాగి స్తామని తేల్చి చెప్పారు. చివరకు పోలీసులు అనుమతి వ్వడంతో ప్రదర్శన ముందుకు సాగింది. లెనిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించిన అనంతరం సభను నిర్వహిం చారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం గఫూర్ మాట్లాడుతూ మోడీ, చంద్రబాబు ఒకే తల్లి కవలలని, పెట్టుబడిదారులకు తొత్తులేనని అన్నారు. కోట్ల మంది సమ్మె చేసినా చర్చించేందుకు మోడీ ఎందుకు ముందుకు రావడం లేదని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించడంలో సమస్య ఏంటని ప్రశ్నించారు. నిజంగా కార్మికుల ఓట్లు కావాలంటే ప్రభు త్వాలు దిగొచ్చి చర్చలు జరపాల న్నారు. లేకుంటే మోడీ, బాబు ప్రభుత్వాలను బంగాళాఖాతంలో కలుపుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే కార్మికులు రాజకీయ సమాధి కడతారన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కార్మికుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. వైఎస్ఆర్‌టీయూ నాయకులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వాలు ఎందుకు తాత్సారం చేస్తున్నాయని, హక్కుల్ని ఎందుకు నిర్వీర్యం చేస్తున్నా రని ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి పోలారి మాట్లాడుతూ దేశమంటే మనుషులు కాదోయ్... దేశమంటే మల్టీనేషనల్ కంపెనీలోయ్.. అనే పరిస్థితికి మోడీ ప్రభుత్వం వచ్చిందన్నారు. ఏఐసీసీటీయూ నాయకులు హరినాథ్, ఏఐయూటీయూసీ నాయకులు కె సుధీర్ మాట్లాడుతూ కార్మికులు తలచుకుంటే మోడీ, బాబు ప్రభుత్వాలు వచ్చే ఎన్నికల్లో ఉనికిని కోల్పోతాయన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాబురెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలిస్తామని ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి మోసం చేశాయన్నారు. శ్రామిక మహిళ నాయకురాలు రమాదేవి మాట్లాడుతూ మహిళల గురించి గొప్పగా నినాదాలిచ్చే ప్రభుత్వాలు మహిళల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ఉపాధి లేకుండా పిల్లలను ఎలా చదివించుకోవాలని ప్రశ్నించారు. బ్యాంక్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బ్యాంకులపై ఉన్న నమ్మకాన్ని నోట్ల రద్దుతో మోడీ పోగొట్టారన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతో పీఠం కూలుతుందన్న భయం ప్రభుత్వాలకు పట్టుకుందని, సమ్మెలో పాల్గొంటే ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరిస్తున్నాయని అన్నారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ , ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా రాష్ట్రంలో పలు డిపోలో సగానికి పైగా బస్సులు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10 శాతం బస్సులు నిలిచిపోయినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

కాపు, వాల్మీకుల రిజర్వేషన్లు తేల్చాకే మద్దతు

ఎన్నికల్లో లబ్ధి కోసమే 10% రిజర్వేషన్: చంద్రబాబు

- కర్నూలు విమానాశ్రయం ప్రారంభం
  మార్చి నుంచి రెగ్యులర్ విమాన సర్వీసులు



కర్నూలు జిల్లా ఓర్వకల్లులో విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న సీఎం

కర్నూలు: కాపులు, వాల్మీకుల రిజర్వేషన్ల సంగతి తేల్చాకే అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లపై కేంద్రానికి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రధాని మోడీ ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం పూడిచెర్ల గ్రామం వద్ద దాదాపు వెయ్యి ఎకరాల్లో రూ.118 కోట్లతో నిర్మించిన కర్నూలు విమానాశ్రయాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఓర్వకల్లులో నిర్మించిన విమానాశ్రయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి నుంచి కర్నూలు విమానాశ్రయానికి రెగ్యులర్ విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి అమరావతి, తిరుపతి, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీని ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇక్కడ పారిశ్రామికవాడను, ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అల్ట్రా సోలార్ మెగా పార్కును ఏర్పాటు చేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ప్రజలకు విద్యుత్ కొరత లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. కొలిమిగుండ్ల ప్రాంతంలో సిమెంట్ క్లస్టర్ పరిశ్రమను, తంగెడంచెలో విత్తనోత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కర్నూలులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో రూ.120 కోట్లతో చేపట్టనున్న క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేసి, శకునాల, గని గ్రామాల మధ్య 1000 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం కోసిగి మండల కేంద్రానికి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కెఇ.కృష్ణమూర్తి, మంత్రి లోకేష్ హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో బయల్దేరిన ముఖ్యమంత్రి మధ్యలో ఎస్సీ కాలనీ వద్ద ఓ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. సభాస్థలికి చేరుకున్న తర్వాత జలధార, మాఊరి బాట ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ విభాగంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా జగన్ అడ్డుపడుతున్నారని విమర్శించారు. కేసుల నుంచి జగన్ విముక్తి పొందేందుకు మోడీతో జత కట్టారని ఆరోపించారు. కేంద్రం 19 విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

సీపీఐ(ఎం), సీపీఐ, జనసేన నేతల భేటీలో నిర్ణయం



అమరావతి : విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ(ఎం), సీపీఐ, జనసేన నేతల మధ్య జరిగిన సమావేశంలో వర్తమాన రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రజల అభీష్టాలకనుగుణంగా రూపొందించాల్సిన అవసరం ఉందని సమావేశం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జనసేన వామపక్ష పార్టీల నడుమ ఎన్నికల పొత్తును ఏ విధంగా సాకారం చేయ్యాలో, సీట్ల సర్దుబాటు ఏ పద్ధతిన జరగాలో ఖరారు చేసేందుకు వీలైనంత త్వరలో తిరిగి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో ఏపీ ముఖ్యమంత్రి

రాహుల్ గాంధీతో చంద్రబాబు భేటీ

- నేడు రాజకీయపార్టీలతో సమావేశం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. మంగళవారం న్యూఢిల్లీలోని రాహుల్ నివాసానికి చేరుకున్న చంద్రబా బు ఆయనతో సమావేశమయ్యారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలను ఏకం చేయాలనే లక్ష్యంతో గతే డాది డిసెంబర్ 9న హస్తినలో సుమారు 28 రాజకీయ పార్టీలతో జరిగిన భేటీ అయిన విషయం విదితమే. దీనికి కొనసాగింపుగా చంద్రబాబు మంగళవారం ఢిల్లీ పర్యటనకు వచ్చారు. రాహుల్‌తో భేటీ అనంతరం ఎన్సీపీ అధినేత శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరితో చంద్ర బాబు సమావేశమయ్యారు. ఈ నెల 19న కోల్‌కతాలో బహిరంగ సభ తర్వాత దేశవ్యాప్తంగా నిర్వహించే భారీ ర్యాలీలపై నేతలతో చంద్రబాబు చర్చిం చనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఎజెండాను పూర్తిస్థాయిలో ఖరారు చేసే లక్ష్యంతో చంద్రబాబు ఈ పర్యటనకు వచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. జనవరి 19 తర్వాత ఎక్కడ ఎలాంటి సమావేశాలు పెట్టాలి? ఎవరు ఎక్కడ హాజరు కావాలి? ఆయా చోట్ల ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలేంటి? తదితర అంశాలపై చర్చించనున్నారని సమాచారం.

సున్నిత ప్రాంతాలకు అదనపు బలగాల తరలింపు

పంచాయతీ ఎన్నికలకు భద్రత పటిష్టం చేయాలని డీజీపీ ఆదేశం

- అదనపు బలగాలు కోరిన కొన్ని జిల్లాల ఎస్పీలు

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటానికి అదనంగా టీఎస్ఎస్‌పీ బెటాలియన్‌కు చెందిన సాయుధ బలగాలను రంగంలోకి దింపుతున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు స్పెషల్ బెటాలియన్‌కు చెందిన బలగాలను తరలించారు. ఈనెల 21నుంచి మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నామినేషన్ల పర్వం మొదలు కాగా, పలు గ్రామాల్లో వివిధ పార్టీల కార్యకర్తల మధ్య పోటాపోటీ నెలకొన్నది. స్థానికంగా ఉండే వ్యక్తిగత కక్షలు, బల ప్రదర్శన, ఆధిపత్య ధోరణి వల్ల కొన్ని గ్రామాలలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయని డీజీపీ కార్యాలయానికి జిల్లాల ఎస్పీల నుంచి సమాచారం అందుతున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాదాపుగా ఎలాంటి అవాంఛనీయ సంఘనలూ జరగకుండా చూసిన పోలీసు ఉన్నతాధికారులకు పంచాయతీ ఎన్నికలు సవాల్‌గా మారాయి. ముఖ్యంగా గ్రామ కక్షల కారణంగా దాడులు, హత్యలులాంటి పరిస్థితిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఘర్షణలు ఎక్కువగా చోటు చేసుకునే జిల్లాలు, మండలాలు, గ్రామాలను ఎంపిక చేసుకొని అదనంగా బలగాలను మోహరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో కేంద్ర బలగాలను ఉపయోగించరాదనే నిబంధన కారణంగా స్పెషల్ పోలీసు బెటాలియన్‌తోపాటు ఆయా జిల్లాల రిజర్వ్ పోలీసు బలగాలు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ బలగాలు,సీపీఎల్ అంబర్‌పేట్‌కు చెందిన సాయుధ పోలీసు బలగాలను బందోబస్తుకు అధికారులు వినియోగిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డీజీపీ నుంచి అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు వెళ్లాయి.

రాష్ట్రంలో ఉన్న 13 బెటాలియన్‌ల హెడ్‌క్వార్టర్స్ నుంచి సమీపంలోని జిల్లాలకు బలగాలను తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇదిలాఉంటే నల్లగొండ, సూర్యాపేట్, వరంగల్, భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో స్థానిక రాజకీయాలు వాడివేడిగా సాగుతుండటంతో ముందస్తుగానే బలగాలను బందోబస్తుకు వినియోగిస్తున్నారని సమాచారం. కాగా,తమకు అదనంగా బలగాలు కావాలని ఉత్తర తెలంగాణకు చెందిన కొన్ని జిల్లాల ఎస్పీలు డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌ను కోరినట్టు తెలుస్తోంది. అవసరమైన చోట అదనంగా పోలీసు బలగాలను మోహరిస్తున్నామని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ జితేందర్ తెలిపారు. జిల్లాల పోలీసులతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు బలగాలను కూడా బందోబస్తుకు వినియోగిస్తున్నామని చెప్పారు.

ఆరోగ్య సంరక్షకులుగా సైకాలజిస్టులు

- కేంద్ర ప్రకటనపై
  డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హర్షం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సైకాలజిస్టులను, కౌన్సెలింగ్ వృత్తిలో ఉన్నవారిని మానసిక ఆరోగ్య నిపుణులుగా గుర్తిస్తామని కేంద్రం ప్రకటించడంపై ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు, ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్టు డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటన హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు భారతదేశంలో సైకాలజిస్టు, కౌన్సెలర్లకు సరైన గుర్తింపుగానీ, లైసెన్స్ విధానం గాని లేదు. కేంద్ర ప్రభుత్వం 'అల్లాయిడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ చట్టం 2018' ద్వారా మానసిక సమస్యలను నివత్తి చేస్తూ , మానసిక ఆరోగ్యం కాపాడడంలో క షి చేస్తున్న వారికి ఈ గుర్తింపు నిచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం మానసిక సమస్యల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తుందన్నారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ వ్యక్తి హక్కుగా పరిగణింపబడుతుందన్నారు. చట్టం ద్వారా 15 విభాగాలకు సంబంధించి 53 మంది వృత్తి నిపుణులను మానసిక ఆరోగ్య నిపుణులుగా గుర్తించనుందని తెలిపారు. ఇప్పటికే పంజాబ్‌లో మెంటల్ హెల్త్ అథారిటీ, మానసిక ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. చట్టం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల మంది అల్లాయిడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కు గుర్తింపు లభించనుందని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

'నా పాలన బ్రహ్మాండం'

- ట్విట్టర్‌లో యూపీ సీఎం యోగి

లక్నో : 2019మార్చితో ఉత్తర్‌ప్రదేశ్ సీఎంగా యోగి ఆదిత్యనాథ్ రెండేండ్లు పూర్తిచేసుకుంటారు. ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్‌లో "నా పాలన బ్రహ్మాండం. ఎక్కడా కూడా చిన్న హింసాత్మక ఘటన, అల్లర్లు జరగలేదు"అని సందేశాన్ని పోస్ట్ చేశారు. మరోవైపు కేంద్ర హోం శాఖ లోక్‌సభలో విడుదల చేసిన సమాచారం 'యోగి ఆదిత్యనాథ్' మాటలు అబద్ధాలని తేల్చుతున్నాయి. యూపీలో 2017లో 195 మతఘర్షణలు చోటుచేసుకున్నాయని స్వయంగా కేంద్రమే తెలియజేసింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ ఆహిర్ ఏమన్నారంటే, "యూపీలో చోటుచేసుకున్న అల్లర్లలో 44మంది ప్రాణాలు కోల్పోయారు. 542మంది తీవ్రంగా గాయపడ్డారు. గత రెండేండ్లకాలంలో రాష్ట్రంలో భారీస్థాయి మతకల్లోలు చోటుచేసుకున్నాయి. వీటిగురించి దేశవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్ట్‌చేశాయి"అని తెలిపారు.

2017, మేలో సహ్రాన్‌పూర్‌లో దళితులపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. 2018, జనవరిలో కాస్‌గాంజ్‌లో రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చిం ది. ఒకరు చనిపోగా, పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. గోవుల్ని తరలిస్తున్నారన్న నెపంతో 2018, డిసెంబరులో బులంద్‌షహర్‌లో చోటుచేసుకున్న హింస దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. 400 మందితో కూడిన భారీ గుంపు ఒకవర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడింది. ఈ అల్లర్లలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో సహా, మరో ఇద్దరు మృతి చెందారు. రాష్ట్రంలో ఇంతపెద్ద ఎత్తున హింస జరగగా, ఎంతోమంది అమాయకులు, పోలీస్ అధికారి చనిపోతే...ఏమీ జరగలేదని సీఎం యోగి చెప్పటమేందని విమర్శలు వెల్లువెత్తాయి.

జూన్‌లో అంతర్జాతీయ విత్తన పరీక్షా కాంగ్రెస్

- ఏర్పాట్లకు ప్రధాన కార్యదర్శి జోషి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జూన్ 26 నుంచి జూలై 3 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 32వ అంతర్జాతీయ విత్తన పరీక్షా కాంగ్రెస్ (ఇస్టా) జరగనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఆదేశించారు. వీటి నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇస్టా సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఆన్డ్రీయాస్ వాయిస్, ఇస్టా స్విట్జర్లాండ్ డైరెక్టర్ ఓల్గా స్టోకిల్, ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్ బెర్రీ, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, టూరిజం శాఖ కార్యదర్శి బి.వెంకటేశం , హైదరాబాద్ పోలీస్ కమీషనర్ అంజనీకుమార్ , అదనపు డిజి జితేందర్, వ్యవసాయ శాఖ కమీషనర్ రాహుల్ బొజ్జా, ప్రాంతీయ పాస్‌పోర్టు ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి, కేశవులు , సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ , సమాచార శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పై రూపొందించిన బ్రోచర్‌ను ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. జూన్ 26న ప్రారంభోత్సవ కార్యక్రమం, 28న విత్తన వ్యవసాయ దారుల సమావేశం , జూన్ 29 నుండి జూలై 3 వరకు అసోసియేషన్ వార్షిక సమావేశాలు జరుగుతాయని , దాదాపు 400 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని , వీరికి వసతి, భద్రత, రవాణా సదుపాయాలు కల్పించాలని ప్రధాన కార్యదర్శి చెప్పారు. విత్తన ప్రదర్శనలో ప్రపంచంలోని ఆయా ప్రాంతాల నుంచి 200 విత్తన కంపెనీలు పాల్గొంటాయని, కొత్త ఉత్పత్తులు , సీడ్ ప్రాసెసింగ్ , ప్యాకింగ్ ఎక్విప్‌మెంట్స్ , సీడ్ ట్రీట్‌మెంట్ , నూతన టెక్నాలజిపై ఉంటుందని అన్నారు. విత్తన ఉత్పత్తి , నాణ్యతపై ఈ-సింపోజియం ఉంటుందన్నారు. ఈ-సింపోజియంలో అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి 50 మంది చిన్న , మధ్య తరహా పరిశ్రమల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. రైతులకు విత్తనాల ఉత్పత్తిలో అమలవుతున్న నూతన పద్ధతులు , నాణ్యతపై అవగాహన కల్పించడానికి ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా భారతీయ , తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనికి తగిన ప్రచారాన్ని నిర్వహించాలని ఆదేశించారు. విదేశీ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే ప్యాకేజి వివరాలను ముందుగానే వారికి తెలియచేయాలని సూచించారు.

'జాన్సన్ అండ్ జాన్సన్'పై చర్యలు తీసుకోండి

కేంద్ర మంత్రికి పదిమంది ఎంపీల లేఖ

న్యూఢిల్లీ: ఏఎస్ఆర్ హిప్ ఇంప్లాంట్స్ విషయంలో 'జాన్సన్ అండ్ జాన్సన్ (జే అండ్ జే)' కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలంటూ పదిమంది ఎంపీలు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖలు రాశారు. ఇంప్లాంట్స్ బాధితులకు న్యాయం చేకూరేలా ఆ కంపెనీపై తగిన నిర్ణయం తీసుకోవాలని తమ తమ లేఖ ల్లో పలువురు ఎంపీలు కోరారు. కేంద్ర మంత్రికి లేఖ రాసినవారిలో బీజేపీ మిత్ర పక్షాలు శివసేన నుంచి ఏడుగురు ఎంపీలు, అప్నాదళ్‌కు చెందిన ఎంపీ, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీ బిఎన్ చంద్రప్ప, ఆప్ బహి ష్కృత ఎంపీ ధరమ్ విరా గాంధీ కూడా ఉన్నారు. 'ఇటీవలి కాలంలో జే అండ్ జే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెలుతోంది. బాధితులకు పరిహారం అందించే విషయంలో తన బాధ్యతను విస్మరిస్తున్నది. ఏఎస్ఆర్ హిప్ ఇంప్లాంట్స్ బాధితలును గుర్తించాలి. వారికి న్యాయం చేకూరేలా జే అండ్ జేపై క్రమశిక్షణా, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి' అంటూ వారివారి లేఖల్లో ఎంపీలు కోరారు.

ఈబీసీలకు10శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనకు మద్దతు : మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనకు కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇస్తున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి చెప్పారు. రాజ్యాంగ సవరణ చేసి ఈబీసీలకు రిజర్వేషన్ కప్పించడానికి కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి సహ కరిస్తున్నదన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు కాంగ్రెస్ అనుకున్నదానికి భిన్నంగా వచ్చాయన్నారు. టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి కెచంద్రశేఖరరావుతో కుమ్మక్కయ్యా రంటూ కేంద్ర మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ ఆరోపించడం సరైందికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని చెప్పారు.

బ్రిటన్ వీసాలు భారం



లండన్ : బ్రిటన్ వీసాలు ఇకపై భారం కానున్నాయి. ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జీలను (ఐహెచ్ఎస్) రెండింతలు పెంచాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. వీసాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఐహెచ్ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. బ్రిటన్ తాజా నిర్ణయంతో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తప్పవు. 2015లో బ్రిటన్ ఐహెచ్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఐహెచ్ఎస్ చెల్లించిన వీసాదారులు బ్రిటన్‌లో నివసించినంత కాలం నేషనల్ హెల్త్ సర్వీసెస్ స్కీమ్ ద్వారా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 200 యూరోలు ఉన్న ఐహెచ్ఎస్ సర్‌ఛార్జీలు రెట్టింపయ్యాయి. పెరిగిన ధరలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. బ్రిటన్ వీసాలకు దరఖాస్తు చేసుకున్న కుటుంబ సభ్యులంతా కచ్చితంగా ఐహెచ్ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో కుటుంబం నుంచి నలుగురు సభ్యులు వీసాలకు దరఖాస్తు చేసుకున్నట్టయితే వారంతా వేర్వేరుగా ఐహెచ్ఎస్ చెల్లించాల్సి ఉంటుంది.

ఈ చార్జీలు రెట్టింపు కావడంతో భారతీయులు ఎక్కువగా ఇబ్బందిపడే అవకాశముంది. ఈయూ సభ్యదేశాలకు ఈ చార్జీలు వర్తింపవు. ఈయూలో సభ్యత్వం లేని దేశాలకు ఐహెచ్ఎస్ పెను భారంగా మారే అవకాశముంది.

వైపీజీకి మద్దతిస్తే ఖబడ్దార్

- అమెరికాకు ఎర్డోగన్ హెచ్చరిక



అంకారా : సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారులకు (వైపీజీ) ట్రంప్ సర్కార్ మద్దతిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ట్రంప్ సర్కార్‌ను హెచ్చరించారు. పార్లమెంట్‌లో అధికార ఏకే పార్టీ సభ్యులతో ఆయన మాట్లాడారు. 'అమెరికా బలగాలు సిరియా నుంచి వైదొలగాలని మేం కోరుతున్నాం. యూఎస్ బలగాల ఉపసంహారణకు సంబంధించి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ పలు షరతులు పెట్టారు. ట్రంప్ సర్కార్ వైపీజీకి మద్దతు ఇవ్వడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. టర్కీలో నిషేధిత ఉగ్రసంస్థల జాబితాలో వైపీజీ కూడా ఒకటి. అలాంటి సంస్థకు అమెరికా మద్దతిస్తోంది. అంకారా బలగాలకు, వైపీజీకి మధ్య పోరు కొనసాగుతూనే ఉంటుంది. అమెరికా తక్షణమే వైపీజీకి మద్దతు ఇవ్వడాన్ని ఉపసంహారించుకోవాలి' అని అన్నారు. కాగా, సిరియాలో పెట్రేగిపోయిన ఉగ్రసంస్థల నిర్మూలనలో వైపీజీ కూడా తన వంతు పాత్ర పోషిస్తున్నది. టర్కీ ప్రభుత్వం దృష్టిలో వైపీజీ ఓ నిషేధిత ఉగ్రసంస్థ. అయితే, అమెరికా మాత్రం వైపీజీకి ఆయుధాలు, క్షిపణులు సరఫరా చేస్తూ కొంతకాలంగా టర్కీని రెచ్చగొడుతున్నది. కుర్దు తిరుగుబాటుదారులకు అమెరికా సహకరించడం పట్ల ఎర్డోగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమెరికాతో చర్చలకు సిద్ధం

- తాలిబన్ ప్రతినిధులు

కాబూల్ : అఫ్ఘాన్‌లో శాంతి స్థాపన అంశంపై అమెరికాతో శాంతి చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తాలిబన్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. సౌదీ అరేబియాలో చర్చలు జరపాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాను కోరారు. సౌదీకి బదులు ఖతార్‌లో చర్చలు జరిపేందుకు తాలిబన్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ చర్చలకు అఫ్ఘాన్ అధికారులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దని తాలిబన్లు కోరారు. అఫ్ఘాన్‌లో 17 ఏండ్ల నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధానికి తెరదించాలంటే అమెరికాతో చర్చలు జరపాలని తాలిబన్లు యోచిస్తున్నారు. నిర్బంధంలో ఉన్న తాలిబన్ కీలక నేతల విడుదల, అఫ్ఘాన్ నుంచి విదేశీ బలగాల ఉపసంహరణ తదితర అంశాలపై తాలిబన్లు చర్చించే అవకాశముంది.

చైనాలో కిమ్ పర్యటన

బీజింగ్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ సతీసమేతంగా చైనాలో పర్యటించారు. ఈనెల 10వరకు ఆయన చైనాలో ఉంటారని ఉత్తరకొరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలసి తాను త్వరలో సమావేశంలో పాల్గొననున్న నేపథ్యంలో కిమ్ చైనాలో పర్యటిస్తుండడం గమనార్హం. వారిద్దరి మధ్య గత ఏడాది జూన్‌లో అణ్వస్త్ర నిరాయుధీకరణ వంటి అంశాలపై సమావేశం జరిగిన విషయం తెలిసిందే. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కిమ్ భేటీ కానున్నారు. గతేడాది వీరిద్దరి మధ్య మూడు సార్లు సమావేశాలు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో కిమ్ చర్చలు నిర్వహించడానికి ముందు, తర్వాత ఆయన జిన్ పింగ్‌తో భేటీ అయ్యారు. త్వరలో ట్రంప్‌తో రెండోసారి సమావేశం కానున్న నేపథ్యంలో మళ్లీ చైనా అధ్యక్షుడితో ఆయన చర్చించనున్నట్టు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఉత్తరకొరియా నుంచి కిమ్ తన భార్య, తమ దేశ అధికారులతో ప్రత్యేక రైలులో చైనా బయలుదేరారని ఆ దేశ మీడియా తెలిపింది. జనవరి 8న ఆయన పుట్టినరోజు వేడుక కూడా ఉందని చెప్పింది. జిన్ పింగ్ పంపిన ఆహ్వానం మేరకు ఆయన తమ దేశంలో పర్యటిస్తున్నట్టు చైనా మీడియా పేర్కొంది. ఉత్తరకొరియాకు చైనా ప్రధానమైన ఆర్థిక, దౌత్యపర మిత్ర దేశంగా ఉంది. ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. తాను ట్రంప్‌ను కలవడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అలాగే, తమ దేశంపై ఉన్న ఆంక్షలను సడలించాలని డిమాండ్ చేశారు.



అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం ఆత్మహత్య లాంటిది : ఇమ్రాన్



ఇస్లామాబాద్ : అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం ఆత్మహత్య లాంటిదని తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ అధినేత, పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యానించారు. టర్కీకి చెందిన టీఆర్‌టీ వరల్డ్ మీడియా సంస్థతో ఇమ్రాన్ మాట్లాడారు. భారత్, పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని, ఈ రెండు దేశాల మధ్య యుద్ధం సంభవించినట్టయితే అది ఆత్మహత్యకు పాల్పడటం లాంటిదని అన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి ప్రక్రియ కోసం తాను చేసిన ప్రతిపాదనలపై భారత్ స్పందించడంలేదని ఆరోపించారు. తాము ఇప్పటికీ భారత్‌తో ద్వైపాక్షికచర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. చర్చల ద్వారా ఇరు దేశాలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. చర్చల ప్రతిపాదనను భారత్ పలుమార్లు తోసిపుచ్చిందని ఆరోపించారు. రెండు అణ్వాయుధ దేశాలు యుద్ధం గురించి కనీసం ఆలోచించడం కూడా సరికాదని ఇమ్రాన్ చెప్పారు. ప్రచ్ఛన్న యుద్ధాన్ని సైతం ఆలోచించకూడదన్నారు. దాని వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందన్నారు. ద్వైపాక్షిక చర్చలు మాత్రమే ఏకైక మార్గమని చెప్పారు. కాశ్మీరీల హక్కులను భారత ప్రభుత్వం కాలరాస్తోందని మరోసారి ఆరోపించారు. కాశ్మీర్ పౌరుల హక్కులను భారత్ ఎన్నడూ అణిచివేయలేదన్నారు.

వైమానిక దాడుల్లో అల్‌ఖైదా కీలక నేత మృతి

వాషింగ్టన్: అమెరికా వాయుసేన నిర్వహించిన వైమానిక దాడుల్లో అల్‌ఖైదా కీలక నేత జమాల్ అల్‌బడావీ హతమైనట్టు యూఎస్ ఆర్మీ ప్రకటించింది. యెమెన్‌లో అల్‌ఖైదా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బడావీ 2000లో అమెరికాకు చెందిన నావికాదళ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో 17 మంది మృతిచెందగా, 40 మంది గాయపడ్డారు. ఈ దాడి అనంతరం అమెరికా సైన్యం బడావీ కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టింది.

బడావీ ఆచూకీ తెలిపిన వారికి 5 మిలియన్ డాలర్లు పారితోషికం అందజేస్తామని ప్రకటించింది. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ అధికార ప్రతినిధి బిల్ అర్బన్ మాట్లాడుతూ.. జనవరి 1న మారిబ్ గవర్నేట్‌లో అమెరికా వాయు దళాలు జరిపిన దాడుల్లో జమాల్ అల్ బడావీ మతిచెందినట్టు ధ్రువీకరించారు. బడావీని మట్టుబెట్టిన సైనికాధికారులను ట్రంప్ అభినందించారు. ఉగ్రసంస్థలపై తమ పోరు కొనసాగుతుందని ట్రంప్ అన్నారు.

జర్మనీ ఎంపీపై దుండగుల దాడి

బెర్లిన్ : జర్మనీ ఏఎఫ్‌డీ (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) పార్టీ ఎంపీ ఫ్రాంక్ మాగ్నిట్జ్‌పై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ మాగ్నిట్జ్ ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నారని వైద్యులు తెలిపారు. తల భాగంపై, నుదుటిపై బలమైన గాయాలు ఉన్నాయని అన్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం బెర్లిన్ నగరంలో మాగ్నిట్జ్‌పై దాడి జరిగింది. ఈ దాడి వెనుక రాజకీయ కుట్ర దాగివుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దాడి జరిగిన పరిసర ప్రాంతాల్లోని అన్ని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ఎంపీ అపస్మారక స్థితి నుంచి బయటకు వచ్చినట్టయితే దాడికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశముంది. మాగ్నిట్జ్‌పై జరిగిన దాడిని పలువురు ఎంపీలు ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

భారతీయ మహిళకు ఐఎంఎఫ్ తొలి మహిళా చీఫ్ ఎకనామిస్ట్ పదవి


గీతా గోపీనాథ్

న్యూయార్క్: భారతీయ మహిళ గీతా గోపీనాథ్ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ ఎకనామిస్ట్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఐఎంఎఫ్ ఉన్నత పదవి చేపట్టిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. గతేడాది డిసెంబర్ 31న పదవీ విరమణ పొందిన మోరీ ఓబ్స్ ఫెల్డ్ స్థానంలో ఆమె నియమితులయ్యారు. గతేడాది అక్టోబర్‌లో గీతా గోపీనాథ్ నియకాన్ని ప్రకటిస్తూ ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టీన్ లగార్డే 'గీతా ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్థిక శాస్త్రవేత్తల్లో ఒకరు. ఆమెకు విశేష పరిజ్ఞానం ఉన్నది' అని అన్నారు. ఐఎంఎఫ్ లో ఈ పదవి చేపట్టిన భారతీయుల్లో గీత రెండో వ్యక్తి. ఆమెకి ముందు భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కూడా ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థిక శాస్త్రవేత్తగా పనిచేశారు. ఐఎంఎఫ్లో 11వ ప్రధాన ఆర్థిక శాస్త్రవేత్తగా నియుక్తులైన గీతా గోపీనాథ్ తనకు ఇది అత్యుత్తమ గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఐఎంఎఫ్‌లో తన నియామకం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ లభించిన గౌరవమని చెప్పారు. గీతా గోపీనాథ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఏ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి ఎంఏ పట్టాలు సాధించారు. ఆ తర్వాత ఆమె ప్రిన్‌స్టన్ విశ్వవిద్యాలయం నుంచి 2001లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. అదే సంవత్సరం ఆమె చికాగో విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేయడం ప్రారంభించారు.

దక్షిణ ఆఫ్రికాలో రెండు రైళ్లు ఢీ

- ముగ్గురు మృతి, 300 మందికి గాయాలు

ప్రిటోరియా : దక్షిణాఫ్రికాలో రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 300 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 82 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...దక్షిణ ఆఫ్రికా రాజధాని ప్రిటోరియాలో మంగళవారం రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోగా, 300 మంది గాయపడ్డారు. మౌంటెన్ వ్యూ రైల్వే స్టేషన్‌లో ఆగివున్న రైలును మరో రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించామని అన్నారు. కాగా, దక్షిణ ఆఫ్రికాలో ఇటీవలి కాలంలో రైలు ప్రమాదాలు అధికమయ్యాయి. గతేడాది అక్టోబర్‌లో జోనెస్‌బర్గ్ నుంచి ప్రిటోరియాకు బయల్దేరిన రైలు స్టేషన్‌లో నిలిచివున్న మరో రైలును ఢీకొంది. ఈ ప్రమాదంలో 300 మంది గాయపడ్డారు.

'అమెరికా' బాధితుడు సాయికృష్ణకు అండగా ఉంటాం..

- అతడి కుటుంబాన్ని ఆదుకుంటాం... : టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అమెరికాలో దుండగుల చేతిలో కాల్పులకు గురై చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికష్ణకు పూర్తి అండగా ఉంటామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీనిచ్చారు. సాయికష్ణ కుటుంబ సభ్యులు మంగళవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో కేటిఆర్‌ని కలిసి ప్రభుత్వ సహకారాన్ని కోరారు. వారు తక్షణమే అమెరికాకి వెళ్లేందుకు వీలుగా అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. సాయికృష్ణ ఆరోగ్యం గురించి ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాయికష్ణ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని.. అయితే పలు శస్త్ర చికిత్సలు ఆయనకు అవసరమని వారు తెలిపారు. ఆయనకు అవసరమైన తక్షణ వైద్య సహాయం గురించి అమెరికాలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి తమ ఎన్ఆర్ఐ శాఖ అధికారులు ఇప్పటికే సమాచారం అందించారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. అవసరమైతే మరింత సహకారం కోసం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతామంటూ ఆయన చెప్పారు.

బీసీ సంఘాల ముసుగులో ఆర్థిక అరాచకం : లింగంపల్లి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

బీసీ రిజర్వేషన్లపై సీఎం కేసీఆర్‌ను తప్పుపడుతూ కొన్ని పార్టీల నేతలు మాట్లాడుతుండటం సరికాదని రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మెన్ లింగంపల్లి కిషన్‌రావు అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొందరు బీసీ సంఘాల పేరుతో ఆర్థిక అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీసీలకు రాజ్యసభ సభ్యత్వంతోపాటు అనేక పదవులనిచ్చి గౌరవించింది కేసీఆరేనని తెలిపారు. అందువల్లే ముందస్తు ఎన్నికల్లో బీసీలు కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారని చెప్పారు.

రైతు ఆత్మహత్య

- వర్షాలు కురవలే.. బోర్లలో నీరు రాలే..

నవతెలంగాణ–తంగళ్లపల్లి

వర్షాలు కురవలేదు.. పైర్లను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు.. పైర్లు ఎండాయి. చివరకు అప్పులే మిగిలాయి.. ఇది తట్టుకోలేని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంకరి మల్లారెడ్డి(60) తన రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో సాగు కోసం మూడు బోర్లు వేశాడు. చుక్క నీరు రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన రైతు మల్లారెడ్డి సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. గ్రామ శివారులోని శ్మశాన వాటిక గదిలో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రైతుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్ దివాలా తీసిన కంపెనీ

- పార్లమెంట్ ఎన్నికల్లోనూ పరాజయం తప్పదు
- పంచాయతీలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలి: ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి




నవతెలంగాణ– దేవరకొండ

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్ కంపెనీ తెలంగాణలో దివాలా తీసిందని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పరాజయం తప్పదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దివాలా తీసిందని ఆ పార్టీ నాయకులు సర్వే సత్యనారాయణ చెప్పినట్టు పత్రికల్లో చూశానన్నారు. అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకించడం లేదు కానీ ముస్లిం, గిరిజనుల రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. పంచాయతీలను ఏకగ్రీవంగా, ఘర్షణలకు తావు లేకుండా ఆలోచించి ఎన్నుకోవాలని సూచించారు. బయట నుంచి వచ్చే వారికి మద్దతు ఇవ్వకుండా స్థానికంగా స్థిర నివాసం ఉండి గ్రామ అభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకోవాలని అన్నారు. ఆస్తులు, భూములు అమ్ముకొని డబ్బులు ఖర్చు చేసి అప్పలపాలు కావొద్దని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీ చట్టంలో కఠిన నిబంధనలు ఉన్నందున అవినీతికి ఆస్కారం ఉండదన్నారు.

అప్పీలు చేసుకొనే అవకాశం లేకుండానే సర్పంచ్ పదవిని రద్దు చేయొచ్చన్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10 లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యేలు మరో రూ.10 లక్షలు నిధులు ఇస్తున్నందున గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

హైదరాబాద్ ఖ్యాతి ఇనుమడించేలా స్వీట్ ఫెస్టివల్

అధికారులకు ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఆదేశం



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

జనవరి 13 నుంచి 15 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న 4వ అంతర్జాతీయ పతంగుల పండుగ–2019లతోపాటు స్వీట్ ఫెస్టివల్‌ను హైదరాబాద్ ఖ్యాతి ఇనుమడించేలా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె జోషి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో అంతర్జాతీయ పతంగుల పండుగ, అంతర్జాతీయ మిఠాయిల వేడుక నిర్వహణ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బి వెంకటేశం, హైదరాబాద్ నగర కమిషనర్ అంజనీకుమార్, టూరిజం కమిషనర్ దినకర్‌బాబు, ఫైర్ సర్వీసెస్ డిజి గోపికష్ణ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ పెరిగే విధంగా పక్కా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి రోజు 3లక్షల మంది సందర్శకులకు తగ్గట్టు ఏర్పాట్లు ఉండాలని సూచించారు. బ్యారికేడింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, బందోబస్తు, మంచినీటి సరఫరా, వైద్యసేవలు అందివ్వాలని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా లే అవుట్‌ను రూపొందించుకొని పనులు చేపట్టాలన్నారు.

జీహెచ్ఎంసీ ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రచారం నిర్వహించాలన్నారు. టూరిజం శాఖ కార్యదర్శి బి వెంకటేశం మాట్లాడుతూ 20 దేశాల నుంచి 50 మంది పతంగులు ఎగురవేసే నిపుణులు పాల్గొంటారని, వివిధ రాష్ట్రాల మహిళలు 1000 రకాల మిఠాయిలు ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా మిఠాయిలు తయారు చేస్తారని చెప్పారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ పండుగను దాదాపు పదిలక్షల మంది సందర్శిస్తారని ఆయన చెప్పారు.

రైలు ఢీకొని తల్లీకొడుకు మృతి



నవతెలంగాణ–నవీపేట్

పట్టాలపై పరుగెత్తుతున్న కుమారున్ని, అతన్ని కాపాడబోయిన తల్లిని రెప్పపాటులోనే రైలు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే నుజ్జునుజ్జయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం ఫకీరాబాద్ రైల్వే గేటు వద్ద మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫకీరాబాద్‌కు చెందిన గంగామణి స్థానిక కల్లు బట్టిలో పని చేస్తోంది. ఆమెకు మానసిక వికలాంగుడైన కొడుకు గంగాప్రసాద్(10) ఉన్నాడు. మంగళవారం కూడా కొడుకును తీసుకొని పనికి పోయి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో స్థానిక రైల్వే గేటు వద్ద కొడుకు గంగాప్రసాద్ పట్టాల వైపు పరిగెత్తాడు. అదే సమయంలో ముంబాయి నుంచి సికింద్రాబాద్ వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో కుమారుడిని తల్లి కాపాడబోయింది.

ఇరువురినీ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృత దేహాలను రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మెన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మెన్‌గా సిద్ధిపేట నియోజక వర్గానికి చెందిన మారెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన దస్త్రంపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు.


పీఆర్టీయూ తెలంగాణ డైరీ ఆవిష్కరించిన హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పీఆర్టీయూ తెలంగాణ డైరీని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి హరీశ్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. పీఆర్టీయూ క్యాలెండర్‌ను హోంమంత్రి మహమూద్ అలీ విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య, నాయకులు కేశవులు, శ్రీనివాస్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో మోహన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కరీంనగర్–నిజామాబాద్–మెదక్–ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి బరిలోకి దిగుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా స్వతంత్రంగా బరిలోకి దిగుతున్నానని చెప్పారు. 26 ఏండ్లు పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, 2007 నుంచి 2013 వరకు ఆరేండ్లు ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశానని అన్నారు. తనకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్, తెలంగాణ మోడల్ స్కూల్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఏకీకృత సర్వీసు రూల్స్ ద్వారా ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. పీఈటీలు, పండితుల అప్‌గ్రెడేషన్ చేయాలని చెప్పారు. సంక్రాంతి నాటికి మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్ఎంఏ అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజభాను చంద్రప్రకాశ్, తెలంగాణ మోడల్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ అధ్యక్షులు విఆర్ దేశ్‌పాండే, పీఆర్టీయూ మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

జపాన్ అభిమానులకు ప్రభాస్ సర్‌ప్రైజ్



తమకిష్టమైన వ్యక్తి సర్‌ప్రైజ్‌లిచ్చినప్పుడు ఉండే ఆనందం మాటల్లో వర్ణించలేనిది. దాన్ని అనుభవిస్తేనే తెలుస్తుంది. జపాన్‌కి చెందిన ప్రభాస్ అభిమానులు ప్రస్తుతం అలాంటి ఆనందాన్ని అనుభవిస్తున్నారు. 'బాహుబలి' పార్ట్ 1, పార్ట్ 2 సినిమాలు జపాన్‌లో కూడా విడుదలై మంచి ఆదరణ పొందాయి. అంతేకాదు అక్కడ ప్రభాస్‌కి భారీగా అభిమానులూ ఏర్పడ్డారు. సినిమా చూసి ప్రభాస్‌ని అభినందిస్తూ లెటర్స్ పంపించారు. ఇటీవల ప్రభాస్ కూడా జపాన్ అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా తన కొత్త సినిమా వివరాలు, తన కొత్త గెటప్స్‌కి చెందిన పలు ఫొటోలను గ్రీటింగ్ కార్డ్స్ రూపంలో పంపించారు. అంతేకాదు 'మీరంతా సంతోషంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకుంటారని ఆశిస్తున్నా' అని జపాన్ భాషలో రాసి మరీ పంపించారు. దీంతో ఈ గ్రీటింగ్స్ అందుకున్న జపాన్ అభిమానులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ప్రభాస్ ప్రస్తుతం 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ స్టయిలీష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం సెట్‌లో ప్రభాస్, సుజిత్‌తో దిగిన ఓ సెల్ఫీని నీల్ నితిన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ 'సెట్‌లో ఇది చాలా అద్భుతమైన రోజు' అని కామెంట్ పోస్ట్ చేశారు. ఈ సినిమా ఆగస్ట్ 15న విడుదల కానుంది. ప్రభాస్ దీంతోపాటు రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు.

సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తమన్నా, వెంకటేష్, మెహరీన్, వరుణ్‌తేజ్

వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్2' (ఫన్ అండ్ ఫ్రస్టేషన్). ఈ చిత్ర ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, 'చాలా రోజులుగా 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' వంటి ఫుల్ ప్లెడ్జ్ కామెడీ సినిమా చేయలేదు. చాలా గ్యాప్ తర్వాత అలాంటి సినిమా చేశాను. అందుకు దర్శకుడు అనిల్ రావిపూడికి థ్యాంక్స్. నేను కామెడీతో మెప్పిస్తాననే నమ్మకంతో దిల్‌రాజు, అనిల్ నా దగ్గరికి రావడంతో ఈ సినిమా చేశాను. వరుణ్ బాగా నటించాడు. తమన్నా, మెహరీన్ సహా అందరితో నటించడం చాలా ఆనందంగా ఉంది. పాత్రలన్నీ చక్కగా కుదిరాయి. తప్పకుండా ఎంజాయ్ చేసే చిత్రమవుతుంది. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ చిత్రమిది' అని అన్నారు.

'డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో కామెడీ సినిమాలు కూడా చేయాలనుకున్నా. నా కెరీర్‌లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో అంతా ఈ ఒక్క సినిమాలోనే అనిల్ చేయించాడు. ఇలాంటి పాత్ర చేయడం, ఇలాంటి మంచి సినిమా చేయడం ఆనందంగా ఉంది. వెంకీ కామెడీ ఇరగదీస్తారు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. ఆయన నాకు కంఫర్ట్ ఇచ్చి చేయించారు. ఆయనతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా' అని వరుణ్ తేజ్ తెలిపారు. దర్శకుడు అనిల్ రావిపూడి చెబుతూ, 'దిల్‌రాజు, మా కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ హిట్ అవుతుంది. ట్రైలర్‌లో రెండు నిమిషాల నవ్వులే కాకుండా, రెండున్నర గంటల నవ్వులను సినిమా ద్వారా సంక్రాంతికి ఎంజాయ్ చేస్తారని గ్యారంటీగా చెప్పగలను. వెంకటేష్, వరుణ్, తమన్నా, మెహరీన్ నాకు నాలుగు పిల్లర్స్‌గా ఉన్నారు. ఈ నలుగురి మధ్య వచ్చే ఫన్, ఫ్రస్టేషన్‌ని సినిమాలో ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు.

'కామెడీ సినిమాల్లో రియల్ లైఫ్ సిచ్చ్యువేషన్స్ ఆధారంగా హాస్యం పుడుతుంది. అనిల్ ఈ కథ చెప్పినప్పుడే ఫిదా అయ్యాను. అందరం కలిసి ఓ టీమ్‌లా పనిచేశాం. వెంకీగారు చాలా సంవత్సరాలుగా నన్ను ఇన్‌స్పైర్ చేస్తున్నారు. ఆయనింకా ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనపడుతున్నారనేది నాకింకా అర్థం కావడం లేదు. వరుణ్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. మెహరీన్ చాలా బాగా చేసింది. త్వరగా 'ఎఫ్3' చేయాలని కోరుకుంటున్నా' అని తమన్నా చెప్పారు.

'వెంకీ, వరుణ్, తమన్నాలతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది' అని మెహరీన్ అన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ, 'అనిల్ రావిపూడితో మూడో సినిమా ఇది. ఇగో, విభేదాలు లేకుండా సరదాగా మా జర్నీ సాగుతుంది. సినిమాలో ప్రతి పాత్ర వినోదభరితంగా ఉంటుంది. సంక్రాంతికి ప్రేక్షకుల్ని నవ్విస్తూనే పెద్ద హిట్ అందుకుంటామనే నమ్మకం ఉంది. ఇక ఇటీవల 'పేట' చిత్ర ఫంక్షన్‌లో ఆ చిత్ర నిర్మాత మాట జారారు. మూడు పెద్ద సినిమాలకు థియేటర్లను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక నిర్మాతలు, పంపిణీదారులు సతమతమవుతున్నారు. ఇలాంటి టైమ్‌లో తమిళ అనువాద సినిమాని సంక్రాంతికి విడుదల చేస్తున్నట్టు ఆ నిర్మాత నిర్ణయించారు. తెలుగు సినిమాలకు కాకుండా ఇతర భాషా చిత్రాలకు థియేటర్లు కేటాయించే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఇవి ఆలోచించకుండా నోరు జారి పిచ్చి పిచ్చిగా మాట్లాడారు. అలాంటి మాటలు మేమూ మాట్లాడగలం. కానీ మాకంటూ ఓ వ్యక్తిత్వం ఉంది' అని తీవ్రంగా మండిపడ్డారు.

పారితోషికాన్ని త్యాగం చేసింది



సినిమా ఫెయిల్ అయినప్పుడు పలువురు స్టార్ హీరోలు రెమ్యూనరేషన్ తిరిగి ఇవ్వడం ఇప్పటి వరకు చూశాం. పవన్ కళ్యాణ్, మహేష్‌బాబు వంటి వాళ్ళు గతంలో తమ సినిమాలు పరాజయం చెందినప్పుడు తీసుకుంటున్న పారితోషికంలో కొంత భాగం తిరిగిచ్చారు. అలాగే హీరోయిన్స్ రెమ్యూనరేషన్‌ని తిరిగివ్వడమనేది చాలా చాలా అరుదుగా మనకి వినిపిస్తుంది. అయితే తొలిసారి సాయిపల్లవి విషయంలో వింటున్నాం. సాయిపల్లవి ఇటీవల శర్వానంద్‌తో కలిసి 'పడి పడి లేచే మనసు' చిత్రంలో నటించింది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి సుధాకర్ చెరుకూరి నిర్మాత. సినిమా బాక్సాఫీసు వద్ద పరాజయం చెందింది. దీంతో నిర్మాత తీవ్ర నష్టాల్లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న సాయిపల్లవి తనకివ్వాల్సిన మిగతా సగం పారితోషికాన్ని నిర్మాత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తీసుకోవడానికి నిరాకరించిందట. అద్భుతమైన నటన, డాన్సులతో మంత్రముగ్ధుల్ని చేసే సాయిపల్లవి ప్రవర్తనపై ఇప్పటికే పలు కామెంట్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలో సాయి పల్లవి తీసుకున్న ఈ నిర్ణయంతో అందరి మన్ననలు అందుకుంటోంది. ఈ మధ్య కాలంలో ఓ కథానాయిక ఇలాంటి మంచి పని చేయడంతో అందరూ షాక్‌లో ఉన్నారు. ప్రస్తుతం తమిళంలో సూర్య సరసన 'ఎన్జీకే' చిత్రం, మలయాళంలో పహద్ ఫాజిల్ సరసన ఓ సినిమా, తెలుగులో రానా సరసన ఓ సినిమాలో నటించేందుకు సాయి పల్లవి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.

ఇది గ్యాంగ్‌లీడర్ సినిమా కాదు



'ప్రతి సినిమా 'రంగస్థలం'లా ఉండాలనుకుంటే కష్టం. నాన్న(చిరంజీవి)లా అన్ని రకాల సినిమాలు చేయాలనే ఉద్దేశంతో 'వినయ విధేయ రామ' చేశాను' అని అంటున్నారు రామ్ చరణ్. 'ధృవ' నుంచి భిన్న సినిమాలు చేస్తున్న ఆయన గతేడాది 'రంగస్థలం'తో భారీ విజయాన్ని అందుకున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'వినయ విధేయ రామ' చిత్రంలో నటించారు. కైరా అద్వానీ కథానాయికగా నటించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం రామ్‌చరణ్‌తో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

రియలిస్టిక్ చిత్రం 'రంగస్థలం' తర్వాత ఇలాంటి కమర్షియల్ సినిమా చేయడానికి కారణం?

– నాన్నగారు 1980లో అన్ని రకాల జోనర్ సినిమాలు చేశారు. ఆయనలాగే అన్ని జోనర్ సినిమాలు చేయాలని దీనికి ఓకే చెప్పా. నాకు సెన్సిబులిటీస్ ఉన్న కథలంటే ఇష్టం. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్, అన్ని రకాల అంశాలుంటాయి. ఈ సంక్రాంతికి కరెక్ట్ సినిమా. అయినా ప్రతి సినిమా 'రంగస్థలం'లా ఉండాలనుకుంటే కష్టం. మనకు నచ్చింది, రైట్ అనిపించింది చేసుకుంటూ వెళ్ళాలి.

చిత్ర కథ, మీ పాత్ర తీరు గురించి?

– ఇదొక నలుగురు అన్నదమ్ముల కథ. వారి ఫ్యామిలీ ప్రధానంగా సాగుతుంది. వారికి సమస్య తలెత్తినప్పుడు ఎలా రియాక్ట్ అయ్యారనేది కథ. ఇందులో నేను రాముడి తరహా పాత్రలో కనిపిస్తా. ప్రతి మనిషిలో రెండు షేడ్స్ ఉంటాయి. రాముడిలా వినయంగా ఉండే నేను అవసరమైనప్పుడు విధ్వంసం కూడా సృష్టిస్తా. కైరా, ఆర్యన్ రాజేష్, స్నేహ, ప్రశాంత్, వివేక్ ఒబెరాయ్ వంటి మంచి నటీనటులతో నటించాను.

'రాంబో' తరహా పాత్రలో కనిపిస్తున్నారు. ఆ గెటప్ ఆలోచన ఎవరిది?

– 'రాంబో' గెటప్ పూర్తిగా దర్శకుడి ఆలోచన. ఆయనే నా పాత్రని అలా డిజైన్ చేశారు. ఓ కీలక సందర్భంలో వచ్చే ఫైట్‌లో 'రాంబో'లా కనిపిస్తాను. ఆ ఫైట్ సీక్వెన్స్ చిత్రీకరించేటప్పుడు చాలా ఇబ్బంది పడ్డాం. కానీ ఆ యాక్షన్ సన్నివేశాలు సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయి. చిన్నప్పట్నుంచి సిల్వెస్టర్ స్టాలోన్‌ని చూస్తూ పెరిగాం. ఆయనలాంటి పాత్రలో కనిపించడం సంతోషంగా ఉంది.

మీ పాత్ర కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు?

– 'రంగస్థలం' తర్వాత చాలా గ్యాప్ తీసుకుని చేయాల్సిన సినిమా ఇది. కానీ ఆ టైమ్ లేదు. దర్శకుడు బోయపాటికి ఉన్న కమిట్ మెంట్స్, నాకున్న కమిట్‌మెంట్స్ కారణంగా వేగంగా చేయాల్సి వచ్చింది. బోయపాటి కన్విక్షన్ ఉన్న దర్శకుడు. సినిమా, సన్నివేశాలపై క్లారిటీ ఉంది. దీంతో చాలా సులభంగానే చేశాం. అయినప్పటికీ ఇంకాస్త టైమ్ ఉంటే, ఇంకా బాగా చేసేవాళ్ళం. లుక్ కోసం ప్రత్యేక డైట్ అంటూ ఏం ఫాలో కాలేదు. ఇంట్లో నాకు నచ్చింది తినేశా.

బోయపాటి సినిమాలో ఉండే అతి హింసపై మీ కామెంట్?

– బోయపాటికి ఓ మార్క్ ఇమేజ్ ఉంది. అలా చేయడం వల్లే ఆయన ఈ స్థాయికి వచ్చారు. 'భద్ర' సినిమాలో మంచి లవ్‌స్టోరీ చూపించారు. అలాగే 'సరైనోడు', 'జయజానకి నాయక'లోనూ ప్రేమ కథలున్నాయి. వయిలెన్స్ అవసరం మేరకే ఉంటుంది. గతంలో హీరో వంద మందిని చంపితే చూశారు. ఇప్పుడు మూడు వందల మందిని చంపినా చూస్తున్నారు.

ఈ సినిమాని 'గ్యాంగ్‌లీడర్'తో పోల్చడాన్ని ఎలా ఫీలవుతున్నారు?

– నాన్నగారు నటించిన 'గ్యాంగ్‌లీడర్' నాకిష్టమైన చిత్రం. అలాంటి సినిమా చేయాలనుందని పలు మార్లు చెప్పా. కానీ ఈ సినిమాకి, దానికి అస్సలు సంబంధం లేదు. రెండూ పూర్తి భిన్నమైన కథలు. ఇందులో 'రామ్ కొణిదెల' అనే డైలాగ్ పెట్టడం కొత్తగా అనిపించింది. అది కూడా ఓ సందర్భానుసారంగా వస్తుంది. ఇటీవల ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆ డైలాగ్‌ని నాకంటే నాన్న బాగా చెప్పారు (నవ్వుతూ).

ఇండస్ట్రీ హిట్ 'రంగస్థలం' గురించి కాంప్లిమెంట్స్ విన్నప్పుడు మీకేమనిపిస్తుంది?

– నేను చేసిన చిత్రాల్లో అత్యంత క్లిష్టమైన సినిమా 'రంగస్థలం'. కానీ ఎందుకో దాన్నే బాగా ఎంజాయ్ చేస్తూ చేశా. బహుశా సహజత్వానికి దగ్గరగా ఉండటమో ఏమో?, ఆ సినిమాని ప్రశంసిస్తుంటుంటే నిజంగా గర్వంగా ఉంటుంది. అది నాలో కాన్ఫిడెన్స్ లెవల్స్‌ని కూడా పెంచింది.

మీరు నిర్మిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' అప్‌డేట్స్ ఏమిటి?

– ఈ సినిమా కరెక్ట్ టైమ్‌కి వస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతుంది. భారీ చిత్రం కావడంతో అనుకున్నట్టు జరగాలని లేదు. ఓవరాల్‌గా షూటింగ్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాం. మరో రెండు నెలల్లో చిత్రీకరణ పూర్తవుతుంది. దసరాకి రిలీజ్ ప్లాన్ చేస్తాం. ఓ షెడ్యూల్ 35 రోజుల పాటు అవుట్‌డోర్‌లో చిత్రీకరించాల్సి వచ్చింది. ఆ సమయంలో ఇంటికి దూరంగా ఉన్న యూనిట్‌ని బాగా చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆర్థికంగా వారికి అన్ని రకాలుగా చూసుకున్నాను. నిర్మాతగానే కాదు, యాక్టర్‌గా కూడా యూనిట్‌కి నా వంతు సహాయం చేస్తుంటాను.

మీ బ్యానర్‌లో ఇతర హీరోలతో సినిమాలు చేస్తారా?

– లేదండి. నాన్నగారి కోసమే ఈ బ్యానర్‌ని స్థాపించాను. ఆయన ప్రతిష్టాత్మక చిత్రాన్ని నేనే నిర్మించాలనుకున్నా. ఇతరులతో చేసే టైమ్ నాకు లేదు. 'సైరా'కి దాదాపు 200 కోట్ల బడ్జెట్ అవుతుంది. సౌత్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటుడు నాన్నగారు. ఏ నిర్మాత ఇవ్వని అత్యధిక పారితోషికం నేను ఇస్తున్నా. ఆ విషయంలో ఆయనకు ఏ లోటూ లేదు (నవ్వుతూ).

'ఆర్‌ఆర్‌ఆర్' గురించి రాజమౌళి చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏంటి?

– ఇలాంటి ఓ ఆఫర్ వస్తుందని, ఇలా కూడా ఆలోచిస్తారా? అనే ఆశ్చర్యంతో చాలా సేపు సైలెంట్‌గా ఉండిపోయా. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కానీ చాలా ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ ఇది. తారక్‌తో కలిసి నటించడం చాలా హ్యాపీగా ఉంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా మొదటి షెడ్యూల్ పూర్తయ్యింది. అందులో మేమిద్దరం పాల్గొన్నాం. సంక్రాంతి తర్వాత నెక్ట్స్ షెడ్యూల్ ఉంటుంది. ఇందులో డీ గ్లామర్ పాత్రలో కనిపిస్తా. మా ఇద్దరి ఫ్యాన్స్‌ని, రాజమౌళికి ఉన్న ఫ్యాన్స్‌ని, జనరల్ ఆడియెన్స్‌ని ఇలా అందరిని సాటిస్ఫై చేసేలా సినిమా ఉంటుంది. దీనికి టైమ్ లిమిట్ అంటూ ఏం లేదు. టైమ్ పెట్టుకుంటే అనుకున్న అవుట్‌పుట్ రాదు.

హీరోల మధ్య హెల్దీ వాతావరణంపై మీ స్పందన?

– నేను, తారక్ ముందు నుంచి మంచి ఫ్రెండ్స్. తరచూ కలుస్తుంటాం. ఈ మధ్య మహేష్ కూడా కలుస్తున్నాడు. మా మధ్య ఒక మంచి ఆరోగ్యకరమైన వాతావరణం ఉంది. నిజం చెప్పాలంటే ఇది నాన్నగారి నుంచి వచ్చింది. ఆయన అప్పట్లో సినిమా టైమ్‌లో, సక్సెస్ అయినప్పుడు పార్టీలిచ్చేవారు. అయితే గతేడాది కలెక్షన్ల ప్రకటన విషయంలో కాస్త ఇబ్బంది ఎదురైంది. అందుకే సాధ్యమైనంత వరకు కలెక్షన్లు ప్రకటించవద్దని నా నిర్మాతలకు చెబుతున్నా. నటనలో ఆ హీరో బాగా చేశాడు, ఈ హీరో బాగా చేశాడంటే బాగుంటుంది. కానీ కలెక్షన్లలో పోటీ అవసరం లేదనేది నా అభిప్రాయం. ఫ్యాన్స్ ఒత్తిడి మేరకు పెట్టినా అది మరో రకంగా వెళ్తుంది.

కొరటాలశివతో మీ సినిమా ఉంటుందా?

– కొరటాల శివతో సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకున్నా. నాతోనే సినిమా చేయాలని కొరటాల వచ్చారు. కానీ నేను 'ఆర్‌ఆర్‌ఆర్'కి కమిట్ కావడంతో అది నాన్నగారితో సెట్ అయ్యింది. 'సైరా' తర్వాత నాన్నగారు కొరటాల శివతో చేస్తారు. ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో ఉంటుంది. 'ఆర్ ఆర్ ఆర్' తర్వాత కొరటాలతో కచ్చితంగా ఓ సినిమా చేస్తా.



అప్పుడే సత్తా తెలుస్తుంది

'ప్రత్యేక పాటల్లో నటిస్తే మనలోని డాన్స్ నైపుణ్యం బయటపడుతుంది' అని అంటోంది తమన్నా. తనదైన డాన్సులతో తమన్నా ఇప్పటికే ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా దక్షిణాదిలో ప్రత్యేక పాటలకు కేరాఫ్‌గానూ నిలిచింది. ఇప్పటికే 'అల్లుడుశీను', 'స్పీడున్నోడు', 'జాగ్వర్', 'జై లవ కుశ', 'కేజీఎఫ్' చిత్రాల్లోని స్పెషల్ సాంగ్స్‌లో అదిరిపోయే స్టెప్పులేసి కుర్రకారుని ఫిదా చేసింది. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో తమన్నా బిజీగా ఉంది. ప్రత్యేక గీతాల్లో నటించడంపై మీ స్పందన ఏంటని ఓ ఇంటర్వ్యూలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, 'నా కెరీర్ ప్రారంభంలో డాన్స్‌ల వల్లే మంచి గుర్తింపు పొందాను. నాకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు కూడా వచ్చింది. ఇక హీరోయిన్‌గా నటించే సినిమాల్లో మా డాన్స్ ప్రతిభను కనబరిచే అవకాశం అరుదుగా దొరుకుతుంది. కానీ ప్రత్యేక పాటల్లో అది పుష్కలంగా ఉంటుంది. అందరి దృష్టి మనపైనే ఉన్నప్పుడు మరింత బాగా చేసేందుకు ప్రయత్నిస్తాం. నిజం చెప్పాలంటే ప్రత్యేక పాటల ద్వారానే మన నృత్య ప్రతిభను సంపూర్ణంగా చాటుకోగలం' అని తెలిపింది. తమన్నా ప్రస్తుతం నటించిన 'ఎఫ్2' సంక్రాంతి కానుకగా ఈ నెల 12న విడుదల కానుంది. దీంతోపాటు 'సైరా నరసింహారెడ్డి', 'దేవి 2', 'దట్ ఈజ్ మహాలక్ష్మి' వంటి చిత్రాల్లో భిన్న పాత్రలు పోషిస్తోంది.

బన్నీ సరసన బంపర్ ఆఫర్..!

'ఛలో', 'గీత గోవిందం', 'దేవదాస్' వంటి హ్యాట్రిక్ హిట్స్‌తో రష్మిక మందన్నా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా నిలిచింది. వరుస విజయాలతో అందరి దృష్టిని ఆకర్షించిన రష్మిక తాజాగా ఓ బంఫర్ ఆఫర్ అందుకున్నట్టు సమాచారం. అల్లు అర్జున్ సరసన నటించబోతుందనే వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ ఓ సినిమా చేయనున్న విషయం విదితమే. ఇటీవల ఈ ప్రాజెక్ట్‌ని అధికారికంగానూ ప్రకటించారు. త్వరలోనే ఇది రెగ్యులర్ షూటింగ్‌ని జరుపుకోబోతుంది. గీతా ఆర్ట్స్‌లో తెరకెక్కిన 'గీత గోవిందం'లోని రష్మిక నటనకు ఇంప్రెస్ అయిన బన్నీ తన తాజా సినిమాలో ఆమెనే ఎంపిక చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారట. దీంతో రష్మికతో ఈ విషయమై చిత్రయూనిట్ చర్చించినట్టు తెలుస్తోంది. త్రివిక్రమ్, బన్నీ కాంబినేషన్‌లో సినిమా అంటే కచ్చితంగా భారీ స్థాయిలో ఉంటుంది. కాబట్టి ఈ సినిమాకి రష్మిక నో కంటే ఎస్ అని చెప్పే అవకాశమే ఎక్కువగా ఉంటుందని వేరే చెప్పక్కర్లేదు. అయితే మొదట ఈ ప్రాజెక్ట్ కోసం కైరా అద్వానీ పేరు వినిపించిన విషయం విదితమే. మరి ఈ ఇద్దరిలో ఎవరిని ఫైనల్ చేస్తారనే విషయం ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే ఉంది. రష్మిక ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'డియర్ కామ్రేడ్'తోపాటు కన్నడలో మరో రెండు చిత్రాల్లో యాక్ట్ చేస్తోంది.



శాటిలైట్ శంకర్
సాహసోపేతమైన జర్నీ..




బాలీవుడ్ నటుడు సూరజ్ పంచోలి నటిస్తున్న నయా చిత్రం 'శాటిలైట్ శంకర్'. ఇర్ఫాన్ కమల్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో సూరజ్ సైనికుడిగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రెండు ఫస్ట్‌లుక్స్‌ని విడుదల చేశారు. సూరజ్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో ఈ పోస్టర్స్‌ని పంచుకున్నారు. మొదటి పోస్టర్‌లో సైనికుడి డ్రెస్‌పై వివిధ బ్యాడ్జీలున్నాయి. దీనికి 'అద్భుతమైన ప్రయాణం ప్రారంభమైంది' అని క్యాప్షన్ ఇచ్చారు. రెండో పోస్టర్‌లో శివలింగం, బ్యాక్‌డ్రాప్‌లో పర్వతాలు, మ్యాప్ ఉంది. 'ఒక కచ్చితమైన ముగింపుతో సాగే జీవితమే ఈ జర్నీ. టెన్షన్ ప్రారంభమైంది. అందరు దీనికి కనెక్ట్ అవుతారు' అని పేర్కొన్నాడు. ఈ రెండు పోస్టర్స్ ఆకట్టుకుంటున్నాయి. దేశ భక్తి ప్రధానంగా ఓ సైనికుడు చేసే సాహసోపేతమైన జర్నీ నేపథ్యంలో సినిమా సాగుతుందని తెలుస్తుంది. ఈ జర్నీ చేసే క్రమంలో అసలు వాస్తవాలను తానెలా తెలుసుకున్నాడనేది ఆసక్తికరం. ఈ సినిమాని వచ్చే ఏడాది జులై 5న విడుదల చేయనున్నారు.

ఈబీసీ 10 శాతం కోటాకు రాజ్యాంగపరంగా చిక్కులున్నాయా?

- రాజ్యాంగ సవరణ ద్వారా సాధ్యమేనా..?
- గతంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాలు ఏం చెప్పాయి..?

న్యూఢిల్లీ: అగ్రకులాలల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ పరంగా నిలుస్తుందా..? లేదా..? అన్నది ఇప్పుడు అందరి ముందూ ఉన్న ప్రశ్న. ఇప్పటివరకూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పుల ప్రకారం చూస్తే పలు సందేహా లు ఎవరికైనా సహజమే. ఆయా తీర్పుల్లో రాజ్యాంగ ధర్మాస నాలు చేసిన వ్యాఖ్యానాలు, ఇచ్చిన తీర్పుల గురించి ఓసారి పరిశీలిస్తే..



1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైంది. 1990లో విపి సింగ్ నేతృత్వంలోని జనతాదళ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా రిజర్వే షన్ అనుకూల, వ్యతిరేక ఉద్యమాలు జరిగాయి. దాంతో, ఆ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లింది. 1991లో అధికారం చేపట్టిన పివి నర్సింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్లతోపాటు ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. దాంతో, ఈ రెండు రకాల రిజర్వేషన్లను రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించింది. రాజ్యాంగంలోని అధికరణం 340 ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనకబడినవారికి రిజర్వేషన్లు కల్పించడం సరైందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదే అంశానికి సంబంధించి దాఖలైన అనుబంధ పిటిషన్లపైనా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందిరాసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన ఈ కేసులో పివి నర్సింహారావు ప్రకటించిన 10శాతం ఈబీసీ రిజర్వేషన్లను తిరస్కరించింది. కేవలం ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లకు రాజ్యాంగం అనుమతించదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. వెన కబాటుతనాన్ని నిర్ధారించడానికి కొన్ని తరాలపాటు వివక్షకు గురైన చారిత్రక నేపథ్యం ఉండాలని జస్టిస్ ఎం.వెంకటా చలయ్య నేతృత్వంలోని 8మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అదేవిధంగా అధికరణం 14 ప్రకారం సమానత్వ హక్కును కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగ సంస్థలకు ఉన్నదని తెలిపింది. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 50 శాతం జనరల్ కేటగిరీ కింద ప్రతిభ ఆధారంగా ఇవ్వాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

అయితే, తమిళనాడులాంటి కొన్ని రాష్ట్రాల్లో 50 శాతానికన్నా అధికంగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు కదా అన్నది మరికొందరి అనుమానం. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇందులో బీసీలకు 50 శాతం, ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు ఒక్క శాతం అమలవుతున్నాయి. తమిళనాడులో ఎస్టీల జనాభా తక్కువన్నది గమనార్హం. 50శాతానికి మించి రిజర్వేషన్లను అమలు చేస్తున్న రాష్ట్రాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చారు. దీని పైనా కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో 9వ షెడ్యూల్‌లోని అంశాలు రాజ్యాంగ సమీక్షకు అతీతం కాదని తేల్చి చెప్పింది. ఐఆర్ కోహెల్వో వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసుగా 2007లో 8మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. ఈ కేసులో ఇంకా తుది తీర్పు రావాల్సి ఉన్నది. 2010లో సుప్రీంకోర్టు ఇచ్చిన మరో తీర్పులో శాస్త్రీయమైన డేటా ఉన్నపుడు 50శాతానికి అధికంగా కూడా రిజర్వేషన్లు ఇవ్వొచ్చునని తెలిపింది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ప్రకటించిన 10శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటే రాజ్యాంగాన్ని సవరించాలి. అందుకు పార్లమెంట్ ఉభయసభల్లోనూ మూడింట రెండొంతుల మంది సభ్యులుఆమోదం తెలపాలి.

అయితే, పార్ల మెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందినా అదిన్యాయ సమీక్షకు అతీతం కాదు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చేందుకు పార్లమెంట్‌కు కూడా అధికారంలేదని సుప్రీం కోర్టు పలు కేసుల్లో స్పష్టం చేసింది. 1973లో కేశవా నంద భారతి వర్సెస్ కేరళ కేసులో రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం కేంద్రానికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అనుకూలం 323 మంది... వ్యతిరేకం ముగ్గురు

న్యూఢిల్లీ : అగ్రవర్ణాల్లో పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 323 సభ్యులు ఓటేశారు. వ్యతిరేకంగా 3 ఓట్లు పడ్డాయి. ఓటింగ్ సమయంలో సభలో మొత్తం 326మంది ఉన్నారు. దీంతో మూడింట రెండొంతుల మెజార్టీతో బిల్లుకు సభ ఆమోదం దక్కింది. దీనికంటే ముందు బిల్లుపై సభలో నాలుగున్నర గంటలపాటు చర్చసాగింది. బిల్లు సవరణకు లోక్‌సభ సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో, డివిజన్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ నిర్ణయించారు. రాజ్యాంగ సవరణ బిల్లు కావడం వల్ల డివిజన్ ఓటింగ్ తప్పనిసరి అని సుమిత్రా మహాజన్ అన్నారు. అనంతరం సభ్యులు ప్రతిపాదించిన సవరణలపై ఓటింగ్ జరిగింది. చర్చ సందర్భంగా దాదాపు అన్ని పార్టీల నాయకులూ బిల్లుకు



మద్దతు పలికారు. బిల్లుపై రాజ్యసభలో బుధవారం చర్చ జరగనున్నది.124 రాజ్యాంగ సవరణ కోరుతూ కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ ఈబీసీ రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలోని అధికరణలు 15, 16లకు సవరణలను ప్రతిపాదిస్తూ ఈ బిల్లును తీసుకొచ్చామని ఆయన అన్నారు.

బిల్లులో సవరణలు కోరండి

- ఎంపీలకు సీఎం ఆదేశం
- మైనార్టీ, ఎస్టీల రిజర్వేషన్లను బిల్లులో చేర్చాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో సవరణలు కోరాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని ముస్లింలకు వెనుకబడిన వారికి 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో పెట్టాల్సి ఉందని, ఇప్పుడు కేంద్రం రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేపట్టినందున, ఈ బిల్లులో రాష్ట్రంలో రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా చేర్చేలా కోరాలని ఎంపీలకు సూచించారు. బిల్లులో సవరణలు తెచ్చి, తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను నెరవేర్చేందుకు పట్టుపట్టాలని తెలిపారు.

31న ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్షను ఈనెల 31వ తేదీకి ఇంటర్ బోర్డు మార్చింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 30న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించామని తెలిపారు. ఈనెల 30న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించిందని పేర్కొన్నారు. అందుకే పర్యా వరణ విద్య పరీక్షను ఈనెల 31న నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 28న ఉద యం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువలు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ విద్య, నైతికత, మానవ విలువల పరీక్షలు హాజరుకావడం, ఉత్తీర్ణత పొందడం తప్పనిసరి అని తెలిపారు. ఒకవేళ ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతే ఇంటర్ మార్కుల మెమో ఇవ్వబోమని పేర్కొన్నారు.

ముమ్మాటికీ ఎన్నికల స్టంటే

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల పెంపు పేరుతో మరొక కొత్త నాటకానికి మోడీ సర్కారు తెరలేపిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. ఆగమేఘాల మీద బిల్లు తెస్తున్నట్టు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చట్టం చేస్తామని ఉభయ సభలపై ఒత్తిడి తేవాలని ప్రయత్నించడం పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. బిల్లుపై సభ్యులు కనీస అధ్యయనం చేయకుండా ఇటువంటి హరీబరీ నిర్ణయాలెవరి కోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పార్లమెంట్‌లో ఉన్నప్పటి నుంచి ఇంత వేగవంతంగా, అవకాశవాదంతో కూడిన నిర్ణయాన్ని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) ఎంపీలు కరుణాకరన్, సలీంతో కలిసిన సీతారాం ఏచూరి మీడియాతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వానికి నిజంగా అగ్రవర్ణ పేదలపై చిత్తశుద్ధి ఉంటే, బిల్లును పార్లమెంట్ ముగిసే ఒక్క రోజు ముందు సభలో ప్రవేశపెట్టరని అన్నారు. ఈ చర్యతో మోడీ సర్కారు మత ధ్రువీకరణంతో పాటు కులాల వారీగా దేశ ప్రజానీకాన్ని విడదీసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఓటమి చెందిన తర్వాతే, మోడీ సర్కారు అగ్రవర్ణ పేదలపై మొసలి కన్నీరు కారుస్తుందని వివరించారు. మండల్ కమిషన్‌ను పూర్తిగా వ్యతిరేకించిన బీజేపీ, నేడు మాత్రం రిజర్వేషన్ల గురించి మాట్లాడటం ఓట్ల రాజకీయం తప్ప మరొకటి కాదని తెలిపారు. జనరల్ క్యాటగిరీలో ఉన్నటువంటి పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదని... అయితే, ఆ బిల్లు సంబంధిత కమిటీల్లో చర్చ జరపకుండా వేగంగా అడుగులు వేయడం ఏంటని నిలదీశారు. బిల్లు ముసాయిదాలో రూ. 8 లక్షలలోపు ఉన్నవారు అగ్రవర్ణ పేదలుగా ప్రభుత్వం చేత గుర్తించబడుతున్నారని అన్నారు. అదే సమయంలో, ప్రస్తుతం కనీస వేతనం రూ. 18 వేల కోసం కార్మికులు దేశవ్యాప్త ధర్నా చేయాల్సి వస్తోందని, ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో నగరానికి ఒక్కో విధంగా ఆదాయ, వ్యయాలుంటాయని గుర్తు చేశారు. అసలు రూ. ఎనిమిది లక్షల ఆదాయం ఉన్నవారని బిల్లు ముసాయిదాలో పెట్టడంపై ఏచూరి ఆక్షేపణ వ్యక్తం చేశారు. రూ. 8 లక్షల లోపు ఉన్నవారికే రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ఎవరు చెప్పారని... ఏదైనా కమిటీ నివేదించిందా? అని సర్కారును నిర్ణయాన్ని సవాలు చేశారు. ఎవ్వరితో సంప్రదించకుండా నిర్ణయాలు ప్రకటించడం ప్రజాస్వామ్యంలో సముచితం కాదని గుర్తు చేశారు. ఉపాధి కల్పనపై తీవ్రంగా దృష్టి సారించాల్సిన మోడీ సర్కారు ఇటువంటి నిర్ణయాలపై ఎందుకు వేగంగా ముందుకు వెళుతోందని ప్రశ్నించారు. ఇటీవల వెలువడిన అధికారిక సమాచారం ప్రకారం... ఇప్పటివరకు 11 మిలియన్ల యువకుల ఉద్యోగాలు కేవలం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఊడిపోయాయని వెల్లడించారు. దాంతోపాటు ఇదివరకే ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను చిత్తశుద్ధితో ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ వల్ల ఆయావర్గాలకు వచ్చే ఉద్యోగాలే రావడం లేదని... కొత్తగా రిజర్వేషన్లు కల్పించేవారికి ఏం ఇస్తారని ప్రశ్నించారు. నయా ఆర్థిక విధానాల కారణంగా దేశంలోని యువతకు ఉపాధి గల్లంతు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. మోడీ సర్కారు రోజురోజుకీ ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ చేస్తే, ఆయా సంస్థల్లో ఎక్కడ ఉద్యోగాలుంటాయని అడిగారు. అందుచేత, ఉపాధి గ్యారెంటీ విద్యను అందించడం, అందుకు సంబంధించిన చర్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. అంతేకానీ, అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల పేరుతో ఓట్లు రాబట్టుకునేందుకు కంటి తుడుపు చర్యలు చేయొద్దని హెచ్చరించారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను అమలు పరచకుండా,ఈ బిల్లు తీసుకువచ్చినా పెద్దగా ఉపయోగం ఉండదని ఏచూరి అభిప్రాయపడ్డారు. విధానపరమైన ఎన్నో అంశాలపై చర్చ జరుగకుండా ఈ నిర్ణయం ఎంతమాత్రం ప్రభావం చూపదన్నారు.

కొండగట్టు ప్రమాదంలో మరో మహిళ మృతి

4 నెలలుగా చికిత్స..

- 65కు చేరుకున్న మృతుల సంఖ్య

నవతెలంగాణ- కొడిమ్యాల

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై బస్సు బోల్తా పడిన ఘటనలో గాయపడి ఇన్నాళ్లు చికిత్స పొందిన మహిళ మంగళవారం మృతిచెందింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు వద్ద సెప్టెంబర్ 11న బస్సు బోల్తా పడిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఇప్పటి వరకు మృతుల సంఖ్య 65కు చేరుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లికి చెందిన సురకంటి హరిత(35) ఆ రోజు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చేర్చారు. 42 రోజులపాటు అక్కడ చికిత్స చేసినా ఆమెలో ఎలాంటి చలనమూ లేకపోయింది. దీంతో కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తీసుకొచ్చి 11 రోజులు చికిత్స అందించారు. అక్కడ పూర్తిగా కోమాలోకి వెళ్లిపోవడంతో రెండు నెలల నుంచి ఇంట్లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఉదయం హరిత మృతిచెందింది. మృతురాలికి భర్త సంజీవరెడ్డి, కుమారుడు అజిత్‌రెడ్డి ఉన్నారు. హరిత సాక్షర భారత్ గ్రామ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహించేది. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పునుగోటి కృష్ణారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దాదాపు నాలుగు నెలలుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయిన హరిత మృతదేహాన్ని చూసి గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు.

దరఖాస్తుపల్లి పంచాయతీ ఏకగ్రీవానికి తీర్మానం

నవతెలంగాణ- వట్‌పల్లి

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం దరఖాస్తుపల్లి పంచాయతీ సర్పంచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు మంగళవారం గ్రామస్తులు తీర్మానం చేశారు. కొత్తగా ఏర్పాటైన పంచాయతీ అభివృద్ధికి తాము ఎన్నిక లేకుండా సర్పంచ్‌ను ఎన్నుకుంటామని వారు తెలిపారు. దూదేకుల మహ్మద్‌తో సర్పంచ్ పదవికి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరారెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ వేయించారు.

మరో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసం

నవతెలంగాణ-గచ్చిబౌలి

మరో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాన్ని పోలీసులు ఛేదించారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని రూ.కోట్లు మోసం చేసిన 58 మందిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్ మంగళవారం మీడియాకు వివరించారు.

విజయ్ ఈశ్వరన్ 1998లో హాంగ్‌కాంగ్‌లో మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలో పని చేశాడు. అక్కడ వస్తున్న లాభాలను చూసి తానూ ఇలాంటి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే అదే ఏడాదిలో హాంగ్‌కాంగ్ కేంద్రంగా క్వెస్ట్ నెట్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీ ప్రారంభించాడు. టూరిజం ప్యాకేజీ, ఆరోగ్య ఉత్పత్తులు, బ్యూటీ ప్రొడక్ట్స్, బంగారు ఆభరణాలు తదితర వాటి పేరుతో ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం వస్తుందని నమ్మబలికాడు. ముందు పెట్టుబడి పెట్టిన వారితో మరికొందరిని చేర్పిస్తే మరిన్ని లాభాలు వస్తాయంటూ ప్రచారం చేశాడు. ఇలా చైన్ సిస్టంలో ఐటీ ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి భారీ డబ్బు గుంజారు. ఎంతో మందిని మోసం చేశాడు. ఈ విషయంపై ఆయనపై కేసులు కూడా నమోదయ్యాయి. దాంతో వెంటనే పేరు మార్చి గోల్డ్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ పేరుతో మరో కంపెనీ ప్రారంభించాడు. ఆ మోసం కూడా బయటపడటంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి జైలుకు



మాట్లాడుతున్న సీపీ సజ్జనార్

తరలించారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. 2011లో విహన్ డైరెక్ట్ సెల్లింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ (క్యూనెట్) పేరుతో మరో కంపెనీ ప్రారంభించాడు. దీని ద్వారా సుమారు రూ.1000 కోట్ల వరకు ప్రజలను మోసం చేశాడు. డబ్బులు అడిగిన వారిని బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితున్ని అరెస్టు చేశారు. బెంగళూరులో ఉన్న ఆయన గోదాం, రూ.2.7 కోట్లు సీజ్ చేశారు. ఈ సంస్థపై ఇప్పటికే ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలో కేసులున్నాయి. ప్రధానంగా ఐటీ ఉద్యోగులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసం కొనసాగిందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే బొంబాయిలో క్యూనెట్ బాధితుల సంఘం ఏర్పాటు చేసుకున్న బాధితులు అక్కడ ఆందోళన నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 14 కేసుల్లో పలు రాష్ట్రాల్లో 58 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, ఏసీపీ సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీలకు రిజర్వేషన్‌లు ఎన్నికల స్టంటే : సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కేంద్ర ప్రభుత్వం ఆదరాబాదరాగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్ ఎన్నికల స్టంటేనని పేర్కొన్నారు. వాస్తవానికి ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనేది ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిమాండే అయినా రాజ్యాంగంలోని 15, 16 అధికరణలకు సవరణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని పేర్కొన్నారు. రిజర్వేషన్‌లు 50 శాతం మించకూడదనే సుప్రీం కోర్టు తీర్పు కూడా ఉందని తెలిపారు. కాబట్టి అన్ని పార్టీలతో సంప్రదించి, న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని బిల్లును ప్రవేశపెడితే బాగుండేదని సూచించారు. దేశవ్యాప్తంగా మోడీ సర్కార్‌పై నెలకొన్న వ్యతిరేకతను పక్కదోవ పట్టించే ఉద్దేశ్యంతోనే ఈబీసీలకు రిజర్వేషన్ల బిల్లును అకస్మాత్తుగా తెరపైకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్‌లపై అభ్యంతరాలు లేనప్పటికీ, ఇతర వర్గాల్లో ఆందోళన, అభద్రత లేకుండా చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని తెలిపారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఓబీసీ రిజర్వేషన్‌ల పెంపు, ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ, మైనారిటీ రిజర్వేషన్‌ల పెంపునకు సంబంధించిన బిల్లులనూ ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.

రెండేండ్ల ఆదాయ, వ్యయాలతో ఫీజులు ఖరారు

- నేడో, రేపో టీఏఎఫ్ఆర్సీ నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) బుధ లేదా గురువారం నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నది. ఇంజినీరింగ్‌తోపాటు వృత్తి విద్యా కాలేజీ యాజమాన్యాల నుంచి రెండేండ్లకు సంబంధించిన ఆదాయ వ్యయాల ఆడిట్ నివేదికలు సమర్పించాలని కోరనుంది. 2016-17 నుంచి 2018-19లో ఫీజుల ఖరారకు మూడేండ్లకు సంబంధించిన ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికలు కాలేజీలు సమర్పించేవి. కానీ ఈ ఏడాది ఆ నిబంధనను టీఏఎఫ్ఆర్సీ మార్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇంకా కొనసాగుతున్నది. అందుకే రెండేండ్లకు సంబంధించిన ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికల ఆధారంగా వృత్తి విద్యా కోర్సుల ఫీజులను ఖరారు చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అంటే 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికలను సమర్పించాలని ఆదేశించనుంది. ఈ గణాంకాలతో 2019-20 విద్యాసంవత్సరం నుంచి 2021-22 విద్యాసంవత్సరం వరకు మూడేండ్లపాటు అమల్లో ఉండేలా ఫీజులు ఖరారవుతాయి.

అడవులు, పర్యావరణ రక్షణే ధ్యేయం

- అటవీ నేరాల నిందితులపై పీడీ యాక్ట్ పెట్టాలి : పీసీసీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవులు, పర్యావరణ రక్షణే ధ్యేయంగా అటవీశాఖ అధికారులు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో కచ్చితంగా పర్యటించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. సచివాలయంలో అటవీశాఖ జిల్లా అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీసీసీఎఫ్ పీ.కే.ఝా, పీసీసీఎఫ్ రఘువీర్, పృధ్వీరాజ్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అదనపు పీసీసీఎఫ్ లోకేశ్ జైస్వాల్, ఆర్.ఎం.డోబ్రియాల్, స్వర్గం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ పీ.కే.ఝా మాట్లాడుతూ.. చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, పోలీసుల సహకారంతో అవసరమైతే నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో అటవీ నేరగాళ్లు, స్మగ్లర్లను గుర్తించి, వారిపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. అడవులను కాపాడటంలో పౌరులను కూడా జాగృతం చేయాలన్నారు. పీసీసీఎఫ్ (విజిలెన్స్) పీ.రఘువీర్ మాట్లాడుతూ..అధికారులు, సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే అడవుల రక్షణ సాధ్యమవుతుందన్నారు. అటవీ హక్కుల చట్టం కింద భూములను సాగు చేసుకుంటున్న వారికి కూడా పక్కనే ఉన్న అడవిని కాపాడే బాధ్యత ఉందని గుర్తు చేయాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలో అటవీ రక్షణ కమిటీ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సీజన్‌కు హరితహారం కోసం నర్సరీల్లో వెదురు, టేకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ పార్కుల పురోగతి, అటవీ పునరుజ్జీవన చర్యలు, కంపా నిధుల వినియోగం, వివాదాల్లో ఉన్న అటవీ భూముల విషయంలో రెవెన్యూ శాఖతో సమన్వయంపై సమావేశంలో చర్చించారు.

కుల, మతాలకతీతంగా ఈబీసీ రిజర్వేషన్లు

బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడే పూర్తి స్థాయి ప్రజాస్వామ్యం వచ్చినట్టని బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు అన్నారు. ఈబీసీ రిజర్వేషన్లు అన్ని కులాలు, మతాలకు వర్తిస్తాయని చెప్పారు. కుల ధృవీకరణ లేని వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనే తేడా లేకుండా అందరికీ కొత్త అవకాశాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలందరికీ ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా క్రిమిలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. దేశంలో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జనాభా ఉందని, మన రాష్ట్రంలో 85నుంచి 89 శాతంగా ఉన్నారని తెలిపారు. సమాజికంగా, చారిత్రాత్మకంగా గౌరవమర్యాదలు పొందుతున్న వారు 20 నుంచి 25 శాతం మాత్రమే ఉన్నారని వివరించారు. వీరిలో పేదలు ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా కొంత లబ్దిపొందే అవకాశం ఉందని చెప్పారు. జనరల్ కేటగిరిలోని ఈబీసీ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక వర్గాలవారందరికీ వర్తిస్తాయని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా పేదరికాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారంతా ఈబీసీ రిజర్వేషన్లకు అర్హులన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

బీసీ జనాభా ప్రాతిపదికన వారికి రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని బీఎస్ రాములు అభిప్రాయపడ్డారు.బీసీ (ఈ) గ్రూపుకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లివిరుస్తుదని చెప్పారు. దీంతో అగ్రకుల రిజర్వేన్ల కోసం ఉద్యమాల ఘర్షణలకు ముగింపు లభిస్తుందన్నారు.

చాప కింద నీరులా పులిరాజా!

ఎయిడ్స్ బారిన ఏటా 11 వేల మంది



బాధితుల్లో నలబై దాటిన వారే ఎక్కువ

- రోగుల్లో 52 శాతం వీరే
- నమోదు కాని 'ప్రయివేటు' రోగుల సంఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎయిడ్స్ మళ్లీ బుసలు కొడుతున్నది. హెచ్ఐవీ వ్యాధి సోకిన వారిలో ఎక్కువగా మధ్యవయస్కులే ఉంటున్నారు. నిర్లక్ష్యం, అవగాహనలేమితో మహమ్మారి బారినపడుతున్నారు. మరణిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ముఖ్యంగా జాతీయ సగటు కంటే ఎక్కువగానే కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఎయిడ్స్‌పై చాలా మందిలో అవగాహన లేకపోవడంతోనే వ్యాధిబారిన పడుతున్నారనే విమర్శలున్నాయి. అనుమానం వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉండగా భయపడి వెనుకంజ వేస్తున్నారు. గతంలో హెచ్ఐవీ వస్తే పదేండ్లు మాత్రమే జీవించేవారు. ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలు అందు బాటులో ఉండడం ఎక్కువ కాలం బతుకుతున్నారు. హెచ్ఐ వీ పరీక్ష చేసుకున్నప్పుడు పాజిటివ్ అని తేలితే వైద్యుని సంరక్షణలో వైద్యం చేసుకోవాలని అధికారులు సూచిస్తు న్నారు. నిత్యం మందులను వాడితే వైరస్ ప్రభావం శరీరం లో తక్కువవుతూ వస్తుంది. మందులు పక్కనబెటితే శరీరం లో వైరస్ బలపడి ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 2016-17లో 13.03 లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తే 12,058 ఎయిడ్స్ కేసులు నమోదయ్యాయి. 2017-18లో 11.25 లక్షల మందికి పరీక్షలు చేస్తే 10,194 కేసులు బయటపడ్డాయి. 2018-19లో 11.40 లక్షల మందికి టెస్టు చేస్తే నవంబర్ 15 నాటికి 9,050 మంది తేలారు. కాగా, 40 ఏండ్లు దాటిన వారే ఎక్కువగా ఈ మహమ్మరి బారిన పడుతుండటం గమనార్హం. బాధితుల్లో 52 శాతం మంది 40 నుంచి 45 ఏండ్లలోపు వారే ఉంటున్నారు. 15-49 ఏండ్ల వయసున్న వారితోనే ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నదని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) పేర్కొంటున్నది. ఈ వయసున్న వారిలో 6 శాతం మంది ఎయిడ్స్ పరంగా 'హై రిస్క్' జోన్‌లో ఉంటారని ఈ సంస్థ నిర్ధారించింది. రాష్ట్రంలో ఈ వయసున్న వారిలో ఆరు శాతం లెక్కన 10.50 లక్షల మంది ఉన్నారు. '40 ఏండ్లు దాటిన వారిలో జీవితపరంగా స్థిరత్వం వస్తున్నది. ఆర్థికంగానూ ఇలాగే ఉంటున్నారు. ఎక్కువ మంది ఉపాధి, ఉద్యోగాల కోసం స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితులో కొత్త వ్యక్తులతో సంబంధాలు ఎయిడ్స్‌కు కారణమవుతున్నాయి' అని హైదరాబాద్‌లోని ప్రభుత్వ బోధన ఆస్పత్రి వైద్య నిపుణుడు ఒకరు 'నవతెలంగాణ'కు వివరించారు.

రాష్ట్రంలో ఎయిడ్స్ కేసులు ఇలా..

2014-15	13,420
2015-16	11,081
2016-17	11,403
2017-18	10,194
2018-19	9,050

(నవంబర్ 15 వరకు)

మరోవైపు, రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ విషయంలో సరైన విధానం కనిపించడంలేదు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రాష్ట్ర విభాగం (టీ శాక్స్).. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన వారి సంఖ్యనే పరిగణనలోకి తీసుకుంటున్నది. ఎయిడ్స్ రోగుల్లో (గ్రామీణులు, పేదలు మాత్రమే ప్రభుత్వ ఎయిడ్స్ చికిత్స కేంద్రాలకు వస్తున్నారు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కంటే ప్రయివేటు ఆస్పత్రుల్లోనే ఎక్కువ మంది ఎయిడ్స్ రోగులు వైద్యం తీసుకుంటున్నారు. వ్యాధి సోకినవారు బయటకి చెప్పుకోవడం లేదు. ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా మందులు పంపిణీ జరుగుతున్నా.. అక్కడ మందులు తీసుకుంటే అందరికీ తెలిసిపోతుందన్న ఉద్దేశంతో ఎక్కువ మంది ప్రయివేటు చికిత్సకే మొగ్గు చూపుతున్నారు. ఇలా ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారెంత మంది అన్న లెక్కలు ప్రభుత్వ విభాగాల వద్ద ఉండటం లేదు. ప్రయివేటు సంస్థలపై పర్యవేక్షణ, సమన్వయం లేకపోవడంతో ఎయిడ్స్ నియంత్రణ విషయంలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో జాతీయ సగటును మించి కేసులు నమోదవుతున్నాయి. దేశంలో పరీక్షలు నిర్వహించిన ప్రతి వంద మందిలో ఒకరికి వ్యాధి ఉన్నట్టు తేలగా.. అదే రాష్ట్రంలో ఆ సంఖ్య రెండుగా ఉంటున్నది.

ఏఆర్‌టీ కేంద్రాల కొరత.. చికిత్సా అరకొరే..

రాష్ట్రంలో ఏటా కనీసం 1,000 మందిని ఎయిడ్స్ బలి తీసుకుంటున్నట్టు అంచనా. ఈ వ్యాధితో రాష్ట్రంలో ఇప్పటికే 31 వేల మందికి చనిపోయారని అధికార వర్గాల సమాచారం. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,80,937 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారు. వీరిలో 90,156 మంది ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్నారు. న్యాకో ప్రతి రోగికి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నది. వీటిని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీ సాక్స్) రోగులకు సరఫరా చేస్తున్నది. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.1,000 చొప్పున పింఛన్ అందజేస్తున్నది. అయితే, రెగ్యులర్‌గా మందులు తీసుకోని వారి విషయంలో టీ సాక్స్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో 37,732 మంది ఎయిడ్స్ రోగులు క్రమపద్ధతిలో మందులు తీసుకోవడం లేదు. ఫలితంగా వ్యాధి నియంత్రణ సాధ్యం కావడం లేదని డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఎయిడ్స్ రోగులకు చికిత్స అందించే యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాలు రాష్ట్రంలో 22 మాత్రమే ఉన్నాయి. నిర్మల్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, వరంగల్ రూరల్, మహబూబాబాద్, మెదక్, వనపర్తి, జోగులాంబ, నాగర్‌కర్నూలు, యాదాద్రి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో ఒక్క ఏఆర్‌టీ సెంటర్ కూడా లేదు. వీరంత ఇతర జిల్లాల్లో మందులు తీసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అన్ని జిల్లాల్లోనూ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా మృతుల వివరాలు
(2018 అక్టోబర్ 30 వరకు)

జిల్లా పేరు	మృతులు
ఆదిలాబాద్	947
హైదరాబాద్	6,494
కరీంనగర్	4,850
ఖమ్మం	3,817
మహబూబ్‌నగర్	1,834
మెదక్	2,288
నల్లగొండ	2,494
నిజామాబాద్	4,046
రంగారెడ్డి	1,085
వరంగల్	3,439

సెన్సెక్స్ ▲130.77 **35,981**

నిఫ్టీ ▲30 **10,802**

డాలరుకు రూపాయి విలువ **69.68**



బంగారం(10.గ్రా) **రూ. 31,757**



వెండి (కేజీ) **రూ. 39,349**



కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484



విదేశాల్లో రూ.6వేల కోట్ల అక్రమాస్తులు!



న్యూఢిల్లీ: భారతీయులకు విదేశాల్లో ఉన్న దాదాపు రూ.6000 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్టుగా ప్రభుత్వం మంగళవారం తెలిపింది. 2015లో అమలులోకి తెచ్చిన 'విదేశీ నల్లధన చట్టం'లో భాగంగా అక్టోబర్, 2018 నాటికి వీటిని గుర్తించినట్టుగా సర్కారు తెలిపింది. వీటికి సంబంధించి దాదాపు 34 విచారణ ఫిర్యాదులను కూడా నమోదు చేసినట్టుగా ప్రభుత్వం రాజ్యసభకు వెల్లడించింది. ఆదాయపు పన్ను శాఖ వీటి గుర్తింపునకు గాను ప్రత్యేక వ్యవస్థతో విశేషంగా కృషి చేస్తోందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అక్రమాస్తులను వెల్లడించేందుకు గాను ప్రభుత్వం అప్పట్లోనే దేశ ప్రజలకు అవకాశం ఇచ్చిందని ఆయన అన్నారు. ఈ పథకంలో భాగంగా దాదాపు రూ.4100 కోట్ల విలువైన 648 ఆస్తులను ప్రజలు వెల్లడించినట్టుగా మంత్రి తెలిపారు. వీటికి సంబంధించి ప్రభుత్వం పన్ను, అపరాధ రుసుముల రూపంలో దాదాపు రూ.2470 కోట్ల మేర సొమ్మును వసూలు చేసినట్టుగా తెలిపారు.

డిజిటల్ చెల్లింపుల ప్యానెల్ అధినేతగా నిలేకని



ముంబయి: ఇన్ఫోసిస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన నందన్ నిలేకనికి ప్రభుత్వం మరో గురుతర బాధ్యతను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిం చేందుకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) ఏర్పాటు చేసిన ఐదుగురి సభ్యుల కమిటీకి ఆయనను అధినేతగా నియమించింది. నిలేకని గతంలో విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాజెక్టు ఆధార్ రూపకర్తగా కూడా పని చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భద్రతలు, ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ సూచనలు చేయనుంది. ఈ కమిటీకి చట్టబద్ధత కూడా కల్పించినట్లు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. తొలి మీటింగ్ తర్వాత ఈ కమిటీ 90 రోజుల్లో నివేదికను ఇవ్వనుందని సర్కారు పేర్కొంది.

గృహ విక్రయాల్లో 6% వృద్ధి: నైట్ ఫ్రాంక్

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్ నగరంలో నివాసంతో పాటు వాణిజ్య సముదాయాలకు విపరీతమైన గిరాకీ ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ హైదరాబాద్ శాఖ శాంసన్ ఆర్థర్ తెలిపారు. 2018లో మొత్తంగా దాదాపు 7 లక్షల చదరపు గజాల మేర లావాదేవీలు భాగ్యనరగంలో జరిగినట్టుగా ఆయన వివరించారు. లావాదేవీల విలువ పరంగా బెంగళూరు, ఎన్‌సీఆర్, ముంబయి తరువాత హైదరాబాద్‌లోనే అత్యధికంగా స్థిరాస్తి లావాదేవీలు జరిగినట్టుగా ఆయన తెలిపారు. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలలో గృహాల అమ్మకాల్లో 6 శాతం వృద్ధి నమోదు అయినట్టుగా ఆయన వివరించారు. డిమాండ్‌లో మందగమన పరిస్థితుల కారణంగా డెవలపర్లు ధరలు తగ్గించడంతో పాటు వినియోగదారులకు నేరుగా డిస్కౌంట్లను ప్రకటిచడంతో అమ్మకాల్లో కొంత వృద్ధి కనిపించినట్టుగా ఆయన తెలిపారు. ప్రధానంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో గృహాల అమ్మకాల్లో వృద్ధి కనిపించిందన్నారు.

బుడిబుడి నడకల కారు: హ్యుందాయ్



లాస్‌వెగాస్: ప్రపంచ ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ మార్కెట్లోకి సరికొత్త ప్రోటోటైప్ కారును ఆవిష్కరించింది. నాలుగు చక్రాలతో రోడ్లపై దూసుకుపోయే కార్లకు భిన్నంగా హ్యుందాయ్ సంస్థ అడుగులు వేస్తూ నడుచుకు పోయే వింత కారును మార్కెట్లోకి ఆవిష్కరించింది. సీఈఎస్‌లో ఏటా జరిగే వినూత్న వాహనాల ప్రదర్శన హ్యుందాయ్ ఈ కార్ల గురించి ప్రదర్శనకు ఉంచింది. ఈ నడిచే కార్ల సహాయంతో కష్టసాధ్యమైన మార్గాల్లోనూ సులభంగా ప్రయాణించవచ్చని హ్యుందాయ్ క్రెడిల్ వైస్ ప్రెసిడెంట్ జాన్ స్యూ తెలిపారు. ముఖ్యంగా కచ్చారోడ్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు.. ఎత్తైన ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించడానికీ ఈ తరహా కార్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన వెల్లడించారు. 5 అడుగుల ఎత్తయిన గోడలను సైతం ఎక్కేలా వీటిని రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న ఈ కార్లు మార్కెట్లోకి రావాలంటే మాత్రం మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందేనని కంపెనీ తెలిపింది. వీటిని వాణిజ్య పరంగా కూడా అందుబాటులోకి తెనున్నట్టు కంపెనీ ఈ ప్రదర్శనలో తెలిపింది.

ఎల్‌జీ నుంచి చాపలా చుట్టేసే టీవీ!



లాస్‌వెగాస్: టెలివిజన్‌ల విభాగంలో సరికొత్త విప్లవానికి తెర తీస్తూ ప్రముఖ ఎలక్ట్రానిక్ దిగ్గజం ఎల్‌జీ చాపలా చుట్టేసే టీవీని మార్కెట్లోకి ఆవిష్కరించింది. మడతపెట్టగలిగే 65 అంగుళాల 4కే సిగ్నేచర్ ఓఎల్ఈడీ టీవీని సంస్థ తాజాగా ప్రదర్శించింది. లాస్ వెగాస్‌లో జరుగుతున్న కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్)లో భాగంగా ఈ టీవీని ఎల్‌జీ ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ఏడాదిలోనే ఈటీవీ మార్కెట్లోకి అందుబాటులోకి రానుంది. ఈ టీవీని సులువుగా ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లడంతో పాటు అవసరం లేనపుడు చుట్టేసి పక్కన పెట్టుకునే విధంగా 65 అంగుళాల తెరతో ఎల్‌జీ దీనిని రూపొందించింది. గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా వర్చువల్ అసిస్టెంట్, యాపిల్ ఎయిర్ ప్లే సపోర్టు తో పాటు 100 వాల్ట్స్ డాల్బీ అట్మాస్ స్పీకర్లతో శ్రేష్టమైన ధ్వని ఈ కారుప్రత్యేకత అని సంస్థ సీనియర్ డైరెక్టర్ డైరెక్టరి టిమ్ అలెస్సీ చెప్పారు. అలాగే తన మొట్టమొదటి సూపర్-హై-డెఫినేషన్ 88 అంగుళాల 8కె ఓఎల్ఈడీ టీవీని కూడా ఎల్‌జీ సంస్థ ఈ ప్రదర్శనలో ఆవిష్కరించింది.

మౌలిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- రానున్న ఐదేండ్లలో రూ.8వేల కోట్ల పనులు
- అత్యాధునిక రోడ్లు, మురుగు నిర్వహణ: జీహెచ్ఎంసీ కమీషనర్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చే ప్రక్రియలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని హైదరాబాద్ మహనగర మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ దాన కిశోర్ అన్నారు. మంగళవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేండ్ల కాలంలో హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో మెరుగైన రోడ్ల ఏర్పాటు, అభివృద్ధికి గాను దాదాపు రూ.5000 కోట్ల మేర వ్యయం చేయనున్నట్టుగా ఆయన తెలిపారు. దీనికి తోడు రానున్న నగరంలో మెరుగైన మురుగు నీటి నిర్వహణకు గాను దాదాపు రూ.3000 కోట్ల మేర నిధులను వ్యయం చేయనున్నట్టుగా ఆయన వివరించారు. సహజ, పునరుత్పత్తి ఇంధన వనరులపై తమ సర్కారు ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా రానున్న రోజుల్లో ప్రతి భవనానికి ప్రత్యేకంగా చిన్నపాటి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి వ్యవస్థ ఉంటేనే అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకు రావాలని యోచిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. విశేసంగా విస్తరిస్తున్న నగరపు అవసరాలకు తగ్గట్టుగా త్వరలోనే మరో రింగ్‌రోడ్డుతో పాటుగా మంచి నీటి భద్రతను అందించేలా 20 టీఎంసీలు కలిగిన రెండు రిజర్వాయర్లను నిర్మించే ప్రక్రియను ప్రభుత్వ ప్రారంభించిందని ఆయన తెలిపారు. దీనికి తోడు ఈ రిజర్వాయర్లను అను సంధానం చేస్తూ 3 మీటర్ల వ్యాసార్థంలో పైపులైను నిర్మాణం పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ఆయన వివరించారు. దీంతో నగర ప్రజలకు పూర్తి మంచినీటి భద్రత లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు ఎస్. రామ్‌రెడ్డి మాట్లాడుతూ స్థిరాస్తి రంగంలో ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో మధ్య తరగతి ప్రజలు భవి ష్యత్తు అవసరాల నిమిత్తం ఇప్పుడు స్థిరాస్తిని కొను గోలు చేసుకొని ఉంచుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు. స్థిరాస్తి పరిశ్రమ హైదరాబాద్‌లో 15% వృద్ధితో పరుగులు పెడుతోందని ఆయన తెలిపారు.

15 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో..!

క్రెడాయ్ అధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో ఘనంగా స్థిరాస్తి ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టుగా క్రెడాయ్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు ఎస్. రామ్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శనలో దాదాపు 100కు పైగా డెవలపర్లు, ఫైనాన్షియర్లు, మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు వివిధ స్థిరాస్తి రంగ భాగస్వాములు పాల్గొనన్నుట్టుగా ఆయన తెలిపారు. రూ.25లక్షల నుంచి మొదలు కొని రూ.10 కోట్ల విలువైన స్థిరాస్తి ప్రాజెక్టుల వివరాలను ను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నట్టుగా ఆయన వివరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ఈ ప్రదర్శకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు వచ్చే వీలుందని తెలిపారు. దాదాపుగా 75వేల మంది సందర్శకులు ఈ షోకు విచ్చేస్తారని తాము భావిస్తున్నామన్నారు.

మూడో రోజూ మురిపించిన మార్కెట్లు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. డిసెంబంర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీలు మెరుగైన ఫలితాలు ప్రకటించ నున్నాయనే అంచనాలు ప్రభుత్వ రంగ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్టుగా ఆర్బీఐ ప్రకటించడం మంగళవారం మార్కెట్లు లాభాల్లోకి పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలో మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 131 పాయింట్లు పెరిగి 35,981 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 30 పాయింట్లు లాభపడి 10,802 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో 16 స్టాక్స్ లాభపడగా, 14 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. సన్ ఫార్మా అత్యధికంగా 3.98 శాతం లాభపడింది. ఐసీఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యెస్ బ్యాంకు, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంకు షేర్లు 3.46 శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో 26 స్టాక్స్ నష్టపోగా, 24 స్టాక్స్ లాభపడ్డాయి. టెలికాం, బ్యాంకింగ్, వైద్య రంగాల సూచీలు అత్యధికంగా పెరిగి మార్కెట్లకు ప్రధాన మద్దతునిచ్చాయి. మరోవైపు కాపిటల్ గూడ్స్, రియాల్టీ స్టాక్స్ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

భలే.. భలేగా.. రాణించిన బ్యాంకింగ్..

మొండి బాకీలు తగ్గుముఖం పట్టినట్టుగా ఆర్బీఐ వెల్లడించిన గణాంకాల నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ (పీఎస్‌యు) స్టాక్స్ పరుగులు పెట్టాయి. నిఫ్టీలో పీఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 2.6 శాతం లాభపడింది. కాగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సూచీ 3.04 శాతం పెరిగి రూ.305.10కి చేరింది. కాగా కెనరా బ్యాంకు సూచీ ఏకంగా 3.45 శాతం లాభపడి రూ.287.85 వద్ద ముగిసింది. బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకు సూచీలు 1 శాతం నుంచి 3 శాతం వరకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నాయని, మొండి బాకీలు తగ్గుతున్నాయని ఆర్బీఐ గవర్నర్ దాస్ సోమవారం పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు పీఎస్‌బీ సూచీలకు మద్దతుగా నిలిచాయి. ఈ నేపథ్యంలోమార్కెట్లు పరుగులు పెట్టడం విశేషం. ఇదే జోరు బుధవారం కూడా కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

తహసీల్దార్ల పాత్ర కీలకం

- డైరీ ఆవిష్కరణలో ఆవిష్కరణలో రాజేశ్వర్ తివారీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ విభాగంలో తహసీల్దార్ల పాత్ర కీలకమైనదని రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇన్‌ఛార్జి సీసీఎల్ ఏ రాజేశ్వర్ తివారీ అన్నారు. మంగళవారం తెలంగా ణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) వ్యవస్థాపక అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, అధ్యక్షులు కె.గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీని హైదరాబాదులోని సచివాలయంలో తివారీ ఆవిష్కరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకా ల అమలులోనూ, ప్రజలకు సేవలు అందించడంలో తహసీల్దార్లు ప్రధాన భూమికను పోషిస్తున్నట్టుగా చెప్పారు. కిందిస్థాయి ఉద్యోగులకు, సిబ్బందికి, ఉన్నత స్థాయి అధికారులకు వారధిగా తహసీల్దార్లు ఉన్నారన్నారు. బాధ్యతతో పనిచేస్తూ రెవెన్యూశాఖకు మంచి పేరు తేవాలని కోరారు.

10 శాతం రిజర్వేషన్లపై దేశ వ్యాప్త ఉద్యమం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ
- బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈబీసీల్లో అత్యంత వెనుకబడ్డ వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే దేశ వ్యాప్త ఉద్యమం చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ హెచ్చరించారు. అగ్రకులాలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని ఆయన ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీసీ సంఘాల నేతలు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు బీసీ సంఘాల నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గుజ్జకృష్ణ మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడమంటే రిజర్వేషన్ల మూల సిద్ధాంతానికే వ్యతిరేకమన్నారు.

మైనింగ్ కేంద్రంపై దాడి

- జిలెటిన్ స్టిక్స్, మందు ప్యాకెట్లు, రెండు కంప్రెషర్లు స్వాధీనం
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ- ఆమనగల్

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం సమీపంలోని అడవుల్లో ఉన్న మైనింగ్ కేంద్రంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. 1000 జిలెటిన్ స్టిక్స్, 140 మందు ప్యాకెట్లు, రెండు కంప్రెషర్ మెషిన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుందరయ్య వివరాల ప్రకారం.. మైసిగండి సమీపంలో కాంటినెంటల్, మినరల్స్ పేరుతో మైన్స్ నిర్వహిస్తున్నారు. అందులో అనుమతి లేకుండా 1000 ఎలక్ట్రిక్ జిలెటిన్ స్టిక్స్, 140 మందుగుండు పౌడర్ ప్యాకెట్లు ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు మైనింగ్ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉంచిన జిలెటిన్ స్టిక్స్, పౌడర్ ప్యాకెట్లు, కంప్రెషన్ మెషిన్లను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ నిర్వాహకుడు జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది శివశంకర్, వెంకటేష్, బీమా, రామును అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్మిక సంఘాల సవరణ బిల్లు

లోక్ సభలో వ్యతిరేకించిన సీపీఐ(ఎం), కాంగ్రెస్



న్యూఢిల్లీ: లోక్‌సభలో మంగళవారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ కార్మిక సంఘాల సవరణ బిల్లు-2019ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సీపీఐ(ఎం) ఎంపీలు ఎ.సంపత్, ఎంబి రాజేశ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఆరెస్పీ ఎంపీ ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్‌లు వ్యతిరేకించారు. సీపీఐ(ఎం) ఎంపీ సంపత్ మాట్లాడుతూ ఇది రాజ్యాంగ వ్యతిరేకమని, ఆర్టికల్స్ 19(1)(సి), పార్ట్ 3లో పొందుపరిచిన స్ఫూర్తికి ఈ బిల్లు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ బిల్లు రాజాంగంలోని ఆర్టికల్స్ 23, 24, పార్ట్ 4కు వ్యతిరేకమని, ఆర్టికల్స్ 43, 43(ఎ)లను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. రూల్స్ 72, 172, 174లను ఉల్లంఘిస్తుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై 200 మిలియన్ల కార్మికులు ఇప్పటికే వీధుల్లోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని హత్య చేస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని అన్నారు. "యు ద పీపుల్" అని రాజ్యాంగం చెబుతున్నదని, కానీ ప్రస్తుత మోడీ సర్కార్ ప్రజలను ఊపిరాడకుండా చేస్తున్నదని విమర్శించారు.

రాజ్యసభ ఒక రోజు పొడిగింపు...ప్రతిపక్షాలు ఆందోళన

రాజ్యసభను ఒక రోజు పొడిగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణంలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. తమకు సంప్రదించకుండా ఎలా పెంచుతారని ప్రతిపక్ష నేతలు నిలదీశారు. బీఏసీలో చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం దారుణమని విమర్శించారు. నోటిఫికేషన్, ముందస్తు సమాచారం లేకుండా రాజ్యసభ వాయిదా వేశారని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. ఎజెండాలో ఏం పొందుపరుస్తున్నారనే విషయం కూడా చెప్పట్లేదని, వ్యవస్థలను నాశనం చేస్తున్నట్లే పార్లమెంట్‌ను చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా సభ జరుగుతున్నా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం అకస్మాత్తుగా కొత్త బిల్లులను సభ ముందకు తెచ్చిందని మండిపడ్డారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, కాంగ్రెస్ ఉపనేత ఆనంద్ శర్మ, ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్, సీపీఐ(ఎం) నేత టికె రంగరాజన్, సీపీఐ నేత డి.రాజా, డీఎంకె నేతలు కనిమొళి, తిరుచ్చి శివ, టీడీపీ ఎంపీ సీఎం రమేష్, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, బీఎస్పీ నేత సతీష్ చంద్ర మిశ్రా, ఆర్జేడి నేత మనోజ్ ఝా తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

సిటిజన్ షిప్ బిల్లు ఆమోదం

లోక్‌సభలో వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ "పాకిస్థాన్, ఇతర పొరుగు దేశాల్లో మైనార్టీలు తీవ్ర హింసను ఎదుర్కొంటున్నారు. వారంతా ఆశ్రయం కోసం భారత్ వైపు చూస్తున్నారు. అలాంటి వారి కోసం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. అయితే ఇటీవలి కాలంలో ఇది వివాదాలకు దారితీసింది. దీనిపై అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లు కేవలం అసోం రాష్ట్ర కోసం కాదు. పొరుగు దేశాల నుంచి భారత్‌కు వచ్చే శరణార్థుల అందరి కోసం. పశ్చిమ సరిహద్దుల నుంచి కూడా చాలా మంది శరణార్థులు రాజస్థాన్, పంజాబ్, డిల్లీ లాంటి రాష్ట్రాలకు వస్తున్నారు. వారందరి కోసమే ఈ బిల్లు. అస్సాం ప్రజల హక్కులను ప్రభుత్వం ఎల్లప్పుడూ కాపాడుతుంది" అని తెలిపారు. అయితే ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సవరణ వల్ల అసోంలో పెద్ద ఎత్తున అల్లర్లు జరుగుతాయని, దీన్ని సెలెక్టు కమిటీకి పంపించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. అయితే ఇందుకు స్పీకర్ సుమిత్రా మహజన్ నిరాకరించారు.

దీంతో ప్రభుత్వం తీరును నిరసనగా కాంగ్రెస్ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ మాట్లాడుతూ బిల్లు ఆమోదం పొందితే అసోం సహ ఈశాన్య రాష్ట్రాలు భగ్గుమంటాయని హెచ్చరించారు. ఢిల్లీలో ఉన్నవాళ్లకు ఈ బిల్లు ప్రభావం గురించి తెలియట్లేదని ఎద్దేవా చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: ఎండి సలీం

సీపీఐ(ఎం) ఎంపీ ఎండి సలీం మాట్లాడుతూ పౌరసత్వ సవరణ బిల్లు భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఆరు ముస్లిం దేశాల్లో నుంచి ఇండియాలోకి వచ్చిన హిందువులకు మాత్రమే పౌరసత్వం ఇవ్వాలని బీజేపీ ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. మతం, కులం, వర్ణం ప్రకారం ఒక పౌరుడికి పౌరసత్వం ఇవ్వడం భారత రాజ్యాంగానికి విఘాతం కలిగించడమేనని ఆయన నొక్కి చెప్పారు. ఈ బిల్లు సవరణ చేపట్టడం వల్ల లౌకికవాదానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు. దేశాన్ని లౌకికతత్వానికి చిరునామాగా నిలపాలని రాజ్యాంగ రూపకర్తలు ప్రయత్నించారని గుర్తు చేశారు. మోడీ సర్కారు మాత్రం భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఎన్ఆర్‌సీ సవరణ చేయడంతో అసోం మరో ఇజ్రాయిల్‌గా మారే ప్రమాదం ఉన్నదని కరత్ హెచ్చరించారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 పౌరసత్వానికి సంబంధించిన విషయాలు పూర్తిగా తెలియజేస్తుందని చెప్పారు. అందులో పేర్కొన్న ప్రతి అంశం దేశంలో లౌకికవాదాన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నమని వివరించారు. అసోంలో విభిన్న జాతులు సంఘటితంగా జీవిస్తున్నాయని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌కు వలస వచ్చేందుకు ఈ చట్ట సవరణ పెద్ద ఎత్తున ఉపయోగపడే ప్రమాదం ఉందన్నారు. దీంతో అస్సాంలో మత విభజన జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బీజేడీ ఎంపీ భర్తహరి మెహతాబ్, ఆర్జేడీ ఎంపీ జయప్రకాశ్ యాదవ్, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసి తదితరులు మాట్లాడారు.

రాఫెల్ కంటే అమరావతి స్కామ్ పెద్దది

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని టిడిపి, వైసిపి ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాఫెల్ కంటే అమరావతి స్కామ్ పెద్దదని అన్నారు. అవినీతి కార్యకలాపాల కోసమే చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేస్తున్నాడని రాజ్యసభ సభ్యుడు విజసాయిరెడ్డి అన్నారు. ఏపిలో పుట్టిన ప్రతి బిడ్డపై అప్పుల భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు "చంద్రబాబు ఎంపరర్ ఆఫ్ కరప్షన్" అనే పుస్తకాన్ని వైసిపి ఎంపిలు, మాజీ ఎంపిలు, సీనియర్ నేతలు విడుదల చేశారు. కాదేదీ అవినీతికి అనర్హమన్నట్టుగా చంద్రబాబు దోపిడీ పాలన సాగుతోందని మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు నిజ స్వరూపం చెప్పడానికే ఈ పుస్తకమని తెచ్చామన్నారు. చంద్రబాబు, అతని అనుచరులు అమరావతి నుంచి పోలవరం నిర్మాణం వరకు రూ.ఆరు లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరుగుతోందని కాగ్ స్పష్టం చేసిందని వైసిపి సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. 600 హామీలిచ్చిన టిడిపి ఒక్కటీ కూడా అమలు చేయలేదని రాజ్యసభ సభ్యుడు వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అవినీతి పాలనపై సాక్షాత్తూ ఇద్దరు చీఫ్ సెక్రటరీలు బహిరంగంగా విమర్శలు చేశారని గుర్తు చేశారు.

సమ్మెకు సీపీఐ(ఎం) ఎంపీల సంఘీభావం



12 డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న కార్మిక సంఘాల జాతీయ సమ్మెకు సంఘీభావం తెలుపుతూ పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) ఎంపీలు ఆందోళన చేపట్టారు. మంగళవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం(గేట్ నెంబర్ 1) వద్ద సీపీఐ(ఎం) ఎంపీలు ఎండి సలీం, పి.కరుణాకరన్, ఎలమరం కరీం, ఎ.సంపత్, కె.సోం ప్రసాద్, శ్రీమతి టీచర్, జర్నాదాస్ బైద్య, జితిన్ చౌదరి, కెకె రాగేష్, పికె బిజూ, ఎండి బద్రుద్దోజాఖాన్, శంకర్ ప్రసాద్ దత్త తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. "ఆర్థిక రంగ ప్రయివేటీకరణ ఆపాలి. ధరల పెరుగుదల నియంత్రించాలి. కార్మిక వ్యతిరేక చట్ట సవరణలు తీసుకురావద్దు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి. అందరికీ ప్రజా పంపిణీ వ్యవస్థ విస్తరించాలి. కాంట్రాక్టీకరణను ఆపాలి. రూ.18 వేలకు తక్కువ లేకుండా కనీస వేతనం ఇవ్వాలి. అందరికి పెన్షన్ కల్పించాలి. సామాజిక భద్రత కల్పించాలి" అంటూ ప్లకార్డులు పట్టుకొని పెద్ద పెట్టున నినాదాలు హోరెత్తించారు. సీపీఐ(ఎం) ఎంపీలు చేస్తోన్న ఆందోళనకు ఎస్పీ నేత ములయం సింగ్ యాదవ్ మద్దతు తెలిపారు. సిటిజన్ షిప్ బిల్లును వ్యతిరేకిస్తూ టీఎంసీ ఎంపీలు ఆందోళన చేశారు.



అరణ్య స్పర్శ...

అడవిని నేనేమీ అధ్యయనం చేయను. అడవి గురించి శాస్త్రీయంగా తెలియదు. నేనిష్టపడే వాటి గురించి పరిజ్ఞానం ఉండాలని అనుకోను. ఆ మాటకొస్తే నాకు ఇంట్లో మొక్కలెలా పెంచాలో కూడా సరిగ్గా తెలియదు. బహుశా చిన్నప్పుడే జిడ్డు కృష్ణమూర్తి ప్రభావంలో పడటం కావొచ్చు. మరీ లోతైన జ్ఞానం అనుభూతిని కప్పేస్తుందనే అభిప్రాయంతో ఉండేవాడిని. మనుషుల పట్ల కూడా అలాగే ఉంటాను. "అడవిని చూడాలంటే ఇదే సరైన సమయం. ఏదో కార్లేసుకొని రహదార్ల మీద చెట్లని చూస్తూ తిరగటం కాదు. కాలి నడకన మూలమూలకూ వెళ్ళి, ఎక్కడ పడుకుంటామో తెలియనంత అజ్ఞాత ప్రాంతాలకు వెళ్ళే సాహసం చేద్దాం. వస్తారా?" అని అడిగారు శ్యాం సుందర్ గారు. మంచుకొండలతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేసిన అనుభవం ఉన్నవారు ఆయన. అడవితో సావాసమన్నా, అడవిలో సాహసమన్నా ఇష్టపడే వారు. అందుకే ఆయన తన గిరిజన మిత్రులతో కలిసి మారేడిమిల్లిలో మంచి కాటేజీ కూడా నిర్మించారు. వెంటనే సై అన్నాను. ఇది ఆయన నిర్వహిస్తున్న మొదటి ట్రెక్కింగ్. ఈ ట్రిప్ లోనే "బైసికిల్ బర్డ్స్" జయతి, లోహితాక్షన్ దంపతులు కూడా జాయిన్ అవుతున్నట్టు చెప్పారు.

మారేడిమిల్లి – రంపచోడవరం మెయిన్ రోడ్డు మీదనే రెండెకరాల విస్తీర్ణంలో కొండ మొదట్లో చెట్ల మధ్య శ్యాం గారు నిర్మించిన ఆ వెదురు కుటీరం కళాత్మకంగా, కవితాత్మకంగా ఉంది. నిజానికి ఇది ఆయన ప్రణాళికకు అనుగుణంగా పూర్తి కాలేదు. కర్రల మీద నుండి పైకెక్కితే ఒక హాలు, రెండు బెడ్రూములతో ప్రస్తుతానికి ఒక పదిమంది ఉండే విధంగా తయారు చేశారు. కొండకు ఏటవాలుగా కట్టినందువల్ల రూముల్లో జారుతున్న ఫీలింగ్ కలిగింది. అంతా వెదురు సామాగ్రి. కింద ప్రత్యేకంగా కట్టిన వాష్ రూమ్ లో తప్ప ఎక్కడా మరో ఇనుము, ప్లాస్టిక్ వినియోగం లేదు. అత్యంత సహజ సిద్ధ వాతావరణంలో ఆ వెదురు కుటీరం కొండకు కాపలా కాస్తున్న సైనికుడిలా దర్జాగా ఉంది. శ్యాం గారి అభిరుచికి ఫిదా అవ్వకుండా ఉండలేం. ఆ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య ఒక ఎండిపోయిన చెట్టు కూడా ఉంది. మిగతా పచ్చని చెట్లన్నీ కలిసి ఆ చెట్టుకి రక్షణనిస్తూన్నట్టుగా.

భోజనం అనంతరం ఒక ఆటోలో రంపచోడవరం బయలు దేరాం. మధ్యదారిలో గోదావరి బేసిన్లోని భూపతిపాలెం మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ డ్యాం చూశాం. చాలా అందంగా ఉంది. దీన్నే సీతపల్లివాగు అంటారు. నిండైన నీటి మధ్యలో ఎండిన చెట్లు ఓ వైవిధ్య సుందర దశ్యం. రంపచోడవరం నుండి కొండ మీదకు మా ట్రెక్కింగ్ మొదలైంది. మా గైడ్‌గా వచ్చిన బాపిరాజు అనే 17 ఏండ్ల కొండకాపులకి చెందిన అడవి బిడ్డ మేం ఎంత దూరం పైకి ఎక్కినా కూడా "ఇంకెంతండీ! ఒక కిలోమీటరే, అర కిలోమీటరే" అంటూండే వాడు. ఒకసారైతే "ఇంకో అర కిలోమీటరే" అన్న తరువాత కూడా కొద్దిసేపాగి అడిగితే "ఇంకెంతండీ ఇంకో కిలోమీటరే" అనేవాడు. బహుశా ఈ ఆదివాసులకు దూరం అనేది అసలు సమస్య కాదేమో అనిపించింది. దూరాలు, భారాలు మనలాగా మోటారు బళ్ళకి అలవాటు పడ్డ వాళ్ళకే కానీ తమ జీవనంలో రాయీ రప్పా, డొండా వంక, చెట్టూ చేమల్ని భాగం చేసుకున్న గిరిపుత్రులకు కాదేమో! కొన్నిసార్లు కొండ ఎక్కటం కష్టంగా అనిపించింది. "మీరు ఫిట్‌గా ఉంటేనే ఈ ట్రెక్కింగ్ పెట్టుకోండి" అని శ్యాం గారు ఎందుకన్నారో అర్ధమైంది. మాతో లైట్ వెయిట్ మొబైల్ టెంట్స్, నూనె, పప్పు, ఉప్పు, బియ్యంతో కూడిన వంట పదార్థాలు, టెట్రా పాలపాకెట్లు ఉన్నాయి. అంత బరువును బాపిరాజు సులువుగా మోసేస్తున్నాడు.


దారిలో ప్రకృతి అనూహ్యమైన మలుపులు తిరుగుతున్నది. కాలుష్యానికి దూరంగా నీరు, గాలి, చెట్టూ, రాయి... అన్నీ ఒక్కో చోట ఒక్కో రకంగా ఓ గొప్ప సౌందర్యంతో తళుక్కుమన్నాయి. అడవిలోని నిశ్శబ్దంలో కూడా ఒక అద్భుతమైన శ్రావ్యత ఉంది. అలసటగా అనిపిస్తున్నప్పటికీ ఓ తాదాత్మ్యంతో ముందుకెళుతున్నాం. ఒక్కోసారి మనిషంత ఎత్తు




రాళ్ళని ఒకరికొకరం చేతులు పట్టుకొని పైకెక్కాం. సగం దూరం వరకు కొండ పైనుండి పారుతున్న జలధార సవ్వడి వింటూ దాని పక్కనే ట్రెక్కింగ్ సాగించాం. కొండల పైనుండి ఓ అజ్ఞాత ప్రాంతం నుండి ఉబికి వస్తూ జరజరా పాకుతూ కిందకి జారిపోతున్న ఈ జలధార పక్కనుండే మేం కొండ పైకి ఎక్కాం. నీరు కిందకు జారుతుంటే మేం కొండ పైకి ప్రవహించాం. అంత చలిలోనూ మాకు చెమట్లు పట్టాయి. మధ్యలో కొంత మైదానంగా ఉన్న చోట వరి, పసుపు పంటలు కనిపించాయి. అదో మనోహర దృశ్యం. మధ్యలో చింత చెట్ల మీదకి రాళ్ళేస్తూ చుట్టూ కొండలు, పచ్చటి పొలాలు, సన్నటి కాలిబాటలు, పొలం గట్ల మీద నడుస్తూ, మళ్ళీ కొండెక్కుతూ అలా ఏకధాటిగా సుమారు మూడు గంటల తరువాత "పెదకొండ" అనే కొండరెడ్ల గ్రామానికి చేరుకున్నాం.


చుట్టురా ఆకుపచ్చని కొండల మధ్య ఓ ఇరవై ఎనిమిదిళ్ళతో గువ్వలా ఒదిగున్న గిరిజన గ్రామం పెదకొండ. ప్రతి ఇంటికీ వెదురు కర్రలతో ఒక దడి ఉంది. ఆ దడి అలా ఒక ఇంటి నుండి మరో ఇంటికీ కొనసాగి అదో గేటెడ్ కమ్యూనిటీలా ఉంది. ఒక్కో వైపు ఒక్కో ఓపెనింగ్ ఉంది. ఆ గ్రామంలోకి అడుగు పెడుతుండగానే మొదట్లోనే ఒక మేకల దొడ్డి. గ్రామంలోకి ప్రవేశించాక మా మీద గ్రామస్థులు ఏదో ఒక చూపు అలా విసిరి వెళ్ళిపోవటం, తమ పనులు తాము చేసుకుపోవటమో తప్ప మమ్మల్ని ఎగాదిగా చూడటం కానీ, ఏవో ప్రశ్నలు వేయటం కానీ చేయలేదు. నాగరీక సమాజం నుండి భౌతికంగా అంతెత్తు కొండల మధ్య జీవిస్తున్న వారి ప్రవర్తనకు ముచ్చటేసింది. దాదాపు ప్రతి ఇంటికి తాటాకుల సదుపాయాన్ని వాడుకున్నారు. భూమిలో నిలువుగా పాతిన కర్రలే వాళ్ళకి గిన్నెల స్టాండు. సహజ సిద్ధమైన పెద్ద పెద్ద బండలతో, రుబ్బురోళ్ళు, చట్నీలు నూరుకునే రాయి... అక్కడ సెల్ ఫోన్ సిగ్నల్ రాదు. కానీ డిటీహెచ్ యాంటెన్నాలు మాత్రం ఇళ్ళ పైన కనిపించాయి. కొండ కిందకు కచ్చా రోడ్డు కూడా వుంది. దాని మీదుగా మోటార్ సైకిళ్ళు కూడా ఈ గ్రామంలోకి వస్తున్నాయి. ఈ గిరిపుత్రులు నాగరీక సమాజానికి దూరంగా వున్నారే కానీ నాగరికతకు కాదు. ఈ చిన్న గ్రామంలో కూడా రక్షిత మంచినీటి స్టోరేజి ట్యాంకుంది. అటవీ ఉత్పత్తుల మీద, వ్యవసాయం మీద ఆధారపడతారు వీళ్ళు పశుపోషణ కూడా చేస్తారు. ఆవులున్నాయి. కానీ పాలు తీయరు. ఎందుకు తీయరంటే పాలు దూడ కోసం వదిలేస్తారు. మరి ఆవులెందుకు పెంచటమంటే వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దులకు జత కోసం. అలాగని వాళ్ళేం ఆవుల పట్ల భక్తి భావంతో ఉంటారని అనుకోవద్దు. బీఫ్ వారి ప్రధాన మాంసాహారం. వేటకి వెళుతుంటారు. చిన్న చిన్న జంతువులని కొట్టుకొస్తుంటారు. జీలుగు కల్లు బాగా తాగుతారు.

అరణ్యం! నా దృష్టిలో ఒక గొప్ప తాత్విక పదం. కిక్కిరిసి పోవటం, చిక్కగ ఉండటం, సాంద్రవంతంగా ఉండటం, దట్టంగా ఉండటం, వైవిధ్యవంతంగా ఉండటం, నిశ్శబ్దంగా ఉండటం, మార్మికంగా ఉండటం, భిన్న జీవజాతులకు సహజావాసంగా ఉండటం, సృష్టి, స్థితి, లయలతో శ్రావ్యంగా ఉండటం, ఇంకా నేను చూడలేనన్ని రకాలుగా, వర్ణించలేని విధాలుగా ఉండటం ఒక్క అడవికే సాధ్యం. అందుకే అడవంటే నాకో ఆరాధన! పుట్టినప్పటి నుండి నగరాల్లోనే బతికిన వాడిని. కనీసం గ్రామీణ జీవితం కూడా పెద్దగా అనుభవంగా లేని వాడిని. కానీ చెట్టంటే ఇష్టం. ఎక్కడ పెద్ద చెట్టు కనబడ్డా ఒక హీరోని చూసినట్టు చూసేవాడిని. అటువంటిది వేలాది మహావృక్షాలు, లక్షలాది చెట్లు, కోట్లాది మొక్కలతో వాగులు, జలపాతాలు, నదులు వంటి ప్రాకృతిక జలాశయాలు. ఆది మానవుడి గుహలతో, అనంతానంత జీవ వైవిధ్యంతో మనిషి ఇప్పటికీ నాశనం చేయకుండా లేదా చేయలేక వదిలేసిన అరణ్యం ఈ సృష్టిలో నాకు అత్యంత సమ్మోహనం.



పెదకొండ గూడేనికి వీడుకోలు పలికి, ఆదివాసీలకు ధన్యవాదాలు తెలిపి రంపచోడవరం బైల్దేరాం. దారిలో కనబడ్డ చిన్న జలపాతాలు, పెద్ద పెద్ద రాళ్ళు, తోటలు, గోశాల చూస్తూ, చేతికందిన కాయలు తెంపుకుంటూ రంప చేరాం. అక్కడ రాజస్థానీ మిఠాయి దుకాణంలో సమోసాలు తిని, గుంటూరు నాయుడు బడ్డీ హోటల్లో టీ తాగి మారేడిమిల్లి చేరుకున్నాం. అక్కడ అమర్నాథ రెడ్డి తయారు చేసిన "బొంగులో చికెను", ఇతర పదార్థాలు తిని "టైగ్రిస్" జలపాతం దగ్గరకు బయలు దేరాం. మధ్య మధ్యలో అనేక చోట్ల ఆగి వ్యూ పాయింట్స్ చూసుకుంటూ వచ్చాం. చింతూరు, మోతుగూడెం మీదుగా పుల్లూరు చేరుకున్నాం. పుల్లూరు పక్కన ఎత్తయిన కొండ దారిలో కొంచెం కిందకి దిగితే జలపాతం ఉంది. ముందుగానే ఎక్కడ దిగాలో స్పాట్ సెలెక్ట్ చేశాం. జలపాతానికి కొంత పైన వాగు పక్కన చూసుకున్నాం. రెండు కొండల మధ్య లోయలో నిండుగా పారుతున్న వాగు మరో నీటి చెలమ నడుమ గులకరాళ్ళ సంపద పక్కన కాస్తంత మట్టి నేల చూసుకున్నాం. పూర్తిగా కిందకు దిగాల్సిన అవసరం లేకుండానే ఎంచుకున్నాం. ఎండిన కొమ్మలు, దుంగలు బోలెడున్నాయి. క్యాంప్ ఫైర్ వేసుకోగానే ఆ ప్రాంతం మీద మాకేదో పురాతన పరిచయం వున్నట్లు అనిపించింది.





వ్యాసకర్త

తెల్లవారగానే జలపాత స్పర్శ మరో మహత్తర అనుభవం. అక్కడివరకు ఒక వాగుగా మంద్రంగా ప్రవహించిన నీరు ఒక్క సారిగా లోతైన పల్లం రాగానే ఒక జలపాతంగా మారటం ఓ విస్మయకర సౌందర్య ప్రవాహం. పరీక్షించి చూడాలే కానీ ప్రకృతి నీరు ఓ బాహుబలి. దూకే అవకాశం దొరకాలే కానీ జలం తన బలం ఎంతటిదో చూపగలదు. జలపాత పరిష్వంగం నుండి బైటపడి రోడ్డు మీదకి వచ్చాం. వేటకి వెళుతున్న గిరిజనుల దగ్గర బాణం విల్లంబులు తీసుకొని వేణు కాసేపు వేటగాడిలా ఫోజిచ్చి తన వేట మోజు తీర్చుకున్నాడు. ఈ లోపు శ్యాంగారు మోతుగూడెం వెళ్ళి ఎలాగో ఓ ఆటో తీసుకొచ్చి మమ్మల్ని బైలుదేర తీశారు. మళ్ళీ మోతుకూరు వచ్చి బస్సెక్కి భద్రాచలం చేరాం.

ముందే చెప్పినట్లు శ్యాంగారు గొప్ప ప్రకృతి ప్రేమికుడే కాదు, నలుగురికీ ఆ ప్రేమని పంచాలన్న ఆరాటమున్నవాడు. ఆయన ఇలాంటి కార్యక్రమాల్ని నిర్వహించగల సమర్థుడని భావిస్తున్నాను. జయతి, లోహితాక్షన్ ఇద్దరూ విలువైన వ్యక్తులు. అల్పమైన భౌతిక విషయాల్ని వదిలేసిన వాళ్ళు. వాళ్ళిద్దరూ విస్తృతంగా అడవి ప్రాంతం గుండా సైకిళ్ళ మీద ప్రయాణించిన వాళ్ళు. అందుకే వాళ్ళిద్దరికీ "బైసికిల్ బర్డ్స్" అనే బిరుదును ప్రదానం చేశాను. ఒక స్థిరమైన నివాసం లేక పోవటంలోని సంతోషమేమిటో వాళ్ళని చూస్తే అర్థమవుతుంది. మూడో రోజు రాత్రి తిరిగి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)లో రైలెక్కి మరుసటి రోజు తెల్లవారుజాము హైదరాబాదు చేరుకొని, మళ్ళీ ఏమెరగనట్లు తొమ్మిది ముప్పావుకల్లా ఆఫీసు అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేయటం ద్వారా తప్పిపోయిన గొర్రెపిల్ల తిరిగి మందలో చేరినట్లు పాత జీవితాన్ని పునరుద్ధరించుకున్నాను.

- అరణ్య కృష్ణ

పచ్చదనాల భూతల స్వర్గం

భద్ర... ప్రధానంగా ఒక వన్య ప్రాణుల సంరక్షణాలయం. దీనినే భద్ర వైల్డ్ లైఫ్ శాంక్చువరి అని కూడా అంటారు. ఇది చిక్కమగళూరు జిల్లాలో ఉంది. పడమటి కనుమలలో ఉన్న ఈ అటవీ ప్రదేశం పులుల సంరక్షణాలయంగా కూడా నిర్వహిస్తున్నారు. ఈ శాంక్చువరీని 1958లో స్థాపించారు. అప్పటినుండి ఎంతో అభివృద్ధి సాధించి నేటికి అది అధిక విస్తీర్ణంతో భద్ర వైల్డ్ లైఫ్ శాంక్చువరీగా పేరొందింది. దీని విస్తీర్ణం సుమారు 492 చ.కి.మీ.లు. చిక్కమగళూరు పట్టణానికి ఇది 38 కి.మీ. బెంగుళూరు నగరానికి 282 కి. మీ. దూరంలో ఉంది.



ఈ అటవీ ప్రాంతంలో వివిధ జాతుల మొక్కలు, జంతువులు కూడా ఉన్నాయి. మొక్కల జాతులు సుమారు 120 రకాల వరకు ఉంటాయి. వాటిలో టేకు, రోజ్ వుడ్, బ్యాంబూ, జాక్ ఫ్రూట్ అంటే పనస వంటివి ప్రధానంగా కనపడతాయి. జింకలు, సాంబర్, మచ్చల జింకలు, చిరుతలు, లేళ్ళు, దుప్పులు, మలబార్ ఉడుతలు, ఏనుగులు కూడా ఈ అటవీ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటాయి. మొక్కలు తిని జీవించే జంతువులే కాక, మాంసాహారం తినే పులులు, అడవి కుక్కలు వంటివి కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయి. నక్కలు, ఎలుగుబంట్లు, ముంగీసలు, చిరుత పిల్లులు కూడా ఉన్నాయి. భద్ర ప్రాంతం ప్రాజెక్ట్ టైగర్‌లో ఒక భాగంగా 1998 లో ప్రకటించారు. 250 పక్షి జాతులతో పక్షుల ప్రియులకు స్వర్గంగా ఉంటుంది. ఎన్నో చిలకలు, పావురాలు, వడ్రంగి పిట్టలు, మైనాలు, వివిధ రకాల అటవీ పక్షులు కనపడతాయి. మీరు సరీసృపాలు ఇష్టపడేవారైతే, ఎన్నో రకాల పాములు, మొసళ్ళు, నాగుపాములు, వైపర్లు, సాధారణ పాములు, ర్యాట్ స్నేక్స్, పిట్ వైపర్లు, వంటివి కూడా చూడవచ్చు. రంగు రంగుల సీతాకోక చిలుకలు కూడా మీకు ఆహ్లాదాన్నిస్తాయి.

అటవీ శాఖ పర్యాటకులకు ట్రెక్కింగ్, క్యాంపింగ్, రాక్ క్లైంబింగ్, బర్డ్ వాచింగ్, బోటింగ్ సౌకర్యాలు కలిపిస్తుంది. భద్ర ఎన్నో సహజ అందాలు కూడా కలిగి ఉండటంతో మీకు జీవితంలో మరువలేని అనుభవాలు కలిగిస్తుంది. భద్ర నది ఉప శాఖలు భద్ర గుండా ప్రవహిస్తాయి. చుట్టూ హెబ్బెగిరి, గంగే గిరి, మల్లయన గిరి, బాబా బూదాన్ గిరి వంటి కొండలు రమణీయంగా కనపడతాయి. పడమటి కనుమలలోని కుద్రేముఖ్ వద్ద మూలస్థానంగా గల భద్రానది మూలాలను తప్పక చూడాల్సిందే. ఈ నది దక్కన్ పీఠభూమి గుండా ప్రవహించి దాని ఉపనదులతో సోమవాయిని తడబేహళ్ళ, హెబ్బె, ఒడిరాయన హళ్ళ వద్ద కలుస్తుంది. లక్కవల్లి సమీపంలో భద్ర నదిపై డ్యామ్ కట్టారు. ఇక్కడనుండి అది భద్రావతి మీదుగా ప్రవహించి కూడ్లి వద్ద తుంగ నదితో కలుస్తుంది. ఇది శివమొగ్గకు దగ్గరగా ఉంది.

హాయిగా వెళ్లి రండి..

విహారయాత్రకు వెళ్తుంటే లగేజీ సర్దుకునే విషయంలో కొన్ని మెలకువలు పాటిస్తే మంచిది. దానివల్ల తెలియని ప్రాంతానికి వెళ్లినా కూడా ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.



- కుటుంబ సభ్యులందరూ కలిసి వెళ్తుంటే అందరి దుస్తులూ ఒకే బ్యాగులో కాకుండా రెండు మూడు చిన్న బ్యాగుల్లో సర్దాలి. దీనివల్ల మోయడం తేలికవుతుంది. అలాగే సర్దేటప్పుడే మీరొక్కరే కాకుండా ఎక్కడెక్కడ ఏ వస్తువులున్నాయో అందరికీ చెబితే ఎలాంటి గందరగోళం ఉండదు.
- డబ్బు విషయంలోనూ జాగ్రత్త అవసరమే. డబ్బంతా ఒకే దగ్గర సర్దకుండా రెండు మూడు చోట్ల పెట్టి ఉంచండి. ఒక బ్యాగు పోయినా ఇంకో దగ్గరున్న డబ్బు మనల్ని కాపాడుతుంది. అలాగే వేరే ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు పూర్తిగా క్రెడిట్, డెబిట్ కార్డుల మీద ఆధారపడకపోవడమే మేలు. అదనంగా కొంచెం నగదు కూడా పెట్టుకోవడం మంచిది.
- ఎండాకాలంలో చెమట గురించి చెప్పక్కర్లేదు. అందుకే టిష్యూలూ, ఫేస్‌వాష్ తప్పకుండా వెంట ఉంచుకోవాలి. ఎక్కడైనా సులువుగా ముఖం, చేతులూ కడుక్కునే అవకాశం ఉంటుంది. అలాగే అక్కడున్న వాతావరణం వల్ల చిన్న చిన్న అనారోగ్య సమస్యలు రావొచ్చు. అందుకే తలనొప్పి, జలుబూ, జ్వరం... లాంటి వాటికి సంబంధించిన మాత్రలు దగ్గరుంచుకోవాలి. సమస్య ఎదురైనప్పుడు కంగారు లేకుండా ఉంటుంది.
- అన్ని ప్రాంతాల్లో భోజనం దొరుకుతుందన్న నమ్మకం లేదు. కొన్నిసార్లు దొరికినా కూడా అక్కడి ఆహారం మనం తినలేకపోవచ్చు. అందుకే ఇంటినుంచే ఏవైనా చిరుతిళ్లు తీసుకెళ్తే అవసరానికి ఉపయోగపడతాయి. మనకూ నిశ్చింతగా ఏ కంగారూ లేకుండా ఉంటుంది.
- ఎంత తక్కువ లగేజీ ఉంటే అంత హాయిగా ప్రయాణం చేయొచ్చు. వీలైనంత వరకు అనవసరమైన వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో వెంట తీసుకెళ్లకూడదు. దుస్తులూ, ఆభరణాలూ, మేకప్ వస్తువులు... ఇలా ఏవైనా సరే లెక్కలేసుకునే సర్దుకోండి.


కోట నగరం ఖమ్మం

హైదరాబాద్‌కు తూర్పున 273 కిలోమీటర్ల దూరంలో వున్న ఖమ్మం సందర్శించే వారికి ఓ పర్యాటక స్థలం. స్థానిక గాథల ప్రకారం స్థంభ శిఖరి లేదా స్తంభాద్రి అని పిలువబడిన నరసిమ్హాద్రి గుడి పేరిట ఈ ఊరి పేరు ఏర్పడింది. విష్ణు మూర్తి అవతారమైన నరసింహ స్వామి దేవాలయం ఇది. సుమారు 1.6 మిలియన్ ఏండ్లనాటి త్రేతా యుగం నుంచి ఈ నగరం ఉండేదని రుజువైంది. ఈ గుడి ఒక కొండ శిఖరం పై ఉండగా కొండ కింద నిలువుగా వున్న రాయి స్థంభం లాగా పని చేసేది. ఈ స్థంభం 'ఖంబా' అనే పదం నుంచి ఈ ఊరి పేరు పుట్టింది. ఖమ్మం చుట్టు పక్కల ప్రాంతాన్ని 'కంబం మెట్టు' అనేవారు, అదే క్రమేణా ఖమ్మం మెట్టు లేదా ఖమ్మంగా మారిపోయింది.

కృష్ణా నదికి ఉపనది అయిన మునేరు ఒడ్డున అందమైన ఖమ్మం నగరం వుంది. చరిత్రలో ఖమ్మం ఒక ప్రముఖ స్థానాన్ని కలిగి వుంది. ఇక్కడి సుప్రసిద్ధ ఖమ్మం కోట కేవలం ఈ జిల్లాకే గాక రాష్ట్రం మొత్తానికి ముఖ్యమైనది. ఒక కొండ పైన ఠీవిగా వుండే ఈ కోట అటు సాహసానికి, ఇటు అద్భుతమైన నిర్మాణ శైలుల మిశ్రమానికి ప్రతీక. ఈ ప్రాంతాన్ని వివిధ మతాలకు చెందిన వివిధ రాజవంశీకులు పరిపాలించినందు వల్ల ఈ మిశ్రమ శైలి ఏర్పడింది. ప్రాచీన కాలం నుంచి ముఖ్యంగా తాలూకాల హయాం నుంచీ ఖమ్మం వాణిజ్య, సామాజిక కార్యకలాపాల కేంద్రంగా వుండేది.

ఖమ్మంను పరిపాలించిన ఎంతో మంది రాజవంశీకులు ఈ నగర చరిత్ర, కళ, నిర్మాణ శైలుల మీద చెరగని ముద్ర వేశారు. ఖమ్మం మత సామరస్యానికి కూడా చక్కటి ఉదాహరణ. వివిధ మతాలకు చెందిన వారు తమ తమ మతాలను అవలంబిస్తూ వుండడం ఖమ్మంకు ప్రత్యేకత తీసుకు వచ్చింది. ఖమ్మం లోని ప్రధాన ఆకర్షణలు గుళ్ళూ,





మసీదులే. అందులోనూ పక్క పక్కనే ఉండేవి ఎక్కువ. ఖమ్మంతో పాటు దీని చుట్టుపక్కల ఆస్వాదించదగ్గ అనేక ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో ఖమ్మం కోట, జమలాపురం ఆలయం, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలు. ఈ ప్రాంతంలో పలైర్ సరస్సుతో పాటు పాపి కొండలు, వాయర్ సరస్సు ప్రధాన సందర్శనీయ స్థలాలు.

ఆహ్లాదకర వాతావరణం ఉండే శీతాకాలంలో ఖమ్మం సందర్శించడం ఉత్తమం. ఈ ప్రాంతం ఏడాది పొడవునా ఉష్ణమండల వాతావరణాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఉత్తర భారతదేశంతో పోలిస్తే ఇక్కడ చలి తక్కువగా ఉంటుంది. అందుకే అటునుండి వచ్చే వారు శీతాకాలం ఇక్కడికి వస్తుంటేరు. అయితే, వేసవిలో అధిక వేడి వల్ల ఆ సమయంలో ఖమ్మం సందర్శించడం సరైనది కాదు.



ఐపీఎల్ మన దగ్గరే!

- మార్చి 23న ఆరంభం
- ప్రకటించిన బీసీసీఐ

న్యూఢిల్లీ : ఎన్నికల ఏడాదిలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ఎక్కడికి తరలి వెళుతుందా అని ఆందోళన చెందిన అభిమానులకు బీసీసీఐ శుభవార్త. ఐపీఎల్ 12వ సీజన్ భారత్‌లోనే జరుగనున్నది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా ఐపీఎల్ విదేశాల్లో జరిగే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగింది. కానీ మంగళవారం న్యూఢిల్లీలో సమావేశమైన పాలకుల కమిటీ (సీఓఏ) ఐపీఎల్ వేదికపై ఓ నిర్ణయం తీసుకున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కీలక సంస్థలతో చర్చించిన పాలకుల కమిటీ.. ఈ ఏడాది ఐపీఎల్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయానికి వచ్చింది. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఐపీఎల్ విదేశాలకు తరలిపోయింది. 2009లో పూర్తిగా వెళ్లిపోగా, 2014లో తొలి దశ మ్యాచులు యు.ఏ.ఈలో జరిగాయి. దీంతో ఈ ఏడాది సైతం పూర్తిగా లేదా పాక్షికంగా ఐపీఎల్ విదేశాలకు తరలిపోయే అవకాశముందని అందరూ భావించారు. కానీ రాష్ట్ర, కేంద్ర విభాగాలతో సమన్వయం సాధించిన పాలకుల కమిటీ భారత్‌లో పూర్తి లీగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మంగళవారం బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) వెల్లడించింది.

ఒకటికి నాలుగు వేదికలు! : భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు దశల వారీగా నిర్వహిస్తారు. ఉత్తరాదిన, దక్షిణాదిన వేర్వేరు తేదీల్లో పోలింగ్ ఉంటుంది. అలాగే ఈశాన్యంలోనూ భిన్నమైన రోజుల్లో పోలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాల శాఖలతో సమన్వయంతో అక్కడి పోలింగ్ తేది, ఎన్నికల ర్యాలీలను బట్టి మ్యాచ్ వేదికను నిర్ణయించనున్నారు. ఐపీఎల్‌లోని ఎనిమిది ఫ్రాంచైజీలకు సొంత మైదానాలు ఉన్నాయి. ఈ సారి సీజన్‌కు ఎనిమిది వేదికలతో పాటు మరో 20 వేదికలనూ బోర్డు సిద్ధంగా ఉంచుకుంటోంది. ఉదాహరణకు హైదరాబాద్‌లో మ్యాచ్ జరగాల్సిన రోజు అక్కడ ఎన్నికల ర్యాలీ లేదా పోలింగ్ ఉంటే, వేదికను విశాఖకు మారుస్తారు. అదే విధంగా ముంబయి, నాగ్‌పూర్, పుణెలను సైతం ప్రత్యామ్నాయ మ్యాచ్ వేదికలుగా సిద్ధంగా ఉంచుతారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత, ప్రభుత్వ విభాగాలతో ఇతర వివరాలు పోల్చుకుని ఐపీఎల్ సీజన్ 12 పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు.

వరల్డ్‌కప్‌కు సమయం : ఎన్నికలతో పాటు వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ ఈ ఏడాది ఐపీఎల్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. జాతీయ జట్టు శిక్షణ శిబిరాల కోసం విదేశీ ఆటగాళ్లు మే తొలి వారంలోనే ఐపీఎల్‌కు దూరం కానున్నారు. లోధా కమిటీ సిఫారసుల ప్రకారం ఐపీఎల్‌కు, వరల్డ్‌కప్‌కు కనీసం 15 రోజుల విరామం అవసరం. 2019 వరల్డ్‌కప్ మే 30న ఆరంభం కానున్నది. దీంతో ఐపీఎల్ ఫైనల్స్ మే 12 లేదా 15న ఉండే వీలుంది. డిఫెండింగ్ చాంపియన్ సొంత మైదానంలో ఆరంభ, ముగింపు మ్యాచులను నిర్వహించటం ఐపీఎల్ ఆనవాయితీ. చెన్నై ఈ సారి తొలి, తుది మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉన్నది. కానీ చెన్నైలో ఎన్నికల పోలింగ్ తేది వెల్లడైన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ ఐపీఎల్ ఫైనల్ తేదిలలో చెన్నైలో పోలింగ్ ఉంటే వేదికను మరో చోటుకు మార్పు చేస్తారు.

సిరాజ్‌కు పిలుపు

- వన్డేల నుంచి బుమ్రాకు విశ్రాంతి
- టీ20 జట్టులోకి సిద్ధార్థ్ కౌల్

ముంబయి : హైదరాబాదీ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్ భారత వన్డే జట్టులోకి వచ్చాడు. చివరగా శ్రీలంకలో నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో (టీ20) ఆడిన సిరాజ్ మళ్లీ జాతీయ జట్టు తరఫున ఆడలేదు. భారత్-ఎ జట్టు తరఫున ఆకట్టుకునే ప్రదర్శన చేసిన సిరాజ్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో వన్డే సిరీస్‌లకు ఎంపికయ్యాడు. యార్కర్ల హీరో జస్‌ప్రీత్ బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి లభించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అత్యధికంగా 157.1 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన బుమ్రాపై పని భారం తగ్గించేందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. 2018లో ఓవరాల్‌గా 511.3 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన బుమ్రా అత్యధికంగా 78 వికెట్లు కూల్చాడు. ఫిబ్రవరి-మార్చిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే, టీ20 సిరీస్‌లకు బుమ్రా మరింత ఫిట్‌గా ఉండేందుకు సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది. మరో సీమర్ సిద్ధార్థ్ కౌల్ టీ20 జట్టులోకి ఎంపికయ్యాడు. ఆసీస్, కివీస్‌లతో మూడేసి మ్యాచుల టీ20 సిరీస్‌లో కౌల్ ఆడనున్నాడు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ జనవరి 12న సిడ్నీలో ఆరంభం కానుండగా, న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్ జనవరి 23న మొదలు కానున్నది.





కోహ్లిసేనకు బీసీసీఐ నజరానా

ముంబయి : 71 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ, ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయాన్ని సాధించిన కోహ్లిసేనకు బీసీసీఐ నగదు ప్రోత్సాహకం ప్రకటించింది. ఆడిలైడ్, మెల్‌బోర్న్ టెస్టుల్లో నెగ్గిన టీమ్ ఇండియా 2-1తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకున్నది. టెస్టు క్రికెట్‌లో భారత్ సాధించిన అరుదైన విజయాల్లో ఒకటిగా నిలిచిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి బోర్డు సరసమైన బహుమానమే అందించింది. తుది జట్టులో నిలిచిన ఆటగాడికి ప్రతి మ్యాచ్‌కు రూ. 15 లక్షలు, రిజర్వ్ ఆటగాళ్లకు రూ. 7.5 లక్షలు ప్రకటించింది. కోచ్‌లకు రూ. 25 లక్షలు సహా సహాయక సిబ్బందికి గౌరవ వేతనంలో రెట్టింపు మొత్తాన్ని నజరానాగా ప్రకటించింది. టెస్టు మ్యాచ్‌కు బీసీసీఐ మ్యాచ్ ఫీజు రూ. 15 లక్షలు. దీంతో అంతే మొత్తాన్ని నజరానాగా ప్రకటించారు. ఈ లెక్కన అన్ని టెస్టుల్లో తుది జట్టులో నిలిచిన కోహ్లి, రహానె, రిషబ్ పంత్, బుమ్రా, మహ్మద్ షమి, పుజారలు రూ. 60 లక్షల నగదు బహుమానం అందుకోనున్నారు.



ఉత్తమ బౌలింగ్ దళం

- కానీ బ్యాటింగ్‌లో బెస్ట్ కాదు!
- ఆసీస్ మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్

సిడ్నీ : 71 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియా గడ్డ టెస్టు సిరీస్ విజయాన్ని రుచి చూసిన టీమ్ ఇండియాపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఇంటా, బయటా కోహ్లిసేన ప్రశంసలు అందుకుంటోంది. దిగ్గజ ఆటగాళ్లకు సాధ్యం కాని ఆసీస్ గడ్డపై టెస్టు సిరీస్ విజయం కోహ్లిసేన సాధించటంతో, ఇదే భారత అత్యుత్తమ జట్టా? అడిగిన ప్రశ్నకు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను చూసిన భారత జట్లలో ప్రస్తుత జట్టు అత్యుత్తమ బౌలింగ్ దళం, అత్యుత్తమ ఫీల్డింగ్ జట్టు. కానీ ఇది ఉత్తమ బ్యాటింగ్ జట్టు కాదు. నేను ఇంతకంటే గొప్ప భారత బ్యాటింగ్ లైనప్‌లను చూశాను. భారత బౌలర్లు అద్భుతంగా రాణించారని నా భావన. ఆస్ట్రేలియన్లను బౌలర్లు పడగొట్టారు, కంగారూ బౌలర్ల కంటే మెరుగైన స్వింగ్ రాబట్టారు. భారత సీమ్ బౌలర్ల స్థితి గొప్పగా ఉంది. ఆతిథ్య జట్టు బౌలర్ల కంటే గొప్పగా బంతిని స్వింగ్ చేశారు. అదే సిరీస్ విజయాన్ని నిర్ణయించింది' అని ఇయాన్ చాపెల్ అభిప్రాయపడ్డాడు. నాలుగు మ్యాచుల టెస్టు సిరీస్‌లో బుమ్రా, షమి, ఇషాంత్‌లతో కూడిన పేస్ దళం ఆసీస్ శిబిరంలోని 70 వికెట్లలో 50 వికెట్లను కూలదోసింది. బుమ్రా, షమి, ఇషాంత్ త్రయం ఉమ్మడి సగటు 21.62. ఆసీస్ తరఫున కమిన్స్, స్టార్క్, హజెల్‌వుడ్‌ల సగటు 30కి పైనే. దీంతో మెరుగైన బౌలింగ్ దళమే భారత్‌ను గెలిపించదని చాపెల్ అన్నాడు.



నం.3 పుజార

- 21 స్థానాలు ఎగబాకిన పంత్
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లు

దుబాయ్ : బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 521 పరుగులు సహా మూడు శతకాలు బాదిన చతేశ్వర్ పుజార ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మరో స్థానం పైకి చేరాడు. భారత జట్టులో నం.3 పొజిషన్‌లో బ్యాటింగ్ చేసే పుజారకు ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ మూడోస్థానమే దక్కింది. 521 పరుగుల తన కెరీర్ అత్యధిక విదేశీ సిరీస్ స్కోరుతో పుజార ఆసీస్‌పై విజయంలో ముఖ్య భూమిక వహించాడు. సిడ్నీ టెస్టుకు నాల్గో స్థానంలో కొనసాగిన పుజార, సిడ్నీలో 193 పరుగులు సాధించాడు. దీంతో 881 పాయింట్లు సాధించి, వరల్డ్ నం.3 బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. 922 పాయింట్లతో కెప్టెన్ కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతుండగా, కివీస్ సారథి కేన్ విలియమ్సన్ రెండో స్థానంలో నిలిచాడు. నిషేధంలో ఉన్న ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాల్గో స్థానంలో, ఇంగ్లాండ్ నాయకుడు జో రూట్ ఐదో స్థానంలో ఉన్నారు. ఇక సిడ్నీలో అజేయంగా 159 పరుగులు బాదిన యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ 21 స్థానాలు ఎగబాకాడు. 673 పాయింట్లతో అత్యధిక రేటింగ్ సాధించిన భారత వికెట్ కీపర్‌గా ధోనిని (662)ని వెనక్కి నెట్టిన పంత్ 20వ స్థానంలో నిలిచాడు. బౌలర్ల జాబితాలో జడేజా ఐదో స్థానంలో నిలువగా, ఆల్‌రౌండర్ల జాబితాలో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

బీజేపీకి షాక్

న్యూఢిల్లీ : సీబీఐ వివాదంలో మోడీ సర్కార్‌కు షాక్ తగిలింది. అలోక వర్మను తాత్కాలిక సెలవుపై పంపటాన్ని తప్పుబడుతూ, తిరిగి ఆయన్ని సీబీఐ చీఫ్‌గా నియమించాలని అత్యున్నత నాయస్థానం తీర్పు చెప్పింది. సీబీఐ వర్సెస్ సీబీఐ కేసులో అలోక్‌వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ అంశంపై ప్రధాని, ప్రతిపక్షనేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత కమిటీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సుప్రీం పక్కన పెట్టింది. మోడీ సర్కార్ తనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అలోక్‌వర్మపై చర్యలు తీసుకోవడానికి ముందు కేంద్రం ఎంపికకమిటీని సంప్రదించి ఉండాల్సిందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సీబీఐ స్వయంప్రతిపత్తి గల సంస్థకాబట్టి, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అధికారముందని తీర్పులో సుప్రీం స్పష్టం చేసింది. సంస్థ కార్యకలాపాల్లో రాజకీయ జోక్యం తగదని సుతిమెత్తగా కేంద్ర ప్రభుత్వానికి చురకలు అంటించింది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ మంగళవారం సెలవులో ఉండటంతో, తీర్పును మరో న్యాయమూర్తి జస్టిస్ కౌల్ చదివి వినిపించారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ పదవీకాలం 2019, జనవరి 31తో ముగియనున్నది. సీబీఐ చీఫ్‌గా అలోక్‌వర్మకు, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాకు మధ్య వివాదాలు రోడ్డున పడటంతో వారిద్దర్నీ కేంద్రం సెలవుపై పంపింది. దీంతో అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మోడీ సర్కార్‌కు గుణపాఠం : కాంగ్రెస్

సీబీఐ వ్యవహారంలో సుప్రీం తీర్పు మోడీ సర్కార్‌కు ఒక గుణపాఠమని ప్రతిపక్షాలు స్పందించాయి. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ట్విట్టర్‌లో స్పందించారు. ఆయన పంపిన సందేశం ఇలా ఉంది..."ప్రధాని తీసుకున్న నిర్ణయం తప్పు అని...సుప్రీంకోర్టు ఆయన ఆదేశాల్ని పక్కకు పెట్టడం దేశ చరిత్రలో మొదటిసారి. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ, వాటి సమగ్రతను కోర్టు కాపాడిందనే విషయాన్ని మోడీ సర్కార్ గుర్తుంచుకోవాలి"అని అన్నారు.



మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు ఇదొక గుణపాఠం కావాలనీ, మీరు (ప్రధాని మోడీ) ఎంత ఎదురులేని వ్యక్తి అయినప్పటికీ చట్టం దానికి ముగింపు పలికిందనీ సూర్జేవాలా ప్రధానిని ఉద్దేశించి అన్నారు.



- **సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది : రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ మనోజ్ ఝా**
- **న్యాయస్థానం తీర్పు ప్రధాని మోడీపై ప్రత్యక్ష నేరారోపణ. మోడీ సర్కార్ దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, సంస్థలను దెబ్బతీసింది. రాఫెల్ ఒప్పందంపై విచారణను ఆపేందుకు సీబీఐ డైరెక్టర్‌ను రాత్రికిరాత్రి తప్పిస్తారా?**
- **ట్విట్టర్‌లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్**
- **సుప్రీంతీర్పు అలోక్ వర్మకు పాక్షిక విజయం : న్యాయవాది ప్రశాంత్ భూషణ్**
- **సీబీఐని రక్షించడమే ప్రభుత్వ లక్ష్యం. సుప్రీం ఆదేశాల్ని పాటిస్తాం : అరుణ్ జైట్లీ**

ప్రధానిగా మరొకరైతే రాజీనామా చేసేవారే

సీపీఐ(ఎం)

కేవలం రాజకీయ ప్రయోజనాల్ని ఆశించి దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ మోడీ సర్కార్ నాశనం చేస్తోంది. సుప్రీంకోర్టు తాజా తీర్పు అది నిజమని తేల్చింది. ప్రధాని ఇంచార్జ్‌గా ఉన్న సీబీఐ పట్ల కేంద్రం ప్రభుత్వం, ప్రధాని మోడీ వ్యవహరించిన తీరు నేరపూరితంగా ఉందని తీర్పు తేల్చింది. రాజకీయ విలువలు, ప్రధాని అన్న స్పృహ ఉంటే సుప్రీం తీర్పు వెలువడిన తర్వాత ప్రధాని పదవికి నరేంద్రమోడీ రాజీనామా చేసేవారు. కానీ అలా జరగలేదు. కాబట్టి ఈ ప్రభుత్వం కొనసాగడానికి వీల్లేదు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని అధికారం నుంచి దింపేయాలి.

సీబీఐలో వివాదం ఇలా...!

సీబీఐలో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదం గతేడాది అక్టోబరు 23న ముదిరి పాకానపడింది. సీబీఐ చీఫ్ అలోక్‌వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్‌ఆస్తానా...ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. మాంసం వ్యాపారి మెయిన్ ఖురేషీని కేసు నుంచి బయటపడేందుకు హైదరాబాద్‌కు చెందిన సతీశ్ సానా నుంచి సీబీఐ చీఫ్ అలోక్ వర్మ రూ.2 కోట్ల లంచం తీసుకున్నారని రాకేష్ ఆస్థానా ఆరోపించారు. రాకేష్ ఆస్థానానే...సానా సతీష్ నుంచి రూ.3 కోట్ల లంచం తీసుకున్నాడని పేర్కొంటూ ముందుగా (2018, అక్టోబరు 15న) అలోక్‌వర్మ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీబీఐలోని నెం.2పై నెం.1 ఇలా ఎఫ్ఐఆర్ దాఖలుచేయటం సీబీఐ చరిత్రలోనే మొదటిసారి. ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారి.. ఇద్దరిపై వేటు పడేవరకు వచ్చింది.

- సీబీఐలో జరుగుతున్న తతంగం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. నిబంధనలను విరుద్ధంగా తనను విధుల నుంచి తప్పించారని అలోక్ వర్మ 2018, అక్టోబరు 23న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలోక్‌వర్మ తొలగింపు వెనుక ప్రధాని మోడీ హస్తమున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. సీబీఐలోని ఉన్నతస్థాయి అధికారులను సెలవుల్లో పంపే విషయమై ఎంపిక కమిటీకి కేంద్రం కనీసం సమాచారం కూడా ఇవ్వలేదు.
- అధికారులపైనే సీబీఐ విచారణ చేస్తుండటంతో దర్యాప్తు సంస్థలపై విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులైన నాగేశ్వర్‌రావు తన బృందంతో కలిసి జరిపిన సోదాల్లో, అలోక్‌వర్మ, ఆస్థానా ఛాంబర్‌లను సీజ్ చేసింది. దాంతోపాటు సీబీఐలో భారీగా జాయింట్ డైరెక్టర్ల బదిలీలు జరిగాయి. బదిలీ అయిన తొమ్మిది మంది అధికారుల్లో ఎక్కువ మంది.. ఆస్థానా వ్యవహారంపై విచారణ చేస్తున్న వారే కావడం గమనార్హం.
- నాగేశ్వర్‌రావు ఒడిషాలో ఐపీఎస్ అధికారిగా పని చేసినప్పుడు అక్రమాలకు పాల్పడ్డారనీ, ఇప్పుడు ఆయనకు సీబీఐలో అగ్రస్థానం కట్టబెట్టడమేంటనీ ఆరోపణలు వచ్చాయి. రాకేశ్ ఆస్థానాను రక్షించేందుకే అలోక్‌వర్మపై వేటు వేశారని సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ఆరోపించారు. అంతేకాక నాగేశ్వరరావు నియామకాన్ని కూడా ప్రశాంత్ భూషణ్ తప్పుబట్టారు.

హరీశ్‌కు ఆ శాఖ దక్కేనా..!

రాజకీయ, నీటిపారుదల వర్గాల్లో చర్చ

- సీఎం వద్దే ఉంచుకునే అవకాశం?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో కీలకమైన నీటిపారుదల శాఖ ఎవరికి దక్కుతుందనే చర్చ జరుగుతున్నది. అటు రాజకీయ వర్గాల్లోనూ, నీటి పారుదల శాఖలోనూ గత కొద్ది రోజులుగా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల దృష్ట్యా నీటిపారుదల శాఖ ఏరకంగా చూసినా మొదటి స్థానంలో ఉందని చెప్పవచ్చు. సీఎం కేసీఆర్ కూడా రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సమీక్షా సమావేశం ప్రాజెక్టులపైనే నిర్వహించారు. ఆ తర్వాత రెండ్రోజుల పాటూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల స్థితిగతులు, అక్కడ జరుగుతున్న పనులు తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని విశ్రాంత ఇంజినీర్లను సీఎం కోరారు. విశ్రాంత ఇంజనీర్లు ప్రాజెక్టులను పరిశీలించి వచ్చి ఇచ్చిన నివేదికపై సీఎం రెండవ సారి సోమవారం సమీక్ష జరిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీనియర్ నాయకుడైన హరీశ్‌రావుకు నీటిపారుదల శాఖను కేటాయించారు. సీఎం ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసిన హరీశ్‌రావు ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించారు. అధికారులతో నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహించటమే కాక రెండు మూడు రోజులకొకసారి ప్రాజెక్టుల వద్దకు వెళ్లి పనులను స్వయంగా పరిశీలించారు. నెలకొకసారి ప్రాజెక్టుల వద్దే నిద్రించి అక్కడే పనులను సమీక్షించేవారు. మిగిలిన మంత్రుల కన్నా మెరుగైన పనితీరు కల్పించటం ద్వారా ఆయన అనేక సార్లు ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్నారు. గోదావరి, కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించిన అంతరాష్ట్ర వివాదాలు పరిష్కరించటంలో హరీశ్‌రావు పాత్రను ముఖ్యమంత్రి అనేక సార్లు కొనియాడారు. రాష్ట్రంలో అతి పెద్ద ప్రాజెక్టుగా భావిస్తున్న కాళేశ్వరానికి మహారాష్ట్ర నుంచి అనుమతులు తీసుకురావటంలో హరీశ్‌రావు కృషి ఎంతో ఉందని నీటిపారుదల వర్గాలు చెప్తుంటాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, అక్కడి జలవనరుల శాఖ మంత్రితోనే కాకుండా ఆ రాష్ట్ర అధికారులతో కూడా నిరంతం మాట్లాడుతూ అనుమతుల కోసం మార్గం సుగమం చేశారని టీఆర్ఎస్ వర్గాలు కూడా అంటున్నాయి.

నీటిపారుదల చుట్టూ రాజకీయం...

ప్రాజెక్టుల వ్యవహారాలు, వాటి నిర్మాణ ప్రగతి వంటి విషయాలన్నీ గత మూడు వారాలుగా ముఖ్యమంత్రి స్వయంగా చూసుకుంటున్నారు. దీనితో ఆ శాఖను సీఎం తన వద్దే ఉంచుకుంటారనే రాజకీయ వర్గాలతో పాటు నీటిపారుదల వర్గాలు కూడా భావిస్తున్నాయి. ఇటీవల సీఎం తీసుకున్న కొన్ని నిర్ణయాలతో కూడా ఈ వాదన బలపడుతున్నది. సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు సాగునీటి బాధ్యతలు అప్పగించటం, హరీశ్‌రావు మంత్రిగా ఉన్నకాలంలో ఆయన వద్ద ఓఎస్డీగా పనిచేసిన శ్రీధర్‌రావు దేశ్‌పాండేను సీఎం కార్యాలయంలో ఓఎస్డీగా నియమించటంతో ఈ వాదనలు మరింత బలపడ్డాయి. రాబోయే ఐదేండ్ల కాలంలో రూ. లక్షన్నర కోట్లకు పైగా ఖర్చుపెట్టి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్న సీఎం ముందు అనేక ప్రత్యామ్నాయాలున్నాయి. తనవద్దే ఈ శాఖను ఉంచుకోవటమా లేక అనుభవ రీత్యా హరీశ్‌రావుకే మళ్లీ ఈ శాఖ అప్పగించటమా అనే అంశంపై ఇప్పటికే ఆయన ఒక అభిప్రాయానికి వచ్చాని తెలుస్తున్నది. మరో ప్రత్యామ్నాయంగా తనకు అత్యంత విధేయుడైన వ్యక్తికి నీటిపారుదల శాఖను అప్పగించే అవకాశం లేకపోలేదనే చర్చ కూడా జరుగుతున్నది. హరీశ్‌రావుకు నీటిపారుదల శాఖ దక్కక పోతే వ్యవసాయం, విద్యుత్ శాఖల్లో ఒకటి కేటాయిస్తారనే ప్రచారం కూడా పార్టీ వర్గాల్లో జరుగుతున్నది.

కాశ్మీర్ సమస్యను మిలిటరీ ద్వారా పరిష్కరించలేం

భారత్ పాక్‌ల చర్చల వల్లే సాధ్యం

- ఇరుదేశాలు కోరుకుంటే మధ్యవర్తిత్వానికి సిద్ధం : నార్వే ప్రధాని ఎర్నాసోల్‌బర్గ్



న్యూఢిల్లీ: కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చుని, దీన్ని మిలిటరీ ద్వారా పరిష్కరించలేమని నార్వే ప్రధాని ఎర్నాసోల్‌బర్గ్ అన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆమె భారత్‌కు వచ్చారు. పలు ద్వైపాక్షిక అంశాలపై ప్రధాని మోడితో చర్చించనున్నారు. న్యూఢిల్లీలో గ్రీన్ నార్వేజియన్ రాయభార కార్యాలయాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శాంతిని నెలకొల్పడానికి బయటి దేశాలకు సాధ్యం కాదని, అది అంతర్గతంగా మొదలవ్వాలని ఆమె అన్నారు. భారత్ పాక్‌లు అటువంటి చర్చల వాతావరణాన్ని కోరుకుంటే. తమతో పాటు ఇతర దేశాలు కూడా మధ్యవర్తిత్వం వహించి సాయపడగలవని ఆమె తెలిపారు. కాగా గతేడాది నవంబర్‌లో నార్వే మాజీ ప్రధాని జెల్ మాగ్నే బోండేవిక్ భారత్‌లో పర్యటించారు. ఆయన శ్రీనగర్‌కు వెళ్లి అక్కడ హురియత్ కాన్ఫరెన్స్ నేతలు సయ్యద్‌అలీ గిలానీ, మిర్వాజ్‌ఉమర్ ఫరూక్ లతో కాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి చర్చించారు. అనంతరం ఆయన పాక్ ఆక్రమిత కాశ్మీర్ రాజధాని ముజఫరాబాద్‌కు వెళ్లి అధ్యక్షుడు సర్దార్ మసూద్ ఖాన్‌తో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ...ఇది అతని వ్యక్తిగత విషయమని, దీనికి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధంలేదనీ, తన స్వచ్ఛంద సంస్థ తరఫున ఆయన వచ్చాడని తెలిపారు. ఈ విషయంలో తమ స్పష్టమైన విధానాన్ని కలిగి ఉన్నామని వెల్లడించారు. ఎవరికైనా సహాయం కావాల్సివస్తే వారే అడగాలన్నది తమ విధానమని స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మిలిటరీ ద్వారా పరిష్కరిస్తే అక్కడ దీర్ఘకాలిక శాంతిని నెలకొల్పలేరని తెలిపారు. ఇది ఒక కాశ్మీర్‌లోనే కాదు, సిరియాలోనైనా, మరేయితర ప్రాంతానికైనా వర్తిస్తుందని ఆమె అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.